
اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيمَ

# శాంతిబాట

సంతోషమయ జీవనానికి మార్గదర్శి

సంపుటి 2 సంచిక 2 సెప్టెంబర్ 2010 రూ. 17/-



يَوْمَئِذٍ يُوَفِّيهِمُ اللهُ دِينَهُمُ الْحَقَّ وَيَعْلَمُونَ أَنَّ اللهَ هُوَ الْحَقُّ الْمُبِينُ

ఆ రోజు! అల్లాహ్ వారికి, (వారి కర్మలకు) పూర్తి ప్రతిఫలము నిస్తాడు. మరియు నిశ్చయంగా, అల్లాహ్! ఆయనే పరమ సత్యం అని వారు తెలుసుకుంటారు (ఖుర్'ఆన్ 24:25)

**That Day, ALLAH will pay them in full their true [i.e., deserved] recompense, and they will know that it is ALLAH who is the manifest TRUTH [i.e., perfect in justice]. (Qur'an 24:25)**

జీవనోపాధి ప్రదాత

الرَّزَّاق

అర్రజ్జాఖ్

**The Provider**

الله

పరమ సత్యం

الْحَقّ

అల్-హఖ్ఖ్

**The Truth**

అల్లాహ్

إِنَّ اللهَ هُوَ الرَّزَّاقُ ذُو الْقُوَّةِ الْمَتِينُ

నిశ్చయంగా, అల్లాహ్! ఆయన మాత్రమే ఉపాధి ప్రదాత, మహా బలవంతుడు, స్థైర్యం గలవాడు

(ఖుర్'ఆన్ 51:58)

**Indeed, it is ALLAH who is the [continual] PROVIDER, the firm possessor of strength (Qur'an 51:58)**

చెప్పు : " ఆయనే అల్లాహ్! ఒక్కడు. అల్లాహ్ ఎవరి అక్కరా లేనివాడు. ఆయనకు సంతానం లేదు మరియు ఆయన ఎవరి సంతానమూ కాడు. మరియు ఆయనతో పోల్చదగినది ఏదీ లేదు. (ఖుర్'ఆన్ 112:1-4)

రమదాన్-షవ్వాల్ హి.1431

# శాంతిబాట

మాసపత్రిక రూ. 17/-

సంపుటి 2 సంచిక 2 సెప్టెంబర్ 2010

2-8-31, కోటబజార్, సామర్లకోట 533 440

Email:velugubaata@gmail.com

Cell : 9491103017

3 **అరబీ భాషలో సర్వమానవాళికి అల్లాహ్ యొక్క సందేశం:** ఖుర్'ఆన్ గ్రంథ అధ్యయనానికి ప్రోత్సాహం - సూరహ్ అల్-బఖరా తఫ్సీర్ ప్రారంభం - 3వ ఆయత్‌కు వివరణ...

6 **ప్రపంచ శాంతిదూత 'ముహమ్మద్(స)' వారి బోధనలు, ఆచరణలు :** సమాజంలోని సమస్యలకు పరిష్కార మార్గం - ఈ నెల ప్రత్యేకం : ఉత్తమ సమాజం - వ్యాపారం ...

10 **రెండవ ఖలీఫా ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) వారి జీవిత చరిత్ర**

15 **తిరిగి గూటికి :** ఏ సృష్టి ధర్మంతో బిడ్డ జన్మించిందో, తిరిగి ఆ ధర్మానికే చేరుకున్న సోదరుడు లేదా సోదరి గురించి (వారి మాటలలో). నవముస్లిముల సమస్యలపై ప్రత్యేక వ్యాసం - బిలాల్ (రజి) ...

23 **ముహమ్మద్(స) వారి జీవిత చరిత్ర :** ప్రవక్త(స)వారి జననానికి ముందు జరిగిన కొన్ని ముఖ్య సంఘటనలు ...

28 **ఖుర్'ఆన్‌ను అర్థం చేసుకుంటూ చదువుదాం :** నెలకు 24 అరబీ పదాల చొప్పున 30 నెలలలో ఖుర్'ఆన్‌లోని 80 శాతం పదాలను నేర్పించాలని...

29 **టెర్రరిజం :** టెర్రరిజానికి ఏ మతం పేరును అతికించకుండా, 'ఇస్లామ్'నే అతికించి ముస్లిములనే టార్గెట్‌గా ఎందుకు పెట్టుకున్నారు? కనులు మూసుకున్న మీడియా యొక్క కనులు తెరిపించే ప్రయత్నం. సెప్టెంబర్ 11, 2001 ట్విన్ టవర్స్‌పై దాడి - కారకులెవరు? దాడికి కారణం బిన్ లాడెన్ కాదు!? FBI దగ్గర ఎటువంటి సాక్ష్యం లేదు - పరిశోధనాత్మక వ్యాసం

34 **బాలబాలికలకు ప్రత్యేకం :** హఖ్ఖ్ (సత్యం)

36 **ధర్మసందేశ ప్రచారం :** ప్రస్తుతం సమాజంలో అనుసరిస్తున్న కొత్త పోకడల గురించి .... ఖుర్'ఆన్ మరియు సున్నత్ వెలుగులో సందేశాన్ని అందించే విధానాల పరిచయం. ముష్రిక్ అంటే ఎవరు? ...

40 **పాఠకుల అభిప్రాయాలు**

ఎడిటర్:

**ఎమ్‌డి. అతహరుల్లా**

**ఎడ్వాయిజరీ బోర్డ్:**

డా॥ సలీమ్ పాషా

డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు

ఎమ్‌డి. అఫ్వాన్ ఉమ్రీ

**Printed by**
Md. Athaharullah

**Published by**
Md. Athaharullah

**Owned by**
Velugubaata Educational Society
(R.No. 569/2008), Samalkot-533440
and

**Printed at**
'*Akash Industries*',G-14, Industrial Estate, Samalkot - 533440
and

**Published at**
2-8-31, Kota Bazar,
Samalkot - 533440,

**Editor:** Md. Athaharullah
Phone : 9347046090,
Email: velugubaata@gmail.com
RNI Regd. No. APTEL/2009/29650

**Production Incharge**
T. Srinivasa Rao
(Zakir)

**సంవత్సర చందా:**

**రూ. 200/-**

*For online payments, Please contact Dr. N. Srinivasa Rao (Cell: 9491103017)*

M.O. చేయవలసిన చిరునామా:

**వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ**
2-8-31, కోట బజార్,
సామర్లకోట-533440

మీ పూర్తి ఎడ్రస్‌ను, ఫోన్ నెంబర్లతో సహా **M.O.** ఫారమ్‌పై వ్రాయండి.
లేదా
క్రింది నెంబర్‌కు
మీ వివరాలను **SMS** చేయండి.
**Cell : 9491103017**

ఈ పత్రికలో ప్రచురించిన వ్యాసాల గురించిగాని, లేదా ఇతర వివరాలకుగాని సంప్రదించండి
**డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు,** *M.Sc.,Ph.D.* **Cell : 9491103017**

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్ (అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో)

# మీడియా పతాక శీర్షికలు

మన సమాజంలో ఎన్నో మంచి కుటుంబాలు ఉన్నాయి. ఇటువంటి మంచి కుటుంబాలలో ఓ కుటుంబానికి సంబంధించి కొన్ని తరాలుగా వారి పూర్వీకులు మంచివారై ఉండి, సమాజానికి ఎంతో మేలు చేశారనుకుందాం. కాని వారిలో ఎవడో ఒక్కడు మాత్రం దుర్మార్గుడు అయినంత మాత్రాన, కేవలం ఆ దుర్మార్గుడు చేసిన పనులనే చూపిస్తూ, ఆ కుటుంబాన్ని మరియు వారి పూర్వీకుల్ని దుర్మార్గులుగా చిత్రీకరించడం సంస్కారమనిపించు కుంటుందా? ఆ విధంగా చూపడాన్ని సంస్కారం కాదని సభ్య సమాజం చెబుతుంది. కాని నేడు మన సమాజంలో అటువంటి చిత్రీకరణనే సంస్కారంగానూ మరియు ఆదర్శంగానూ తీసుకున్న ఏకైక వ్యవస్థే మన మీడియా.

**పచ్చకామెర్లు వచ్చినవాడికి లోకమంతా పచ్చగా కనిపిస్తుందంటారు.** కాని లోకమంతా పచ్చగా కనిపించాలని పచ్చకళ్ళజోడు పెట్టుకుంటే? ఆశ్చర్య పోనవసరం లేదు. ప్రస్తుతం అటువంటివారే ఎక్కువగా ఉన్నారు.

గత రెండు నెలలుగా మన రాష్ట్రంలో జరిగిన పరిణామాలనే పరిగణనలోకి తీసుకోండి. ఓ జాతీయపార్టీవారు ఒక న్యూస్ ఛానల్ మరియు న్యూస్ పేపర్ ఆఫీస్‌పై దాడిచేశారు. ఆ పార్టీకి వ్యతిరేకంగా వ్రాతలు వ్రాశారని స్వయంగా మంత్రులే ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. అదే పార్టీ గురించి చాలా ఘోరంగా వ్రాసిన ఇతర పేపర్లపై ఏనాడూ దాడిచేయని వీరు, ఈ పేపర్‌పైనే ఎందుకు దాడిచేశారని అడిగితే, 'ఇది మా పార్టీవారి పేపర్ కాబట్టి మా గురించి విమర్శించకూడదు' అని సమాధాన మిచ్చారు.

ఒక్కొక్క మీడియా సంస్థ ఒక్కొక్క పార్టీకి కొమ్ము కాస్తుందని అందరికీ తెలుసు. అది బహిరంగ రహస్యమే. కాని ఆ జాతీయపార్టీవారు బహిరంగంగా మీడియా ముందే దాదాగిరి చేసి అసలు విషయాన్ని బయటపెట్టేశారు.

కాబట్టి మీడియా తన అనుకూల పార్టీ కళ్ళజోడునే ధరించి, అసలు నిజాలను కాకుండా ఆ కళ్ళజోడు చూపించే వాటినే నిజమని వ్రాయాలి. వ్రాయడమే కాదు. ప్రజల చేత వాటిని నిజమని నమ్మించాలి.

మరో రకమైన కళ్ళజోడు కూడా ఉందండి. దాని గురించి వివరించడానికి మా అనుభవాన్ని ఒకదాన్ని ఇక్కడ చెప్పాలి. మా టీమ్‌లోని ఒకరు నీటి కాలుష్యంపై పరిశోధన చేసి, ఆ పరిశోధనా ఫలితాలను కేవలం సైంటిస్ట్‌లకే కాకుండా సామాన్య ప్రజలకు కూడా తెలియజేసి వారికి మేలు చేయాలనే ఉద్దేశ్యంతో అప్పట్లో మంచి సర్క్యులేషన్ ఉన్న ఓ న్యూస్‌పేపర్‌ని సంప్రదించడం జరిగింది. ఆ పేపర్ వారు ఓ ప్రాంతీయ పార్టీకి పూర్తిగా అనుకూలంగా పనిచేసేవారు. ఈ ఫలితాలను పేపర్లో ప్రచురిస్తే, వారి పార్టీకి నష్టం కలుగుతుందేమోనని వారు భావించినందువలన, ఇచ్చిన 6 పేజీల ఫలితాల నుండి కేవలం ఓ రెండు లైన్లు తీసుకుని తమ జిల్లా ఎడిషన్‌లో ఎవరూ పెద్దగా పట్టించుకోని చోట ప్రచురించారు. మా శాంతిబాట టీమ్‌లోని వారెవరూ వ్యక్తిగత పేరు ప్రఖ్యాతల కొరకు ప్రాకులాడరని మా పాఠకులకు తెలిసిన విషయమే! పేరుకోసం ఆ ఫలితాలను సదరు పత్రికవారికి ఇవ్వలేదు. ప్రజాప్రయోజనం కొరకు మాత్రమే ఇవ్వడం జరిగింది.

కాని ఆ తరువాత ఆ పార్టీ ఓడిపోయి మరో పార్టీ అధికారంలోకి వచ్చింది. ఆశ్చర్యమేమిటంటే, అదే న్యూస్ పేపర్‌లో మొదటి పేజీలో మొదటి లైనులో అంటే పతాక శీర్షికలో పెద్ద పెద్ద అక్షరాలతో నీటి కాలుష్యంపై ప్రజలను భయభ్రాంతులను చేసే విధంగా ఓ కథనం ప్రచురించబడింది. ఆ ఏరియాలో డాక్టర్ల బృందం సర్వే చేసినట్లు, వారంతా అక్కడి నీటి విషయంలో అనుమానపడినట్లు, ఆ విషయాన్ని ధృవీకరించు కోవడానికి సెంట్రల్ లేబరేటరీలకు వాటర్ శాంపిల్స్ పంపిస్తున్నట్లు వ్రాశారు. ముందుగా మేమిచ్చిన ఫలితాలను అప్పుడే ప్రచురించి ఉంటే, ఇప్పుడు ఎవరూ అనుమానించ నవసరం లేకుండా నిజం తెలిసి ఉండేది. ప్రజలు ముందు జాగ్రత్త తీసుకునే అవకాశం కూడా ఉండేది. ఒకనాడు పనికి రాదనుకున్న న్యూస్ ఈ రోజు పతాక శీర్షిక అయిపోయింది.

ప్రజాప్రయోజనం మీడియా సంస్థలకు అవసరం లేదు. ఓ మీడియా సంస్థ తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చాలా **చిన్న**విగా చూపించిన ప్రజా సమస్యలను, తమకు వ్యతిరేకమైన పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడు వాటినే **పెద్ద సమస్యలు**గా చూపించి ప్రజలను భయభ్రాంతులను చేస్తుంది. అంటే వీరు ధరించిన కళ్ళజోడు తమ పార్టీకి వ్యతిరేకంగా ఉన్న వాటిని చాలా చిన్నవిగానూ, వ్యతిరేక పార్టీవారి విషయంలో వాటిని చాలా పెద్దవిగా చూపిస్తుంది.

మన రాష్ట్రంలో గత రెండు సంవత్సరాలలో ఎందరో అమ్మాయిలపై యాసిడ్ దాడులు జరిగాయి. "ఫలానా ఊరిలో ఓ యువకుడు ఓ అమ్మాయిపై దాడి చేశాడు" అని మీడియా వ్రాస్తుంది. ఆ యువకులలో ఒక్కడు కూడా ముస్లిమ్ కుటుంబంలో పుట్టినవాడు లేడు. ఒకవేళ పొరపాటున వారిలో ఏ యువకుడైనా 'ముస్లిమ్' అయి ఉంటే, వాడు చేసిన దానికి బదులుగా 'ఇస్లామ్' పేరును అపహాస్యం చేసే విధంగా ఎన్ని కథనాలు, ఎన్ని చర్చలు మీడియాలో వచ్చేవో! మన సెక్యులర్ దేశంలో రాజ్యాంగం ద్వారా స్వేచ్ఛపొందిన మీడియా మతదురభిమానాన్ని వెళ్ళగక్కడానికి గోతికాడ గుంటనక్కలా ఎప్పుడూ ఎదురుచూస్తూ ఉంటుంది. కారణమేమిటి? నైతిక విలువలను గాలికి వదిలేసారు. **మీడియా ఇప్పుడు ఓ వ్యాపారరంగం అయిపోయింది.** తమకు అనుకూలంగా లేనివారిని బ్లాక్‌మెయిల్ చేస్తుంది. ఈ విషయం ప్రజలకు కూడా అర్థమౌతూ ఉంది.

ఓ కుటుంబంలో ఎవరో ఒక్కడు నేరం చేస్తే, ఏ దేశంలోనైనా సరే, ఆ ఒక్కడినే శిక్షిస్తారు. ఆ కుటుంబానికి ఎటువంటి శిక్ష విధించరు. కాని ఎక్కడో ఆఫ్ఘనిస్తాన్‌లో లేదా పాకిస్తాన్‌లో ఎవడో ఏదో చేస్తే, మనదేశంలోని ముస్లిములు నేరం చేసినట్లు, ఇక్కడివారిని వేదనకు గురిచేస్తూ కథనాలు వ్రాస్తారు. ఈ మీడియా సంస్థలలో పనిచేసేవారు చదువుకున్నవారే. మరి ఆ చదువులు వారికి సంస్కారాన్ని నేర్పలేదా? 'ఇస్లామిక్ తీవ్రవాదం' అంటూ నీచంగా వ్రాసే తమ మీడియా సంస్థను, ఆ సంస్థలో పనిచేసే సంస్కారవంతులెవరైనా ఎందుకు నిలదీయరు? సంస్కారం మరియు బాధ్యత లేకపోవడం వల్లనే నిలదీయడం లేదా? వారికి నిలదీసే స్వేచ్ఛ లేదా? అదే నిజమైతే రాజ్యాంగం ఇచ్చిన పత్రికా స్వేచ్ఛను ఎవరు అనుభవిస్తున్నారు?

\- శాంతిబాట టీమ్



# అరబీ భాషలో
# సర్వమానవాళికి అల్లాహ్ యొక్క సందేశం

بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ

అనంత కరుణామయుడు, అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో

12

## ఖుర్'ఆన్ తఫ్సీర్

**2. సూరహ్ అల్-బఖరా**

(గత సంచిక తరువాయి)

క్రిందటి సంచికలో మార్గదర్శకత్వం (హిదాయత్) రెండు రకాలు అని చెప్పుకున్నాం. రెండవది :

'హుదా' అంటే సత్యాన్ని వివరించడం, మార్గాన్ని తెలియజేయడం మరియు దానివైపు మరల్చడం. ఇది అర్థం కావడానికి వేరే సూరహ్‌లలోని రెండు ఆయత్‌లను ఇక్కడ అందిస్తున్నాము.

"... **మరియు నిశ్చయంగా, నీవు (ప్రజలకు) ఋజుమార్గం వైపునకు దారి చూపుతున్నావు** " (ఖుర్'ఆన్ 42:52)

"... **వాస్తవానికి నీవు కేవలం హెచ్చరిక చేసేవాడవు మాత్రమే! మరియు ప్రతిజాతికి ఒక మార్గదర్శకుడు వచ్చి ఉన్నాడు** ..." (ఖుర్'ఆన్ 13:7)

ప్రతీ మనిషికి అల్లాహుతాలా రెండు మార్గాలను చూపించడం జరిగింది.

"**మరియు అతనికి (మంచీ-చెడూ అనే) స్పష్టమైన రెండు మార్గాలను చూపాము.**" (ఖుర్'ఆన్ 90:10)

మనిషి ఆ మార్గాలలో ఏ మార్గాన్ని ఎంచుకుంటాడో, ఆ మార్గం పైనే అతని ప్రతిఫలం ఆధారపడి ఉంటుంది. ఈ విషయం క్రింది వాక్యం ద్వారా తెలుస్తుంది.

"**మరియు స'మూద్ వారి విషయం : మేము వారికి మార్గదర్శ కత్వం చేశాము. కాని వారు మార్గదర్శకత్వానికి బదులు గ్రుడ్డి తనాన్నే ఇష్టపడ్డారు. చివరకు వారి (దుష్ట) కర్మలకు ఫలితంగా, వారిపై పిడుగులాంటి అవమానకరమైన శిక్ష పడింది.**" (ఖుర్'ఆన్ 41:17)

సూరహ్ అల్-బఖరాలోని 3వ వాక్యం మరియు దాని వివరణ

**3. ఎవరైతే అగోచర యథార్థాన్ని విశ్వసిస్తారో, సలాత్ (నమాజ్)ను స్థాపిస్తారో మరియు మేము ప్రసాదించిన జీవనోపాధి నుండి (మా మార్గంలో) ఖర్చు చేస్తారో**

"**ఎవరైతే అగోచర యథార్థాన్ని విశ్వసిస్తారో** " (యూమినూన బిల్ గైబ్). ఇందులో రెండు ముఖ్యమైన పదాలున్నాయి. అవి: 1. **ఈమాన్** మరియు 2. **గైబ్**

ఎవరైనా 'ఈమాన్' మరియు 'గైబ్' అర్థాలను పూర్తిగా అర్థం చేసుకుంటే ఈమాన్ యొక్క ముఖ్య వాస్తవికతను అర్థం చేసుకో గలుగుతారు.

**ఈమాన్ :**

భాషాపరంగా నయితే, 'ఈమాన్' అనే పదానికి అర్థం - ఎవరైనా చేసిన ప్రకటనను అతనిపైనున్న నమ్మకంతో దానిని పూర్తిగా విశ్వసించడం. మనం పరిశీలించదగిన ఏదైనా ఓ సత్యానికి సంబంధించి ఎవరైనా చెబితే దానిని గనుక మనం ధృవపరిస్తే, అది ఈమాన్ కాదు.

ఉదాహరణకు ఎవరైనా ఓ వస్తువును తెల్లగా ఉంది అని చెబితే, దానిని చూచి మనం 'అవును, అది తెల్లగా ఉంది' అని చెబితే అది ధృవీకరణ (తస్‌దీఖ్) మాత్రమే అవుతుంది. ఇటువంటి ధృవీకరణ మన వ్యక్తిగత పరిశీలనపై ఆధారపడి ఉంటుంది గాని, ఆ ప్రకటన చేసిన వ్యక్తిపై మనకున్న విశ్వాసంపై ఆధారపడినది కాదు.

షరీయా పదాల అర్థాలను బట్టి, **ఈమాన్** అంటే ప్రవక్త(స)వారు చెప్పిన వాటిపై మాత్రమే, ఆయన(స)పై ఉండే నమ్మకంతో ధృఢ విశ్వాసాన్ని కలిగి ఉండటం మరియు వీటిలో మన వ్యక్తిగత పరిశీలన యొక్క అవసరం లేదు.

ఇబ్నె కసీర్ తన తఫ్సీర్‌లో ఈ విషయంపై అత్తబరీ వ్యాఖ్యానాన్ని అందించారు. దాని నుండి ఈమాన్ అంటే **నమ్మకం**, ఈమాన్ అంటే **సత్కార్యాలు** మరియు ఈమాన్ అంటే **దైవభీతి** కలిగి ఉండటం. కనిపించని విషయాలపై విశ్వాసాన్నుంచి నోటితో పలుకడం కూడా **ఈమాన్** అవుతుంది. ఈ వివరణలకు ఆధారాలుగా వివిధ సూరహ్‌ల లోని ఆయత్‌లను అందించారు. ఉదా:

**నమ్మకం**

"... అతను అల్లాహ్‌ను విశ్వసిస్తాడు మరియు విశ్వాసులను నమ్ముతాడు ..." (ఖుర్'ఆన్ 9:61)

*యూసుఫ్(అ)వారి సోదరులు తన తండ్రితో చెప్పిన మాటలు :*

"... మరియు మేము సత్యం పలికినా నీవు మా మాట నమ్మకపోవచ్చు ..." (ఖుర్ఆన్ 12:17)

పై రెండు వాక్యాలలో **ఈమాన్** అనే పదం ఉపయోగించబడింది. వాటిలో దాని అర్థం నమ్మకం.

### సత్కార్యాలు

"కాని విశ్వసించి, సత్కార్యాలు చేసేవారు తప్ప!..." (ఖుర్ఆన్ 95:6)

### ఖష్యా (దైవ భీతి)

"నిశ్చయంగా, ఎవరైతే అగోచరుడైన తమ ప్రభువుకు భయపడతారో! వారికి క్షమాపణ మరియు గొప్ప ప్రతిఫలం ఉంటాయి." (ఖుర్ఆన్ 67:12)

"అగోచరుడైన ఆ కరుణామయునికి భయపడే వానికి మరియు మా వైపు పశ్చాత్తాప హృదయంతో మరలేవానికి! ఇందు (స్వర్గం)లో, శాంతితో ప్రవేశించండి. ఇదే శాశ్వత జీవితదినం" (ఖుర్ఆన్ 50:33&34)

అంటే దైవభీతి కూడా 'ఈమాన్' అవుతుంది.

### ఈమాన్ మరియు జ్ఞానానికి కేంద్రకం దైవభీతే!

"... నిశ్చయంగా అల్లాహ్ యొక్క దాసులలో జ్ఞానం గలవారు మాత్రమే ఆయనకు భయపడతారు ..." (ఖుర్ఆన్ 35:28)

జ్ఞానానికి మరియు దైవభీతికి మధ్యనుండే సంబంధం గురించి ఇంతకు ముందరి శాంతిబాట సంచికలలో వివరించాము.

గైబ్ పదానికి భాషాపరమైన అర్థం-(1) మనిషికి స్పష్టంగా తెలియనివి లేక (2) మన ఐదు ఇంద్రియాల ద్వారా గ్రహించలేని విషయాలను తెలియజేసే పదమే గైబ్.

ఖుర్ఆన్‌లో ఈ పదం ఉపయోగించబడింది. ఖుర్ఆన్ ప్రకారంగా ఈ పదం యొక్క అర్థం : మన పంచేంద్రియాలు గ్రహించలేని లేక ఏదైనా ఓ కారణం ద్వారా తెలుసుకోలేని విషయాలు. వాటి గురించి మన ప్రవక్త(స)వారు సర్వమానవాళి కొరకు తెలియజేశారు.

ఈ అగోచర విషయాలు (కంటికి కనిపించని విషయాలు) ఏమిటి?

అల్లాహ్ యొక్క గుణాలను తెలిపే పదాలున్నాయి. *వాటి సారం, మన గమ్యానికి సంబంధించిన విషయాలు, స్వర్గం మరియు నరకం, వాటిలో ఏముంటాయి? తీర్పు దినం మరియు ఆ రోజు ఏమేమి జరగుతాయి? దివ్యగ్రంథాలు, ముహమ్మద్(స)వారి కంటే ముందు* పంపబడిన ప్రవక్తలు. ఇవి అన్నీ కూడా అగోచర విషయాలు. మనం కళ్ళతో చూడలేదు. మన ప్రవక్త ముహమ్మద్(స)వారికి అల్లాహ్ పంపిన సందేశాన్ని మనకు ఆయన తెలియజేశారు. మనం దానిని విశ్వసిస్తున్నాము. అదే 'ఈమాన్'.

క్రిందటి సంచిక వెనుక కవర్‌పై కొన్ని ఆయత్‌లను అందించాము. వాటిలోని 285వ ఆయత్‌లో పై విషయాలు ఉంటాయి.

ఇస్లామీయ విశ్వాసంలోని ముఖ్యమైన సారం అంతా పై విషయాలలోనే ఉంది.

తఫ్సీర్ ఇబ్నె కసీర్‌లో గైబ్ వివరణలో ఓ హదీస్ ప్రస్తావన వచ్చింది. ఆ హదీస్ ముస్నద్ అహమద్ (4:106)లోనిది. అబూ ఉబైదా(రజి) ప్రవక్త(స)వారిని అడిగారు "ఓ రసూలల్లాహ్! మాకంటే మేలైన ప్రజలుంటారా? మేము మీతో ఇస్లామ్ స్వీకరించాము మరియు మీతో జిహాద్‌లో పాల్గొన్నాము". ఆయన(స) చెప్పారు, "అవును, ఎవరైతే మీ తరువాత వస్తారో, వారు నన్ను విశ్వసిస్తారు నన్ను చూడకపోయినప్పటికీ."

ఇస్లామ్ యొక్క 5 మూల స్తంభాలలో మొట్టమొదటిది 'ఈమాన్' (విశ్వాసం). ఇది లేకపోతే మిగతా 4 లేనట్లే. ఇంతటి అతి ముఖ్యమైన "ఈమాన్"పై హేతువాదులుగాని, నాస్తికులుగాని బురదజల్లే అవకాశం ఉంది.

**"మీరు అగోచర విషయాలపై విశ్వాసం ఉంచుతున్నారు. ఏ కారణం లేకపోయినా సరే మీరు విశ్వసిస్తున్నారు. మీది మూఢ విశ్వాసం. అది నిజం కాదు. మీ ధర్మం సత్య ధర్మం అంటున్నారు గాని మీరు వేసిన తొలి అడుగే - తెలియని వాటిని నమ్మడం" అని హేతువాదులుగాని, నాస్తికులుగాని అడిగితే మీరు ఏమి సమాధానం చెబుతారు?**

పై ప్రశ్నకు చాలా స్పష్టమైన జవాబు చెప్పవచ్చు. "ఇస్లామ్ మూఢ విశ్వాసం కాదని, అది సత్యధర్మం" అని ఎటువంటి అనుమానాలకు తావు లేకుండా సులభంగా చెప్పవచ్చు. ఆలోచించండి!

పై ప్రశ్నకు జవాబును ఇన్షా అల్లాహ్ ఓ వ్యాస రూపంలో వచ్చే సంచికలో అందిస్తాం.

'ముస్లిములం' అని చెప్పుకునేవారిలో మరియు రోజూ మస్జిద్‌కు వచ్చి నమాజ్ చేసేవారిలో కూడా కొందరు ఇలా చెప్పడం విన్నాము - "స్వర్గం, నరకం ఉన్నాయో? లేదో? మనం చూసొచ్చామా?".

అగోచర విషయాల(గైబ్)ను విశ్వసించకపోతే ఈమాన్ లేనట్లే. **ఈమాన్ లేనివాడు ముస్లిమ్ ఎట్లా కాగలడు?**

ఇటువంటివారికి కూడా మా పాఠకులు స్పష్టంగా సమాధానం చెప్ప గలగాలి అనేది మా సంకల్పం. ఇన్షా అల్లాహ్ వచ్చే సంచికలో మా జవాబు కొరకు చూడండి.

**సలాత్** (నమాజ్)**ని స్థాపించడం :**

దైవభీతిగల వారి యొక్క రెండవ గుణం - "సలాత్‌లో స్థిరంగా ఉండటం". ఈ 3వ ఆయత్‌లో ఉపయోగించబడిన క్రియా పదం - '**యుఖీమూన**' అంటే '**వారు స్థాపించారు**'. ఈ పదం '**ఇఖామా**' (నిలుచోవడం) అనే పదం నుండి ఉత్పన్నమైంది.

సాధారణంగా మనదేశంలోని ముస్లిమ్ సోదరులు **నమాజ్** అనే పదాన్ని ఉపయోగిస్తారు. వాస్తవానికి ఇది అరబీ పదం కాదు. 'నమాజ్' అనే పదాన్ని ఖుర్ఆన్‌లోగాని, ముహమ్మద్(స)వారి బోధనలలోగాని ఎక్కడా ఉపయోగించ లేదు.

మనం **సలాత్** అనే అరబీ పదాన్నే ఉపయోగించాలి. మనం రోజూ వినే 'అజాన్'లో 'హయ్యు అలస్సలా' (ప్రార్థన వైపుకు రండి) అని వింటున్నాము. 'సలాత్'అనే పదం తరువాత దానితో పాటు మరో పదం కూడా వచ్చినప్పుడు 'సలాత్'అని పలకాలి. కేవలం 'సలాత్' అనే పదం ఒక్కటే చెప్పవలసి వచ్చినా, లేక వాక్యం చివరిలో చెప్పవలసి వస్తే ఈ 'సలాత్' పదం లోని 'త' అనే శబ్దం పలుకరు. బదులుగా **సలా** అని పలకాలి.

అరబీ భాషలో **సలా** అంటే **వేడుకోలు** (దువా). అయితే ధార్మిక భాషలో 'సలాహ్' అంటే రుకూ, సజ్దా మరియు వాటితో పాటు చేసే మిగతా పనులన్నీ వస్తాయి. ఈ 'సలాత్' గనుక 'అల్లాహ్ నుండి' అయితే అప్పుడు దానర్థం **ఆశీర్వాదం** (బరకా) అవుతుంది.

ఈ ఆయత్‌లో 'సలాత్'ని స్థాపించడం అంటే : 1. సలాత్‌కి ముందు వుజూ చేయడం, 2. నిర్ణీత సమయానికి అంటే ఫజర్, జుహర్, అసర్, మగ్‌రిబ్, ఇషా సలాత్‌లను అవి చేయవలసిన సమయంలో చేయడం, 3. రుకూ మరియు సజ్దా మొదలైన వన్నీ ప్రవక్త(స)వారి విధానం ప్రకారం చేయడం. 4. సలాత్ జమియత్‌తో పాటు మస్‌జిద్‌లో చేయడం.

**అల్లాహ్ మార్గంలో ఖర్చుపెట్టడం :**

దైవభీతిగల వారి యొక్క 3వ గుణం - వారు అల్లాహ్ మార్గంలో ఖర్చుపెడతారు. ఎక్కువమంది విద్వాంసులు (స్కాలర్స్) ప్రకారం 'అల్లాహ్ మార్గంలో చేసే ఖర్చులన్నీ'. అంటే ఆ ఖర్చు తప్పనిసరి అయిన 'జకాత్' కావచ్చు. నఫిల్ దానాలు కావచ్చు. అన్ని రకాల దానాలు కూడా ఈ ఆయత్‌లో చెప్పిన ''మేము ప్రసాదించిన దాని నుండి ఖర్చు చేస్తారో''కు వర్తిస్తాయి.

ఈ ఆయత్‌లో వాడిన పదబంధం 'మిమ్మా రజఖ్‌నాహుమ్' (మేము ప్రసాదించిన దాని నుండి). దీనిని బట్టి మనకు స్పష్టంగా అర్థమయ్యేది ఏమిటంటే, ఏదైతే మనం కలిగి ఉన్నామో అదంతా కూడా మనది కాదు. అల్లాహ్ నుండి మనకు అందిన కానుక. ఆయనిచ్చిన దానినే మనం ఆయన మార్గంలో ఖర్చు చేస్తున్నాం. పేదవారికి దానం చేయడం, పేద విద్యార్థులకు చదువుకోవడానికి దానం చేయడం ఇలా అల్లాహ్ మార్గంలో ఖర్చు చేసే ప్రతీది అల్లాహ్ కొరకే. ఆయనిచ్చిందే మనం ఖర్చు చేస్తున్నాం. 'దాని నుండి ఖర్చు చేస్తారో' అన్నారు కాబట్టి, అల్లాహ్ అనుగ్రహించిన దానిలో కొంత భాగం ఖర్చుచేయమని, పూర్తిగా చేసేయమని కాదు.

దైవభీతిగల వారికి ఉండే మూడు గుణాల గురించి చెప్పుకున్నాం. వీటిలో అతి ముఖ్యమైనది ఈమాన్ (విశ్వాసం). ఇది లేకుండా మనం చేసే ఏ సత్కార్యానికి కూడా విలువ ఉండదు. మిగతా రెండు గుణాలు సత్కార్యాలకు సంబంధించినవి. 'సలాత్' అనేది ఒక ప్రార్థన. అయితే అల్లాహ్ అనుగ్రహించినది సన్మార్గంలో ఖర్చుపెట్టడం మరో రకమైన ప్రార్థన.

కాబట్టి దైవభీతిగలవారు, విశ్వసించి సత్కార్యాలు చేస్తారు. ఈ విశ్వాసం మరియు ఆచరణల కలయికే ఇస్లామ్.

ఈ విధంగా ఈ 3వ ఆయత్ 'ఈమాన్' అనే పదాన్ని నిర్వచించడమే కాకుండా 'ఇస్లామ్' అంటే ఏమిటో కూడా సూచిస్తుంది.

**ఈమాన్ మరియు ఇస్లామ్ :**

భాషాపరంగా నయితే, ఈమాన్ అనేది మన మనస్సు ద్వారా అంగీకరించి ధృవీకరించబడేది. ఇస్లామ్ - అల్లాహ్‌కు విధేయత మరియు స్వయం సమర్పణ.

ఈమాన్ హృదయానికి సంబంధించినది. ఇస్లామ్ హృదయానికి మాత్రమే కాకుండా శరీరంలోని అన్ని భాగాలకు సంబంధించినది.

షరియా దృష్టిలో ఇస్లామ్ లేకుండా ఈమాన్‌కు విలువలేదు. అదే విధంగా ఈమాన్ లేకుండా ఇస్లామ్ లేదు. మరో విధంగా చెప్పాలంటే మనస్సులో అల్లాహ్‌పై మరియు ఆయన ప్రవక్త ముహమ్మద్(స)పై విశ్వాసం ఉన్నంత మాత్రాన సరిపోదు, నోటితో ఆ విషయాన్ని ప్రకటించాలి మరియు పూర్తి విధేయత మరియు సమర్పణను ధృవ పరచాలి.

అదే విధంగా నోటితో విశ్వాసాన్ని మరియు విధేయతని ప్రకటిస్తే సరిపోదు, అతని హృదయంలో విశ్వాసం ఉండాలి. విశ్వాస విధేయతలను ఆచరణలో పెడితేనే అది ఇస్లామ్.

భాషాపరంగా ఈమాన్ మరియు విశ్వాసం ఒకే అర్థాన్ని కలిగిన వేర్వేరు పదాలు. ఇదే విధంగా ఖుర్'ఆన్ మరియు హదీస్ అనే పదాలు భాషాపరంగా వేర్వేరుగా అనిపించవచ్చుగాని, ఈ రెండూ ఒకదానితో ఒకటి లింక్ అయి ఉన్నాయి. కేవలం నోటితో ప్రకటన మాత్రమే జరిగి ఈమాన్ లేకపోతే పవిత్ర ఖుర్'ఆన్ ప్రకారం అది నిఫాఖ్ (కపటత్వం) అవుతుంది. ఇస్లామ్ ఈ కాపట్యాన్ని బహిరంగంగా చేసే సత్య తిరస్కారం కంటే పెద్ద నేరంగా పరిగణిస్తుంది.

**"నిశ్చయంగా, కపట విశ్వాసులు నరకంలో అన్నిటికంటే మిక్కిలి క్రింది అంతస్తులో పడిఉంటారు. మరియు వారికి సహాయం చేయగల వాడిని ఎవ్వడినీ నీవు పొందజాలవు."** (ఖుర్'ఆన్ 4:145)

అంటే నిఫాఖ్‌ని కలిగి ఉన్న 'మునాఫిక్‌లు' (కపట విశ్వాసులు) కాఫిర్ల కంటే తక్కువ స్థాయి వారని తెలుస్తుంది. ఈ మునాఫిక్‌ల గురించి తెలియనంత వరకూ వారిని ముస్లిములుగానే పరిగణించి, వారితో ముస్లిములు సాధారణంగానే వ్యవహరిస్తారు. కాని పరలోకంలో వారి స్థితి సాధారణ కాఫిర్ల కంటే చాలా ఘోరంగా ఉంటుంది. మన రాష్ట్రంలో ఇటువంటి ఓ మునాఫిక్ సంస్థ గురించి వారు బహిరంగంగా చేసే పనుల గురించి 'శాంతిబాట' పాఠకులకు బాగా తెలిసిన విషయమే!

మరొక ముఖ్య విషయం గమనించవలసి ఉంది. హృదయంలో విశ్వాసమున్నప్పటికీ దానిని బహిరంగంగా ప్రకటించక పోవడం కూడా 'కుఫ్ర్' (సత్య తిరస్కారం) క్రిందకే వస్తుంది. క్రింది ఆయత్‌లు గమనించండి: నవముస్లిములు ఇస్లామ్ స్వీకరించిన కొత్తలో తమ కుటుంబ సభ్యులకు తమ విషయాన్ని దాచిపెట్టడం కుఫ్ర్ క్రిందికి రాదు. ఎందుకంటే వారిలో విశ్వాసం ఉంది. నోటితో సత్యాన్ని ప్రకటించారు. కొంత భయం వలన వారు తమ ధర్మాన్ని దాచి పెట్టారు.

**(మిగతా భాగం కొరకు 9వ పేజీ చూడండి)**

సన్మార్గ బోధకుడు
నాయకుడు
ఆదర్శనీయుడు

# ప్రపంచ శాంతి దూత ముహమ్మద్ (స) వారి

## బోధనలు ఆచరణలు

మంచిగా మానవత్వంతో బ్రతకమనే హితబోధను ప్రతి మనిషి తన ఊహతెలిసిన దగ్గరనుండి వింటూనే ఉంటాడు. అయితే ఏది మంచి? ఏది చెడు? కొంతమంది తమ దృష్టిలో ఫలానా విషయం మంచిది అని సమర్థిస్తారు. అదే విషయాన్ని మరికొందరు పూర్తి చెడుగానూ తీసుకుంటారు. అంతెందుకు, ఒకే మనిషిలో ఒకే పనిపై, తన జీవితంలోని వివిధ దశలలో వేర్వేరు అభిప్రాయాలు జనిస్తాయి. నిజంగా మంచి చెడులపై మనుషులయొక్క వ్యక్తిగత అభిప్రాయాలనే గనుక పరిగణనలోకి తీసుకుంటే, అన్ని పనులూ మంచి పనులే. అలాగే అన్నీ కూడా చెడ్డపనులే అవుతాయి.

కేజీ బరువున్న వస్తువును, ప్రపంచంలో ఎక్కడకు తీసికెళ్లినా అది కేజీ బరువే ఉంటుంది. అలాగే కొలతలకు కూడా ప్రపంచవ్యాప్తంగా ఒకటే ప్రమాణముంది.

మరి మనిషి జీవనానికి లేదా ఆచరణకు ప్రపంచవ్యాప్తంగా అలాంటి ఓ ప్రమాణం లేదా? ప్రపంచంలోని ఏ మారుమూలనుండి ఏ వ్యక్తిని తీసుకున్నా, అతని శారీరక నిర్మాణం, అతని అవయవాల పనితీరు తదితర అంశాలన్నీ మిగతా ప్రాంతాలలోని మనుషులలాగే ఒకే విధంగా ఉంటాయి కదా!

మనిషి అనే ఈ జీవయంత్రాన్ని తయారుచేసి, దానికి అవసరమైన ప్రోగ్రామింగ్‌ను చేసిన సృష్టికర్తకే తెలుసు - ఈ మనిషికి ఏది మంచి చేస్తుందో, ఏది చెడు చేస్తుందోనన్న విషయం.

మంచి చెడుల ప్రమాణాలు ఖుర్'ఆన్‌లో ఉన్నాయి. అయితే ఆ ప్రమాణాల ప్రకారంగా ఎటువంటి సందేహానికి లోనవకుండా ఉండేందుకు ముహమ్మద్(స) మనందరి శిక్షణకై ఎన్నో విషయాలను ఆచరించి చూపారు. ఖుర్'ఆన్ యొక్క ఆదేశాల ప్రకారంగా దైవప్రవక్త ముహమ్మద్ (స)ఆచరించిన పనులను మరియు ఆయన యొక్క ప్రవచనాలను హదీస్‌లు అంటారనే విషయం చాలామందికి తెలుసు. సమకాలీన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, వేల సంఖ్యలో ఉన్న హదీసులలోని కొన్ని హదీసులను ఎన్నుకొని ఈ శీర్షిక ద్వారా ఇన్షాఅల్లాహ్ అందిస్తూ ఉంటాము.

## ఉత్తమ సమాజం

**11**

**ఈ నెల ప్రత్యేకం : వ్యాపారం**



**(గత సంచిక తరువాయి)**

**“మరియు మీరు ప్రజలకు సాక్షులుగా ఉండటానికి మరియు సందేశహరుడు (ముహమ్మద్) మీకు సాక్షిగా ఉండటానికి మేము మిమ్మల్ని ఒక మధ్యస్థ (ఉత్తమ మరియు న్యాయశీలమైన) సమాజంగా చేశాము .....” (ఖుర్'ఆన్ 2:143)**

"And thus we have made you a **median [i.e. just] community** that you will be witnesses over the people and the Messenger will be a witness over you ....." (Qur'an 2:143)

**“మీరే మానవజాతి (హితం) కొరకు నిలబెట్టబడిన ఉత్తమ సమాజం వారు. మీరు మంచిని ఆదేశించే (బోధించే)వారు మరియు చెడును నిషేధించే (నిరోధించే)వారు మరియు మీరు అల్లాహ్ యందు విశ్వాసం కలిగి ఉన్నవారు ...” (ఖుర్'ఆన్ 3:110)**

"You are the **best nation** produced [as an example] for mankind. You enjoin what is right and forbid what is wrong and believe in ALLAH ....." (Qur'an 3:110)

*ఒక సమాజం ఉత్తమ సమాజం కావాలంటే జీవనోపాధి గురించి ఇతరులపై ఆధారపడకుండా, ఏ రిజర్వేషన్లు లేకుండానే ఏ విధంగా సాధించవచ్చో జూన్-జూలై సంచికలోనూ, ఆర్థికంగా స్థిరపడిన తరువాత మనపై నున్న బాధ్యతలను తెలుసుకుని మసలుకోవాలని చెబుతూ, ముఖ్య బాధ్యతలను హదీస్‌ల ద్వారా క్లుప్తంగా ఆగష్టు సంచికలో వివరించడం జరిగింది. ఈ సంచికనుండి వాటిని పూర్తిగా కాకపోయినా, కాస్త విపులంగా తెలియజేస్తామని చెప్పాము. ముందుగా వ్యాపారంతో ప్రారంభిస్తున్నాము.*

## వ్యాపారం

ప్రతీ మనిషి కష్టపడి పనిచేయాలి. జీవనోపాధి కొరకు ఉద్యోగం గాని, వ్యాపారంగాని చేయడం ధర్మ సమ్మతం మాత్రమే కాదు, అది మన బాధ్యత కూడా. చాలామంది అంటూ ఉంటారు ''ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది. నేను ఎంతో నిజాయితీగా పనిచేస్తున్నా ఏమీ మిగుల్చుకోలేక పోతున్నాను. నాపై అల్లాహ్ కరుణించడం లేదు'' (అస్తగ్ఫిరుల్లాహ్).

అయితే చాలామంది ఓ అతి ముఖ్యమైన విషయాన్ని పట్టించు కోవడం లేదు. ఆనాడు అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) వ్యాపారంలో గొప్ప స్థాయికి చేరుకున్నారంటే, ఇస్లామీయ ఆదేశాల ననుసరించే ఆయన వ్యాపారం చేశారు.

మనం వ్యాపారం ఎలా చేయాలి? ఏ ఏ వ్యాపారాలు చేయకూడదు? వ్యాపారాలలో ఉండకూడని లావాదేవీలు ఏమిటి? మన వ్యాపారంలో అల్లాహ్ శుభాలను అనుగ్రహించాలంటే మనమేమి చెయ్యాలి?

ఇటువంటి ఎన్నో ప్రశ్నలకు హదీస్ గ్రంథాలలో సమాధానాలున్నాయి. ఉదాహరణకు సహీహ్ బుఖారీ గ్రంథం 3వ సంపుటిలో ఒక పుస్తకంలో దాదాపు 190 హదీస్‌లు వ్యాపార లావాదేవీల కోసం ప్రత్యేకించబడ్డాయి. అంతే కాకుండా వ్యాపారానికి సంబంధించి మరికొన్ని విషయాలు అదే సంపుటిలో ఇతర పుస్తకాల్లో ఉన్నాయి.

ఎవరైనా ముస్లిమ్ వ్యాపారం ప్రారంభించాలని అనుకున్నప్పుడు, తాను ప్రారంభించబోయే వ్యాపారం ఇతరులు ఏవిధంగా చేస్తున్నారో చూసి, వారిని అనుసరిస్తాడు. కాని అల్లాహ్ ఆ విషయంలో ఏమీ ఆజ్ఞాపించాడో తెలుసుకోడు. ముహమ్మద్(స)వారు వ్యాపార విషయాలలో ఏయే బోధనలు చేసారో తెలుసుకోవడానికి ప్రయత్నించడు.

**మరి శుభాలు ఎలా దొరుకుతాయి?** ఈనాడు కొందరు వ్యాపారంలో అవినీతి మార్గాన సంపాదించి, చాలా వృద్ధి పొంది ఉండవచ్చు. కాని వారు కుప్పకూలిపోతారు. ప్రకృతి వైపరీత్యాలు మహానగరాలను సైతం నామరూపాల్లేకుండా చేస్తాయి.

వ్యాపారం చేయడంలో మనకు ఆదర్శం ముహమ్మద్(స)వారే. రోగం వలన శరీరం ఉబ్బుతుంది. కాని ఆ 'వాపు'ను చూసి శరీరం వృద్ధి చెందుతుందని అనుకోకూడదు. శాంతిబాట తొలి పత్రికలలో 'వడ్డీ' గురించి విపులంగా చర్చించడం జరిగింది.

ఖుర్ఆన్‌లో అల్లాహ్ చెబుతున్నారు, వడ్డీ అనేది వ్యాపారం కాదని. కాని మనదేశ చట్టం ప్రకారం వడ్డీని వ్యాపారంగా చేసుకోవచ్చు. కాని అల్లాహ్ మనకోసం ఏర్పాటు చేసిన చట్టాన్ని అనుసరిస్తేనే మనకు వ్యాపారంలో శుభాలు కలుగుతాయి.

అయితే ఇక్కడ ఒక ముఖ్య విషయం గుర్తు పెట్టుకోవాలి. ఇస్లామీయ ఆదేశాలను అంగీకరించని దేశంలో ఉన్నప్పుడు, అల్లాహ్ అనుమతించిన వ్యాపారాలలో ఏదైనా ఓ వ్యాపారం ఇక్కడి చట్టప్రకారం చేయకూడనిది అయితే, ఆ వ్యాపారం యొక్క మేలుగురించి ప్రభుత్వానికి తెలియజేసి ఒప్పించాలిగాని, చట్టాన్ని ఉల్లంఘించడం మంచిది కాదు. అదే విధంగా అల్లాహ్ నిషేధించిన వ్యాపారాలు, దేశంలోని చట్ట ప్రకారం చేయగలిగినవే అయినా సరే, మనం వాటికి దూరంగా ఉండాలి.

కాబట్టి ఏదైనా ఓ వ్యాపారం ప్రారంభించేటప్పుడు, అటువంటి వ్యాపారం ధర్మసమ్మతం అవునా? కాదా? అని తెలుసుకోవాలి. ఆ వ్యాపారానికి సంబంధించి చట్టపరమైన అన్ని అంశాలను తెలుసుకుని, ప్రభుత్వ అనుమతి పొందాలి. ఆ వ్యాపారం ధర్మసమ్మతమై ఉండి, ముహమ్మద్(స)వారి బోధనల ప్రకారమే మీరు వ్యాపారం చేస్తే, ఇన్షా అల్లాహ్ మీ వ్యాపారంలో శుభాలను గమనించగలుగుతారు.

**''ఎవరైతే వడ్డీ తింటారో! వారి స్థితి షైతాన్ తాకడం వల్ల భ్రమ పరచబడిన వ్యక్తి స్థితి వలే ఉంటుంది. ఇది ఎందుకంటే! వారు : ''వ్యాపారం కూడా వడ్డీ లాంటిదే అని చెప్పడం. కాని అల్లాహ్ వ్యాపారాన్ని హలాల్ (ధర్మ సమ్మతం) చేశాడు మరియు వడ్డీని హరామ్ (నిషిద్ధం) చేశాడు....''** (ఖుర్ఆన్ 2:275)

**''అల్లాహ్ వడ్డీ (ఆదాయాన్ని) నశింపజేస్తాడు మరియు దానధర్మాలు (చేసేవారికి) వృద్ధి చేస్తాడు. మరియు సత్య తిరస్కారుడు, పాపిష్టుడు అయిన వ్యక్తిని అల్లాహ్ ప్రేమించడు''** (ఖుర్ఆన్ 2:276)

## లావాదేవీలను తప్పనిసరిగా వ్రాసుకోవాలి

ధర్మ సంబంధమైన ఏ వ్యాపారానికైనా ముందుగా పెట్టుబడి కావాలి. అయితే అందరి దగ్గరా అవసరమైనంత సొమ్ము ఉండక పోవచ్చు. అప్పుడు అప్పు చేయవలసి వస్తుంది. 'వడ్డీ'కి అప్పు ఇచ్చేవారున్నారు. కాని అది హరామ్. మన తోటి సోదరునికి వ్యాపారం చేసుకునే నిమిత్తం వడ్డీ లేకుండా అప్పు ఇస్తే దాని వలన మనకు పుణ్యం లభిస్తుంది.

చేబదులుగా తీసుకునే ఆ అప్పుకు కూడా జాగ్రత్తలు చాలా అవసరం. ఈ విషయంలో అల్లాహ్ ఆదేశం ఇలా ఉంది :

''ఓ విశ్వాసులారా! మీరు పరస్పరం ఒక నిర్ణీతకాలం కొరకు అప్పు తీసుకున్నప్పుడు, దానిని వ్రాసి పెట్టుకోండి. మరియు మీలో పత్రం వ్రాసేవాడు, న్యాయంగా వ్రాయాలి. మరియు వ్రాసేవాడు నిరాకరించ కుండా, అల్లాహ్ నేర్పినట్లు వ్రాయాలి. ఋణగ్రహీత అల్లాహ్‌కు భయపడి, నిర్ణీత షరతులను తగ్గించకుండా, చెప్పి వ్రాయించాలి. ఋణగ్రహీత అల్పజ్ఞాని లేక సామర్థ్యం లేనివాడు లేక బలహీనుడు మరియు తాను చెప్పి వ్రాయించ లేనివాడైతే, అతని సంరక్షకుడు న్యాయంగా వ్రాయించాలి. మరియు మీలో ఇద్దరు మగవారిని సాక్ష్యమివ్వటానికి సాక్షులుగా ఉంచుకోండి. ఇద్దరు పురుషులు దొరకని పక్షమున ఒక పురుషుడు మరియు

మీకు సమ్మతమైన ఇద్దరు స్త్రీలను సాక్షులుగా తీసుకోండి. (ఎందుకంటే) వారిలో ఒకామె మరచిపోతే, రెండవ స్త్రీ ఆమెకు జ్ఞాపకం చేయించవచ్చు. మరియు పిలవబడినప్పుడు సాక్షులు, సాక్ష్యమివ్వటానికి నిరాకరించ కూడదు. **మరియు వ్యవహారం చిన్నదైనా పెద్దదైనా దానిని గడువు నిర్ణయంతోపాటు వ్రాసి పెట్టటానికి అశ్రద్ధ చూపకూడదు. అల్లాహ్ దృష్టిలో ఇది న్యాయసమ్మతమైనది మరియు స్థిరమైన సాక్ష్యంగా తోడ్పడుతుంది మరియు ఏ విధమైన సందేహాలకు అవకాశం లేకుండా చేస్తుంది.** కాని, మీరు అప్పటికప్పుడు ఇచ్చి పుచ్చుకునే (సాధారణ) లావాదేవీలు చేస్తున్నప్పుడు వ్రాయకున్నా దోషం లేదు. కాని, **వ్యాపార వ్యవహారాలు నిర్ణయించేటప్పుడు సాక్షులను పెట్టుకోండి.** కాని వ్రాసేవానికి గానీ, సాక్షులకుగానీ ఏ విధమైన హాని జరుగకూడదు. ఒకవేళ అలా జరిగితే! నిశ్చయంగా, అది మీకు పాపం. మరియు అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి. మరియు ఇది అల్లాహ్ మీకు నేర్పుతున్నాడు. మరియు అల్లాహ్‌కు ప్రతి దాని జ్ఞానం ఉంది.'' (ఖుర్'ఆన్ 2:282)

ఖుర్'ఆన్ ఆయత్‌లలో కెల్లా అతి పెద్ద ఆయత్ ఇదే. దీనినే ఆయతే దైన్ అని అంటారు.

**పై ఆయత్‌ని మర్చిపోతే మంచి సంకల్పంతో మనం చేసే పనులు కూడా ఒకొక్కసారి మనకు తీవ్ర ఇబ్బందులు కూడా కలిగించవచ్చు.**

**కాబట్టి ఏ లావాదేవీలనైనా సరే వ్రాయించుకోవడం మర్చిపోకండి.**

## చేసే వ్యాపారాన్ని ఏ సమయాలలో తప్పని సరిగా ఆపాలి?

''ఓ విశ్వాసులారా! శుక్రవారం (జుము'అ) రోజు సలాత్ (నమాజ్) కొరకు పిలుపు (అజాన్) ఇవ్వబడినప్పుడు, **మీరు మీ వ్యాపారాలను విడిచి అల్లాహ్ స్మరణ వైపునకు పరుగెత్తండి. మీరు తెలుసుకోగలిగితే, ఇది మీకు ఎంతో ఉత్తమమైనది!**

ఇక సలాత్ (నమాజ్) పూర్తి అయిన తరువాత భూమిలో వ్యాపించండి మరియు అల్లాహ్ అనుగ్రహాన్ని అన్వేషించండి మరియు అల్లాహ్‌ను అత్యధికంగా స్మరిస్తూ ఉంటే, బహుశా మీరు సాఫల్యం పొందవచ్చు!

మరియు (ఓ ముహమ్మద్!) వారు వ్యాపారాన్ని గానీ లేదా వినోద క్రీడను గానీ చూసినప్పుడు, నిన్ను నిలబడివున్న స్థితిలోనే వదలిపెట్టి, దాని చుట్టూ గుమిగూడతారు. వారితో ఇలా అను : ''వినోద క్రీడల కంటే మరియు వ్యాపారం కంటే, అల్లాహ్ వద్ద ఉన్నదే ఎంతో ఉత్తమమైనది. మరియు అల్లాహ్‌యే జీవనోపాధి ప్రసాదించటంలో సర్వోత్తముడు'' (ఖుర్'ఆన్ 62:9-11)

*కాబట్టి శుక్రవారం జుమా సలాత్ సమయానికి ముందు వ్యాపారం ఆపి మధ్యలో వెళితే, వ్యాపారంలో నష్టపోతామని భయపడకండి. మీకు వ్యాపారం ద్వారా జీవనోపాధి ప్రసాదించింది అల్లాహ్‌యే కదా! ఆయనే అన్నీ చూసుకుంటారు.*

## చేసే వ్యాపారం హరామా లేక హలాలా అని సందేహమొస్తే?

ను'మాన్ బిన్ బషీర్(రజి) ఉల్లేఖనం. ప్రవక్త(స)వారు చెప్పగా విన్నాను. ''ధర్మసమ్మతమైనవి మరియు నిషేధించబడినవి రెండూ స్పష్టమైన (విషయాలు). వీటి మధ్య ఉండేవి సందేహం కలిగించే విషయాలు. కాబట్టి ఎవరైతే తాను పాపం చేయడానికి అవకాశం ఉన్న సందేహాస్పద (అస్పష్ట) విషయాలను వదిలిపెడతారో వారు స్పష్టంగా ఉండే హరామ్ నుండి తప్పుకుంటారు. మరియు ఎవరైతే ఈ (అస్పష్టమైన) అనుమానం కలిగించే విషయాలలో ధైర్యంగా మునిగిపోతారో, ఆ వ్యక్తి స్పష్టమైన ఓ హరామ్ (పనిని) చేసే అవకాశం ఉంది. పాపాలు అల్లాహ్ యొక్క హిమ. ఎవరైతే (తన పశువులను) దానికి (ఆ పచ్చిక బయలుకి) సమీపంలో మేపుతాడో, ఆ వ్యక్తి ఏ క్షణంలోనైనా దానిలోనికి ప్రవేశించే అవకాశం ఉంది''.

**(సహీహ్ బుఖారీ, 2051, పుస్తకం: 34 కితాబుల్ బుయూ, అధ్యా. 2, సంపుటి 3)**

**వివరణ:** వేరే వ్యక్తికి ప్రైవేట్‌గా ఒక పచ్చిక బయలుంది. దానిలో పశువులను మేపడానికి మనకు అనమతి లేదు. ఆ పచ్చిక బయలు యొక్క కంచె (ఫెన్సింగ్)కు సమీపంలో మనం మన గొఱ్ఱెలను మేపుతున్నామనుకోండి. అవి ఆ కంచెను దాటుకుని పచ్చిక బయలులో ప్రవేశించే అవకాశం ఉంది. ఆ పచ్చిక బయలు యజమాని తన కంచెను దాటుకుని లోపలికి ప్రవేశించి మేపినందుకు శిక్షిస్తాడు. ఇక్కడ పచ్చిబయలు చుట్టూ ఉండే కంచె మరేమిటో కాదు - సందేహాన్ని కలిగించే విషయాలు.

కాబట్టి వాటి దరిదాపులకి మనం పోకూడదు. ఖుర్'ఆన్ మరియు హదీస్‌ల ద్వారా ఏ విషయాలు హలాల్ (ధర్మ సమ్మతం) మరియు ఏ విషయాలు హరామ్ (నిషేధించబడినవి) స్పష్టంగా తెలుసుకోవచ్చు. ఫలానా వస్తువు హలాల్. ఫలానా వస్తువు ధరించడం హరామ్. ఫలానా పనిచేయడం హలాల్. ఈ విధంగా స్పష్టంగా తెలిసిన విషయాల వలన ఎటువంటి సమస్యా రాదు. కాని కొన్ని విషయాలు అవి హరామా? లేక హలాలా? అని సందేహాన్ని కలిగిస్తాయి. అటువంటి వాటికి దూరంగా ఉండమన్నారు.

**కాబట్టి అటువంటి వ్యాపారాలకు కూడా దూరంగా ఉండటం శ్రేయస్కరం.**

ఉదాహరణకు క్రింది హదీస్‌ను గమనించండి :

అనస్(రజి) ఉల్లేఖనం. ప్రవక్త(స)వారు పడిపోయిన (క్రిందనున్న) ఖర్జూరం ప్రక్కనుండి వెడుతూ అన్నారు, **''ఇది దానంగా ఇవ్వబడిందని నాకు సందేహం లేకపోతే, నేను దీనిని తిని ఉండేవాడిని''** మరియు అబూహురైరా(రజి) ఉల్లేఖించారు : ''ప్రవక్త(స)వారు చెప్పారు నేను పడుకునే చోట ఓ ఖర్జూరం పడి ఉంది''.

**(సహీహ్ బుఖారీ, 2055, పుస్తకం: 34 కితాబిల్ బుయూ (వ్యాపారం పుస్తకం), అధ్యా. 4, సంపుటి 3)**

ముహమ్మద్(స)వారు అల్లాహ్ యొక్క సందేశహరులు కాబట్టి, ఆయన దానాన్ని స్వీకరించరు. అది కానుక అయితేనే స్వీకరిస్తారు. కాబట్టి దానంగా లభించే ఖర్జూరం ఆయనకు హరామ్. అది దానంగా ఇచ్చినదో? కాదో? ఆయనకు స్పష్టం కాలేదు కనుక దానిని ఆయన తినలేదు.

కాబట్టి మీకు అనుమానం గలవాటిని ముందుగా నివృత్తి చేసుకోండి. మీకు అవి స్పష్టం కాకపోతే అటువంటి వాటికి దూరంగా ఉండండి.

### ఒకానొక కాలం రాబోతుంది, ఆ కాలంలో ...

అబూహురైరా(రజి) ఉల్లేఖనం. ప్రవక్త(స) చెప్పారు, "ప్రజల మీదకు ఓ కాలం రాబోతుంది అప్పుడు ఒకడు తాను సంపాదించే సొమ్ము హలాల్ (ధర్మ సమ్మతమా?) లేక హరామ్ (నిషేధించబడినదా?) అనే విషయంలో శ్రద్ధ తీసుకోడు. **(సహీహ్ బుఖారీ, 2059, పుస్తకం: 34 కితాబిల్ బుయూ, అధ్యా. 7, సంపుటి 3)**

حَدَّثَنَا آدَمُ : حدَّثَنَا ابنُ أَبِي ذِئْبٍ : حدَّثَنا سَعِيدٌ المَقْبُرِيُّ، عَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللهُ عَنْهُ عَنِ النَّبِيِّ ﷺ قالَ : ((يَأتِي عَلى النَّاسِ زَمانٌ لا يُبالِي المَرْءُ ما أخَذَ مِنْهُ، أَمِنَ الحَلالِ أَمْ مِنَ الحَرامِ؟))

ప్రస్తుతం మనం ఆ కాలంలోనే ఉన్నామని అనిపిస్తుంది. ఈ వ్యాసం చదివాక ఇన్షా అల్లాహ్ మీకు ఆ విషయం స్పష్టంగా తెలుస్తుంది.

### వస్తువును అమ్మడానికి ప్రమాణం చేయడం ...

ఇబ్నె షిహాబ్ ఉల్లేఖనం. ఆయన చెప్పారు, 'ఇబ్నె ముసయ్యబ్ నాతో చెప్పారు : వాస్తవానికి, అబూహురైరా చెప్పారు : "అల్లాహ్ యొక్క సందేశహరులు (స) చెప్పగా నేను విన్నాను : చేసిన ఓ ప్రమాణం వస్తువును అమ్మవచ్చు కాని అది శుభాన్ని తుడిచేస్తుంది."
**(అబూదావూద్, సహీహ్, 3335, 22వ పుస్తకం: కితాబిల్ బుయూ, అధ్యా.6, సంపుటి 4)**

حَدَّثَنَا أَحْمَدُ بنُ عَمْرِو بنِ السَّرْحِ : حَدَّثَنا ابنُ وَهْبٍ؛ ح : وَ حَدَّثَنَا أَحْمَدُ بنُ صَالِحٍ : حَدَّثَنَا عَنْبَسَةُ عن يُونُسَ، عن ابنِ شِهَابٍ قالَ : قالَ لِي ابنُ المُسَيَّبِ : إنَّ أبَا هُرَيْرَةَ قالَ : سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ يَقُولُ : ((الْحَلْفُ مَنْفَقَةٌ لِلسِّلْعَةِ مَمْحَقَةٌ لِلْبَرَكَةِ))

కాబట్టి మన వస్తువును ప్రమాణం చేసి అమ్ముకోవడం ద్వారా సంపాదించిన సొమ్ములో శుభం ఉండదు. అంటే అది తుడిచిపెట్టుకు పోవచ్చు.

- దళారీ వ్యవస్థను ఇస్లామ్ వ్యతిరేకిస్తుంది.
- అస్పష్టమైన లావాదేవీలు నిషేధం
- పంటను పక్వానికి రాకముందే లేక సంవత్సరాలకు ముందే అమ్మకూడదు.
- మిగులు నీటిని అమ్మకూడదు
- ఎటువంటివారి సంపాదన హలాల్?
- ఒక వ్యక్తి ఏదైనా వస్తువును కొని మరొకరికి అమ్మవచ్చు. కాని దానిని కొనకుండానే, మరొకరికి అమ్మకూడదు.
- వస్తువులు మార్కెట్‌కి చేరకముందే, దారిలోనే ఆపి కొనడం నిషేధం
- ఓ పల్లెటూరి వ్యక్తి పంటను అతని కొరకు ఓ పట్టణవాసి అమ్మకూడదు, అతను తన స్వంత సోదరుడైనా సరే.
- కృత్రిమ కొరతను సృష్టించి, ధరలను పెంచడం నిషేధం.

**(ఇటువంటి అనేక విషయాలను పూర్తి వివరాలతో వచ్చే అక్టోబర్ - నవంబర్ ప్రత్యే సంచికలో అందిస్తాము, ఇన్షా అల్లాహ్)**

ఓ విశ్వాసులారా! మీరు ఒకరి సొమ్మునొకరు అన్యాయంగా తినకండి, పరస్పర అంగీకారంతో చేసే వ్యాపారం వల్ల వచ్చేది తప్ప. మరియు మీరు ఒకరినొకరు చంపుకోకండి. నిశ్చయంగా, అల్లాహ్ మీ యెడల అపార కరుణా ప్రదాత. (ఖుర్ఆన్ 4:29)

**(5వ పేజీ తరువాయి ....)**

**"మేము గ్రంథాన్ని ప్రసాదించిన వారు తమ కుమారులను ఏ విధంగా గుర్తిస్తారో ఇతనిని (ముహమ్మద్‌ను) ఆ విధంగా గుర్తిస్తారు. మరియు వాస్తవానికి వారిలోని ఒక వర్గం వారు తెలిసి కూడా సత్యాన్ని దాస్తున్నారు"** (ఖుర్ఆన్ 2:146)

**"మరియు వారి హృదయాలు వాటిని అంగీకరించినా వారు అన్యాయంగా, అహంకారంతో తిరస్కరించారు. ఇక చూడు ఆ దౌర్జన్య పరుల గతి ఏమయిపోయిందో!"** (ఖుర్ఆన్ 27:14)

మారిఫుల్ ఖుర్ఆన్ వ్యాఖ్యాన గ్రంథంలో వ్యాఖ్యాత ఈమాన్ మరియు ఇస్లామ్‌పై తన గురువుగారు వ్యక్తపరచిన అభిప్రాయాన్ని తెలియజేశారు. ఈమాన్ మరియు ఇస్లామ్ పూర్తి చేయవలసిన ఆధ్యాత్మిక ప్రయాణం ఒక్కటే. మరియు వాటి మధ్య తేడా కేవలం ప్రారంభంలోనూ మరియు చివరిలోనే ఉంటుంది. అంటే ఈమాన్ అనేది మనస్సులో ప్రారంభమై బాహ్యంగా చేసే సత్కార్యాలతో సంపూర్ణమౌతుంది. ఇస్లామ్ అనేది బాహ్యంగా చేసే పనులతో మొదలై అది హృదయానికి చేరినప్పుడు అది సంపూర్ణమవుతుంది. అన్వర్‌షా గారు ఈ విషయం చాలా చక్కగా వివరించారు.

*తఫ్సీర్‌లోని మరికొంత భాగం ఇన్షాఅల్లాహ్ వచ్చే సంచికలో ...*



ప్రపంచ పాలకులు మరియు రాజకీయ నాయకులు
తప్పనిసరిగా తెలుసుకోవలిసిన
ముహమ్మద్(స)వారి ప్రియ అనుచరుడు

# ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి)

జీవిత చరిత్ర 1

ప్రపంచంలోని అతి పెద్ద భూభాగానికి నాయకుడు

ప్రజలకే కాకుండా మూగజీవాలకూ న్యాయం చేకూర్చిన అత్యంత దైవభీతిపరుడు

అతి నిరాడంబర జీవి | అవినీతి అధికారులకు సింహస్వప్నం

ఎటువంటి తిరుగుబాటులకు అవకాశం రానివ్వని ఉత్తమ పాలకుడు

ఓ దశాబ్దంపాటు 100% ప్రజాస్వామ్య పరిపాలన అందించిన ప్రజానాయకుడు

ఉమర్(రజి) వారి జీవిత చరిత్రను ప్రామాణిక హదీస్‌ల నుండి, చారిత్రక ఆధారాలనుండి వ్రాయడానికి ఎందరో పరిశోధకులు చాలాకాలం పాటు శ్రమించారు. కొందరు జీవితకాలం పాటు వివిధ దేశాల గ్రంథాలయాలలో అన్వేషించి వ్రాశారు. వారు అందించిన పుస్తకాలు ఇతర భాషలలో అందుబాటులో ఉన్నాయి. కాని తెలుగు భాషలో మాత్రం ఆయన జీవిత చరిత్ర క్లుప్తంగానే అందించబడింది. ఉమర్(రజి)వారి ఉత్తమ పరిపాలన గురించి ముస్లిములకే కాకుండా, ముస్లిమేతరులకు కూడా స్పష్టంగా అర్థం కావాలంటే విశ్లేషణలతో కూడిన వివరాలను అందించవలసి ఉంది. ఇన్షా అల్లాహ్! ఈ శీర్షిక ద్వారా ఆ విషయాలన్నింటిని పాఠకులకు అందిస్తాము.

ఈ శీర్షికకు ఉపయోగించే గ్రంథాల గ్రంథ కర్తలకు శ్రేయో శుభాలను కలుగజేయమని అల్లాహ్‌ని వేడుకుంటున్నాము. ఈ గ్రంథాలనుండి సమాచారాన్ని తీసుకుని, అవసరమనిపించిన చోట స్వయంగా మేము కొన్ని విషయాలను విశ్లేషించి పాఠకులకు సులభతరం చేయడానికి ప్రయత్నిస్తాము.

**పేరు మరియు వంశం**

పేరు : ఉమర్ బిన్ ఖత్తాబ్. అంటే ఉమర్, S/o ఖత్తాబ్ (ఖత్తాబ్‌గారి కుమారుడు ఉమర్). వంశం విషయానికొస్తే ఉమర్ బిన్ **ఖత్తాబ్** బిన్ **నుఫైల్** బిన్ **అబ్దుల్ ఉజ్జా** బిన్ **రియా** బిన్ **అబ్దుల్లా** బిన్ **ఖారుత్** బిన్ **రజాహ్** బిన్ **అదీ** బిన్ **కాబ్** బిన్ **లుఅయ్** బిన్ **గాలిబ్** ఖురాషీ ఉద్వీ.

ఉమర్(రజి)వారి వంశం ప్రవక్త(స)వారి వంశంతో 'కాబ్ బిన్ లుఅయ్' దగ్గర కలుస్తుంది. ఈయన ఉమర్ (రజి)కు మరియు ప్రవక్త(స)వారికి తాతగారు.

ఉమర్(రజి) వారి కునియత్ - అబూ హఫ్స్. ఉదాహరణకు అబూ దావూద్ అంటారు. అంటే దావూద్ గారి తండ్రి అని అర్థం. కుమారుని పేరుతో పిలవబడ్డారు. దీనినే కునియత్ అంటారు.

ఉమర్ (రజి)గారి బిరుదు అల్-ఫారూఖ్. ఈ పదం పరఖ అనే మూలపదం నుండి ఉత్పన్నమైంది. దీని అర్థాలు విభజించడం లేదా వేరుచేయడం, రెండు లేదా ఎక్కువ వాటి మధ్య తేడాను తెలిపే గుర్తు. ఉమర్(రజి)గారికి ఈ బిరుదు రావడానికి కారణం విశ్వాసానికి మరియు అవిశ్వాసానికి మధ్య తేడాను ఈయన ద్వారా అల్లాహ్ స్పష్టం చేశారు. ఉమర్(రజి) తాను ఇస్లామ్ స్వీకరించిన విషయాన్ని మక్కాలో బహిరంగంగా ప్రకటించిన సందర్భంలో ఈ బిరుదు ఆయనకు లభించింది.

'ఏనుగు సంవత్సరం'కు 13 సంవత్సరాల తరువాత ఈయన జన్మించారు. అంటే ముహమ్మద్(స)వారి కంటే ఉమర్(రజి) వయస్సులో 13 సంవత్సరాలు చిన్నవారు.

చిన్నతనంలోనూ మరియు జీవితంలో చివరి దశలోనూ ఆయన జీవనం దాదాపు ఒకేలా సాగింది. ఉమర్(రజి) ఖురేషీ పిల్లల్లాగే చాలా విషయాలలో ఒకే విధంగా పెంచబడ్డారు. కాని వాటిలో రెండు ముఖ్యమైన తేడాలున్నాయి. ఒకటి - ఈయన చదవడం మరియు వ్రాయడం నేర్చుకున్నారు. ఇది వారికి చాలా అద్భుతకృత్యం వంటిది. ఎందుకంటే ఏ కొదిమంది ఖురేషీ పెద్దలకో చదవడం, వ్రాయడం తెలుసు. ఇక పిల్లల గురించి చెప్పనవసరం లేదు. వారు నిరక్షరాస్యులే!

ఇక రెండవది ఆయన బాల్యం కఠిన పరిస్థితులలో శారీరక శ్రమతో గడిచింది. ఎన్నో బాధ్యతలు ఆయనపై మోపబడ్డాయి. తండ్రిగారి బలవంతంతో దాదాపు బాలశ్రామికుడే అయ్యారు.

ఉమర్(రజి)వారికి ఇతర పిల్లల వలే ఆడుకోవడానికి గాని లేదా సరదాగా గడపడానికి గాని అవకాశం దొరికేది కాదు.

ఉమర్ తండ్రిగారి క్రమశిక్షణా పద్ధతులు ఆయనపై బావోద్వేగమైన గుర్తులను మిగిల్చాయి. తన చిన్నతనం గురించి విషాదకరమైన జ్ఞాపకాలు అప్పుడప్పుడు గుర్తు చేసుకునేవారు.

అబ్దుర్రహ్మాన్ ఇబ్నె హాతిబ్ చెప్పారు, "నేను ఒకసారి ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి)వారితో దజ్నాన్ ప్రక్కన ఉన్నప్పుడు, (మక్కాకు 25 కిలోమీటర్ల దూరంలో ఉండే పర్వతం), ఆయన చెప్పారు, నేను ఈ చోటే అల్-ఖత్తాబ్ (ఉమర్‌గారి తండ్రి)గారి (గొఱ్ఱెలు లేదా ఒంటెలు) మేపేవాన్ని. ఆయన చాలా క్రమశిక్షణగల కఠినమైన మనిషి. కొన్నిసార్లు (పశువులను) మేపేవాడిని మరియు ఇతర సమయాలలో వంట చెరకును (కలపను) సేకరించేవాన్ని".

స'ఈద్ బిన్ ముసయ్యిబ్ గారు మరో సందర్భంలో ఉమర్(రజి)వారు తన యవ్వన జీవితపు విషయాలు గుర్తుచేసుకుని తెలియజేశారు : "ఉమర్(రజి) హజ్జ్ చేసి దజ్నాన్ ప్రక్కనున్నప్పుడు, ఆయన చెప్పారు సర్వోన్నతుడు మరియు సర్వశక్తిమంతుడు అయిన అల్లాహ్‌ను తప్ప ఎవరూ ఆరాధనకు యోగ్యులు కారు అల్లాహ్ ఎవరిని ఇష్టపడితే వారికి ఏమి ఇవ్వాలనుకుంటే అది ఇచ్చేవాడు. నేను అల్-ఖత్తాబ్‌గారి ఒంటెలను ఈ లోయలోనే మేపేవాన్ని .... ఆయన చాలా కఠినమైన మనిషి. నా దగ్గరికి వచ్చి నేను (కష్టపడి) పనిచేసినప్పటికి, (చేయమని నాకు అప్పగించిన ఇతర పనులను) నిర్లక్ష్యం చేసినప్పుడు" నన్ను కొట్టేవారు.

ఉమర్(రజి)వారు పశువుల కాపరిగా తన తండ్రి కొరకే కాకుండా, బనూ మఖ్జూమ్ తెగకు చెందిన తన తల్లి తరపువారికి చెందిన పశువులనూ మేపేవారు. ముస్లిమ్ జాతికి ఖలీఫా (నాయకుడు) అయిన తరువాత, ఆయనే స్వయంగా ముస్లిమ్‌లకు ఈ వాస్తవాన్ని ఓ ప్రసంగంలో చెప్పారు.

ఒకరోజు ఉమర్(రజి)వారు ఏకాంతంలో ఉన్నప్పుడు, ఆయన నుండి ఓ స్వరం వినబడింది, "నీవు విశ్వాసుల నాయకుడివి, కాబట్టి నీకంటే ఉత్తముడు ఎవరు కాగలరు?" ఆత్మకు చెందిన షైతాన్ మనిషి నెల్లప్పుడూ చెడువైపు ఆశలు చూపి వలలో వేసుకుంటాడు లేదా కనీసం మోసపూరిత వైభవంవైపు (ఆకర్షింపజేస్తాడు). దానికి ప్రతిగా ఉమర్(రజి) తన ఆత్మను సరియైన స్థాయిలో ఉంచాలనుకున్నారు. ఎటువంటి అణుకువ స్థితి నుండి రావడం జరిగిందో (దానికి) తెలియజేయా లనుకున్నారు. వైభవాలకు సంబంధించిన తప్పుడు ఆలోచనలను మాన్పించాలనుకున్నారు.

అందుకనే ఎంతో అణుకువగా బ్రతికిన తన తొలి రోజుల విషయాలను సామాన్య ముస్లిమ్ ప్రజానీకానికి బహిరంగ పరిచారు.

ముహమ్మద్ బిన్ ఉమర్ అల్-మఖ్జూమీ తన తండ్రి నుండి ఉల్లేఖించారు : ఒకరోజు ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) ప్రజలను పిలిచి సమావేశపరచి సామూహిక సలాత్(నమాజ్)కు సమయమైందని తెలియజేశారు.

ప్రజలు సమావేశమయ్యాక, ఉమర్(రజి) ఉపన్యాస పీఠమెక్కి, అల్లాహ్‌ను కీర్తించి, ఘనతను కొనియాడి, ప్రవక్త(స)వారికి దరూద్‌ని పంపి, తరువాత చెప్పడానికి ఉపక్రమించారు, "ఓ ప్రజలారా! నాకు ఆ కాలం గుర్తుంది అప్పుడు నేను బనూ మఖ్జూమ్ వంశానికి చెందిన నా తల్లి తరపు వారి (చిన్నమ్మలు, పెద్దమ్మలకు చెందిన గొఱ్ఱెలు, ఒంటెలు) మేపేవాడిని. (ప్రతీరోజు) **వారు నాకు ఓ పిడికెడు ఖర్జూరాలు లేదా పిడికెడు ఎండు ఖర్జూరాలు ఇచ్చేవారు. మరియు నేను ఆ రోజంతా గడపాలి** (ఆ పిడికెడు ఖర్జూరాలతో రోజంతా పనిచేయాలి. అదే ఆహారం) **ఆ రోజు ఎంత కష్టంగా ఉండేదో!'**'

ఉమర్(రజి)వారు ఉపన్యాస పీఠం నుండి దిగినప్పుడు, ఆయనతో అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి) అన్నారు, "ఓ అమీరుల్ మోమినీన్! (విశ్వాసుల నాయకా!) (మీ ప్రసంగంలో) మీరు వ్యవహరించిన దానిలో ఒక విషయం మిమ్మల్ని అవమాన పరుస్తుంది (అంటే తన తక్కువ స్థితి నేపథ్యాన్ని అందరిలో బహిరంగపరచడం).

ఉమర్(రజి) సమాధాన మిచ్చారు, **"ఓ ఇబ్నె ఔఫ్! నేను ఏకాంతంలో ఉన్నప్పుడు, నా ఆత్మ నాతో చెప్పింది, నీవు విశ్వాసులకు నాయకుడివి, కాబట్టి నీ కంటే ఉత్తములు ఎవరు?". కాబట్టి నా ఆత్మకు అసలు వాస్తవాన్ని తెలపాలని మరియు దానిని సరియైన చోట ఉంచాలను కున్నాను."**

పశువుల కాపరిగా పనిచేయడం ఉమర్(రజి)వారి నైతిక స్వభావాన్ని గొప్ప స్థాయిలో ధృడంగా చేసింది మరియు ఆయనకు - బలం, సహనం, ధృడత్వం, సామర్థ్యం మరియు నాయకత్వ లక్షణాల వంటి ఎన్నో ఉత్తమ గుణాలు సంక్రమించాయి.

తన యవ్వన కాలంలో పశువుల కాపరిగా ఉమర్(రజి) విరామం లేకుండా పనిచేస్తూ, చదవడం మరియు వ్రాయడం నేర్చుకున్నారు. మల్ల విద్యలో ప్రావీణ్యం సంపాదించారు. గుఱ్ఱపు స్వారీలో మెళకువలు నేర్చుకుని అన్నింటిలో సమర్థుడైన యువకుడుగా తయారయ్యారు.

అంతేకాకుండా, సాహిత్యంలో చాలా ఉన్నత స్థాయికి చేరుకున్నారు. ఆయన ఎన్నో పద్యాలను కంఠస్థం చేశారు. సమావేశాల్లో కవిత్వం చెప్పేవారు.

ఉమర్(రజి) తన ప్రజల చరిత్రకు సంబంధించిన ఎన్నో విషయాలపై ఎక్కువ శ్రద్ధ తీసుకునేవారు. ఇంకా వాటి గురించి ఎక్కువగా నేర్చుకోవడానికి, అరేబియాలో ప్రసిద్ధి చెందిన వర్తక ప్రదేశాలైన ఉకాజ్, మజిన్నా మరియు జుల్-మజాజ్‌కి వెళుతుండేవారు. అక్కడ ప్రఖ్యాత కవులు మరియు వక్తలు తమ పద్యాలు మరియు ప్రసంగాల ద్వారా తమ తమ తెగల స్థాయిని పెంచుకోవడానికి ప్రయత్నించేవారు.

ఉదాహరణకు రెండు తెగల మధ్య యుద్ధం అనివార్యం అయినప్పుడు, ప్రతీ తెగ నుండి కవులు తమ తెగల వైభవాన్ని పద్యాల ద్వారా పెంచి చెబుతూ వారిలోని ధైర్యాన్ని మరియు సైనిక విన్యాసాలను ప్రశంసించేవారు. తమ శత్రు తెగని పరహసించడం మరియు శత్రు సైనికులపై వ్యంగ్యంగా మాట్లాడేవారు.

కవులు తమ పూర్వీకులు సాధించిన విజయాలను గౌరవిస్తూ పద్యాలు పాడేవారు.

ఈ విధంగా అరబ్బుల చరిత్ర వారి మనస్సులలో మర్చిపోకుండా కలకాలం గుర్తుండి పోయేది.

వారి పద్యాలు వేసే ప్రభావాలకు తోడు, ప్రత్యర్థి తెగలకు చెందిన ఇద్దరు కవులు కలిస్తే, కొన్నిసార్లు యుద్ధాలకు దారితీసాయి.ఉదాహరణకు ఒక సందర్భంలో ఉకాజ్ మార్కెట్ ప్రాంతంలో కవుల మధ్య తీవ్రరూపం దాల్చిన ఓ వాదన శీఘ్రంగా యుద్ధానికి దారి తీసింది. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే, నాలుగు యుద్ధాలకు - ఆ నాలుగింటిని కలిపి ఫిజార్ యుద్ధాలు అని పిలుస్తారు. ఇవి చాలా ప్రసిద్ధి చెందిన యుద్ధాలు.

యువకుడుగా ఉమర్(రజి) స్వయంగా వ్యాపారంలో నిమగ్నమయ్యే వారు. అంటే మార్కెట్ ప్రదేశాలకెళ్లి కేవలం చరిత్రను మాత్రమే నేర్చుకోవడమే కాకుండా వ్యాపార మెళుకువలనూ తెలుసుకునేవారు.

మంచిలాభాలను గడిస్తూ విజయవంతుడై మక్కాలోని ఉన్నత తరగతి ఖురేషీలలో చేరిపోయారాయన. వ్యాపారం కోసం ఈయన చేసే ప్రయాణాలలో చాలామందిని పరిచయం చేసుకుని స్నేహం చేసేవారు.

వ్యాపార నిమిత్తం ఈయన వేసవికాలంలో అష్షామ్ (సిరియా పరిసర ప్రాంతాలకు) మరియు చలికాలంలో యెమన్‌కు వెళుతుండేవారు.

అరేబియాలో ఇస్లామ్ తిరిగి ఆవిర్భవించక పూర్వం, ఉమర్(రజి) ఖురేషీలలో ఐశ్వర్యవంతుల తరగతిలో చేరిపోవడమే కాకుండా, తనకున్న జ్ఞానానికి మరియు ఉత్తమ గుణాలకు అందరిచే గౌరవోన్నతులను పొందేవారు. సమాజంలో తన పూర్వీకుల వారసత్వాన్ని పుణికిపుచ్చు కున్నట్లుగా ఉండేది.

ఆయన తాతగారు, నుఫైల్ బిన్ అబ్దుల్ ఉజ్జాను ఖురేషీలు ఎంత గొప్పగా గౌరవించేవారంటే, వారి తగాదాలు తీర్చుకోవడానికి ఆయన దగ్గరికి తీర్పుకోసం వెళ్ళేవారు.

ఖురేషీల చరిత్రలో చాలా పేరు ప్రఖ్యాతలున్న ఉమర్‌గారి మరో పూర్వీకులు కాబ్ బిన్ లుఅయ్. వాస్తవానికి ఏనుగు సంవత్సరం ప్రారంభానికి పూర్వం, ఖురేషీలు తమ చారిత్రక తేదీలను కాబ్‌గారి మరణం దగ్గర నుండే లెక్కపెట్టుకునేవారు. (అంటే కాబ్‌గారు చనిపోయిన సంవత్సరం - 1వ సంవత్సరం. ఆ తరువాత సంవత్సరం - 2వ సంవత్సరం. ఆ తరువాత 3వ సంవత్సరం...)

తన తాతగారు పొందినటువంటి గౌరవం ఉమర్(రజి)వారికి కూడా దక్కింది. గొడవలను ఈయన పరిష్కరించేవారు. ప్రఖ్యాత చరిత్రకారుడు ఇబ్న్ సాద్ ఇలా వ్రాశారు, ''ఇస్లామ్ తిరిగి ఆవిర్భవించడానికి పూర్వం, అరబ్బుల మధ్య ఉత్పన్నమయ్యే తగాదాల పరిష్కారం కొరకు వారి మధ్య ఉమర్(రజి) తీర్పు చెప్పేవారు.''

ఉమర్(రజి), చాలా ధృఢంగా ఉండి సహనంతో ఉన్నత సంస్కారాన్ని కలిగి ఉండేవారు మరియు ఆయన మంచి వక్త. ఈ ఆఖరి లక్షణం వల్లనే కావచ్చు, ఖురేషీలందరూ తమ తరపున ఈయననే రాయబారిగా నిర్ణయించేవారు. ఆ రోజుల్లో 'రాయబారి' అంటే కేవలం శతృ తెగవారితో ఒప్పందాల విషయంలో సంప్రదింపులు జరపడం మాత్రమే కాదు, చర్చల్లో పాల్గొని తన తెగ యొక్క సుగుణాలని ఉత్సాహంగా మెచ్చుకోవలసి ఉంటుంది. ఎవరు ధారాళంగా మాట్లాడగలుగుతారని రాయబారుల మధ్య పోటీ కొనసాగేది.

'మనాఖిబ్ ఉమర్'లో ఇబ్న్ జౌజీ(ర) వ్రాశారు, ''(ఖురేష్) మొత్తానికి ప్రాతినిధ్యం వహించే రాయబారి స్థానాన్ని ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) వారికే ఇచ్చేవారు. ఖురేష్ మరియు ఇతరుల మధ్య యుద్ధం అనివార్య మైనప్పుడు, వారు (ఖురేష్ నాయకులు) ఆయనను తమ రాయబారిగా పంపేవారు ...(వారికి ప్రతినిధిగా ఆయన వ్యవహరించే విధానం వలన) ఆ స్థానంలో ఆయన ఉండటానికే వారంతా ఇష్టపడేవారు.

ఉమర్(రజి)వారి ఉత్తమ గుణాల గురించి పైన చెప్పుకున్నాం. అయితే ఆయనలో బాగా స్థిరంగా ఉండే అతి ముఖ్య లక్షణం, ఇస్లామ్ స్వీకరించాక కూడా అది కొనసాగింది, అదేమిటంటే - ఆయన నిజాయితీ. ఆయనకు ఒక విషయంలో విశ్వాసం కలిగితే దానిని కాపాడుకోవడానికి తన శక్తినంతా ఉపయోగిస్తారు.

అందువల్లనే ఇతర ఖురేషీల వలే ఆయన కూడా తన పూర్వీకుల ఆచారాలకు, విధానాలకు కట్టుబడి ఉండేవారు. అందుకే ఇస్లామ్ ప్రారంభ రోజులలో ముస్లిములకు వ్యతిరేకంగా ఈయన తలపడేవారు.

కొత్త ధర్మం ఆవిర్భావం వలన తన మతం, తన ప్రజల మతం, తన పూర్వీకుల మత పునాదులు కదలుతాయని భయపడ్డారు. కాబట్టి ఆయన ఆ కొత్త ధర్మాన్ని ఆమోదించ లేదు. తన మతం వల్లనే మక్కాకు అరబ్బులలో ఓ ప్రత్యేక స్థానం ఏర్పడిందని, తన మతం వల్లనే మక్కాలో నివశించేవారికి శుభం మరియు ఐశ్వర్యం కలుగుతున్నాయని ఆయన భావించేవారు. ఈ భావంతోనే ప్రారంభంలో ఆయన ముస్లిములకు వ్యతిరేకంగా ఉండేవారు.

వాస్తవానికి మక్కా నాయకులలో బలహీన ముస్లిములను బాధించడంలో ఈయన వ్యవహారం చాలా తీవ్రంగా ఉండేది. ఒక ఉల్లేఖనం ప్రకారం ఈయన తన బానిస (young girl)ను ఇస్లామ్ స్వీకరించిన కారణంగా చాలా తీవ్రంగా కొట్టారు. ఉమర్(రజి)వారు ఆమెను కొడుతూనే ఉండేవారు చివరికి ఆయన చేతులు అలసిపోయి ఆపేవారు. ఆ అలసట వలన ఆయన చేతినుండి కొరడా జారిపోయేది. అబూబకర్(రజి) అటు ప్రక్కగా వెళుతున్నప్పుడు ఆమె దయనీయమైన స్థితిని చూసి, ఉమర్(రజి)వారి దగ్గరినుండి ఆమెను కొని, ఆమెకు బానిసత్వం నుండి అబూబకర్(రజి) స్వేచ్ఛను ప్రసాదించారు.

ఈయనకు తన పూర్వీకులన్నా, తన తెగవారన్నా చాలా అభిమానం. అందుకే తన పూర్వీకుల మతంపై ఆయనకు అభిమానం ఉండేది. అంతేగాని ఆయన మనస్సులో గాఢంగా పాతుకున్నదేమీ కాదు. ఒకసారి ఆయన ఖర్జూరాలతో ఓ విగ్రహాన్ని తయారుచేసుకుని, తరువాత దానిని తినేశారు, బహుశా ఆకలి వేయడం వలన కావచ్చేమో?

అయితే తన పూర్వీకుల మతానికి సంబంధించిన ఆచార వ్యవహారాలపై ఆయనకు మంచి జ్ఞానం ఉండేది. అందువల్లనే ఇస్లామ్ స్వీకరించాక, ఇస్లామ్ యొక్క సుందరత, సహజసిద్ధమైన లాజిక్ మరియు సత్యం చూసి ఆయన ఇస్లామ్‌ను ఎంతో ప్రశంసించారు.

ఆకలితో బాధపడిన వాడికి అన్నం విలువ తెలిసినంతగా ప్రతీరోజూ సమయానికి తినగలిగే వ్యక్తికి తెలియదు. అదే విధంగా ఇస్లామ్ యొక్క గొప్పతనం బాగా తెలిసేది ఎప్పుడంటే, అజ్ఞాన కాలపు విషయాలపై జ్ఞానం కలిగి ఉన్నప్పుడు.

ఉమర్(రజి)వారి విషయంలో అదే జరిగింది. నేడు ఇటువంటి ఎన్నో సజీవ ఉదాహరణలు మీకు కనిపిస్తాయి. ఏదైనా ఓ ధర్మంలో జీవిస్తూ, ఆ ధర్మంపై జ్ఞానం కలవారు, ఇస్లామ్ స్వీకరించాక, ఈ సత్యధర్మం యొక్క సుందరత వారిని ఆశ్చర్యానందాలకు గురిచేస్తుంది. అందువల్లనే ధర్మావగాహన కలిగిన నవముస్లిములు ఇతరుల కంటే ఉత్సాహంగా పనిచేయగలుగుతారు.

అంటే దీనర్థం ముస్లిమ్ కుటుంబంలో పుట్టినవారికి, ఇస్లామ్ యొక్క గొప్పతనం తెలియదని కాదు.

ఉమర్(రజి)వారు ఎటువంటి పరిస్థితులలో ఇస్లామ్ స్వీకరించారు అనే విషయంలో రెండు రకాల వెర్షన్‌లున్నాయి. ఆ రెండు వెర్షన్లలో ఏది బలమైనది అయినప్పటికీ ఉమర్(రజి)వారు మాత్రం సడన్‌గా ఇస్లామ్ స్వీకరించలేదు. ఇస్లామ్ స్వీకరించడానికి ముందు ఆయన మనస్సు చాలా సంఘర్షణకు గురైంది.

ఉమర్(రజి)వారు 'ఇస్లామ్'లోకి ఏ విధంగా ప్రవేశించారో, ఇన్షా అల్లాహ్, వచ్చే సంచికలో చెప్పుకుందాం.

# ఓ నదికి ఓ మానవుడు వ్రాసిన మొదటి మరియు చివరి లేఖ

## *UMAR IBN AL-KHATTAB's*

### *LETTER TO THE NILE RIVER OF THE EGYPT*

*During the Khilafa of Umar ibn al-Khattab when Egypt was conquered, its people came to Amr ibn al-As, when the first day of one of the months arrived and they said to him, "Amir, this Nile of ours has a requirement, without it it will not flow"  He asked, "And what is that?"*

*They said, "when eleven nights have elapsed of this month we seek a young girl from her parents.*

*We obtain the consent of the parents, then we dress her in the best possible clothing and ornaments, and then we throw the young girl in this Nile".*

*So Amr said to them, "This will never be in Islam. Islam demolishes what precedes it". They left, and a few days later the Nile river dried out the people gave up hope and decided to emigrate some place else.*

*When Amr saw that, he wrote to Umar ibn al-Khattab about it. Umar replied, "You were right in what you said. Truly, Islam demolishes what precedes it."*

*He sent a slip of paper inside his letter and wrote to Amr, "I have sent you a slip of paper inside my letter, so throw it in the Nile"*

*When Umar's letter reached 'Amr ibn al-As, he took the slip and opened it and the letter said.*

*"From the servant of ALLAH and Commander of the Muslims to the River of the Nile of Egypt, O Nile, if you flow of your own will, then you have the right to not flow. But if your flow is controlled by Allah, the Almighty, we pray to Him to keep you flowing".*

*This letter was thrown into the river, as directed by Umar(r). Amazingly, the river overflowed its banks that year. Such a big flood had not been seen for many years.*

*The country was once again green with crops. The people were happy. The savage practice of human sacrifice came to an end forever.*

*The river of Nile still flows till this date.*

*This was the first and the last letter ever written to a river. Umar ibn al-Khattab's (pbuh) faith was so strong that even nature reacted upon his words.*

*Brothers and Sisters, today we are not even close to achieving this kind of faith because we have fallen in love with this Dunya too much.*

*Most of us barely pray all five prayers and hardly recite the Quran. Although it is not a bit close to Umar ibn al-Khattab's and the other Sahabi's faiths, we need to change ourselves and even atleast do the minimums of praying and reciting Quran.*

*As brothers and sisters of Islam, we have to remind ourselves and others what is to come on the judgement day and we should all be prepared!*

**ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) ఖలీఫాగా ఉన్న కాలంలో ఈజిప్టు జయించబడింది. ఈజిప్టుకి 'అమ్ర్ బిన్ ఆస్'ని గవర్నర్‌గా నియమించడం జరిగింది. ఓ నెల మొదటి రోజున ప్రజలు ఆయన దగ్గరకు వచ్చి చెప్పారు, "ఓ నాయకా! ఈ నైలు నది ఒకటి కోరుతుంది, అది లేకుండా, ఈ నది ప్రవహించదు". ఆయన అడిగారు, "అయితే ఏమిటది?".**

**వారు చెప్పారు, "ఈ నెల పదకొండు రాత్రులు ముగిశాక, ఓ కన్యను ఆమె తల్లిదండ్రుల నుండి అర్థిస్తాము. తల్లిదండ్రుల అంగీకారాన్ని తీసుకుని, మాకు వీలైనంత బాగా ఆమెకు వస్త్రాలతో మరియు అభరణాలతో అలంకరించి ఆ కన్యను 'నైలు' నది లోకి పడవేస్తాము".**

అమ్ర్ గారు వారికి చెప్పారు, "ఇటువంటిది (ఆచారం) ఇస్లామ్‌లో ఎప్పటికీ ఉండదు. ఇస్లామ్ దానికి పూర్వమున్నదానిని రద్దు చేస్తుంది". వారు వెళ్లిపోయారు. కొన్ని రోజుల తరువాత నైలు నది ఎండిపోయింది. ప్రజలు తమ ఆశను వదులుకుని, వేరే ప్రాంతానికి వలస పోదామని నిర్ణయించుకున్నారు.

అమ్ర్ గారికి ఇది తెలియగానే, ఆయన ఉమర్ బిన్ ఖత్తాబ్ గారికి ఈ విషయం గురించి తెలియజేశారు. ఉమర్(రజి) సమాధానమిచ్చారు "మీరు చెప్పినదే సరైనది. వాస్తవంగా, ఇస్లామ్ దానికి పూర్వపు (ఆచారాలను) రద్దు చేస్తుంది".

ఉమర్(రజి)వారు అమ్ర్‌కు లేఖ వ్రాశారు. ఆ లేఖతో పాటు లోపల నైలు నదికి వ్రాసిన మరొక లేఖ నుంచి, ఆ లేఖను నైలు నదిలో పడవేయమని అమ్ర్‌గారికి ఆదేశించారు.

ఉమర్(రజి)వారి లేఖ చేరగానే, అమ్ర్ బిన్ ఆస్, ఆ స్లిప్‌ను తీసి తెరిచారు. మరియు ఆ లేఖలో ఇలా ఉంది :

"అల్లాహ్ యొక్క దాసుడు మరియు ముస్లిముల నాయకుని నుండి ఈజిప్టు నైలునదికి,

ఓ నైల్! నీవు నీ ఇష్టప్రకారంగా ప్రవహిస్తున్నట్లయితే, ప్రవహించ కుండా ఆగడానికి నీకు హక్కు ఉంది. కాని నీ ప్రవాహం సర్వశక్తి మంతుడైన అల్లాహ్ చేత నియంత్రించ బడుతున్నట్లయితే, మేము ఆయనను వేడుకుంటున్నాము నిన్ను ప్రవహిస్తూ ఉండేలా చేయమని".

ఉమర్(రజి)వారు ఆదేశించినట్లే, ఆ లేఖ నదిలో పడవేయడం జరిగింది. అద్భుతమేమిటంటే, ఆ సంవత్సరం నది గట్టులను దాటి పొంగిపొర్లి ప్రవహించింది. అంత పెద్ద వరద చాలా సంవత్సరాలనుండి అక్కడ ప్రజలు చూడలేదు. మరలా ఆ దేశం పొలాలతో పచ్చగా తయారైంది. ప్రజలు చాలా సంతోషపడ్డారు. మనిషిని బలి ఇచ్చే ఆ క్రూరమైన ఆచారం శాశ్వతంగా ముగిసిపోయింది.

నైలునది ఇప్పటికీ ప్రవహిస్తూనే ఉంది.

ఓ నదికి లేఖ వ్రాయడం అనేది ఇదే మొదటిది మరియు చివరిది కావచ్చు.ఉమర్(రజి)వారి యొక్క విశ్వాసం ఎంత గొప్పది అంటే, ఆయన మాటలకు ప్రకృతి కూడా స్పందించింది.

సోదరసోదరీమణులారా! ఇటువంటి విశ్వాసానికి ఈ రోజుల్లో దాని దరిదాపులలో కూడా లేము. ఎందుకంటే మనం చాలా ఎక్కువగా ఈ ప్రపంచాన్నే ప్రేమిస్తున్నాము.

ఉమర్(రజి)వారి విశ్వాసం ఇంత గొప్పది కనుకనే, ముహమ్మద్(స) వారు ఈయన విశిష్ఠతను సహాబాలకు ముందుగానే తెలియజేశారు. శాంతిబాట ఏప్రిల్-మే మరియు జూన్-జూలై సంచికలు చూడండి.

ఆలోచించండి! మనమున్న సమాజంలో ఎన్నో దురాచారాలున్నాయి. మేము మాట్లాడుతున్నది ఇతర మతాల గురించి కాదు. ముస్లిమ్ సమాజంలో కూడా ఎన్నో దురాచారాలను కొందరు కల్పించారు. ఖుర్ఆన్ మరియు ముహమ్మద్(స)వారి బోధనల ప్రకారం అవి తప్పు అని తెలిశాక అటువంటి వాటిని మనం మానుకోవాలి.

మూఢ ఆచారాలను ఇస్లామ్ నిషేధించింది.

గవర్నర్ ఆదేశించినట్లు ఈజిప్టు ప్రజలు తమ ఆచారాన్ని వదులుకున్నారు. వారు భయపడినట్లు నైలునది ఎండిపోయింది.

అది జరిగిన వెంటనే వారంతా ఏమనుకుని ఉంటారు? తమ మూఢాచారం నిజమే అనుకుని ఉంటారు. కన్యను నదిలో పడవేసి ఉంటే నీళ్ళు వచ్చి ఉండేవి అని వాపోతారు.

అదే విధంగా ఏ ముస్లిమ్ అయినా సరే, ఇస్లామ్‌కు వ్యతిరేకమైన ఓ దురాచారాన్ని పాటిస్తుంటే, దానిని వదిలేసినపుడు తాను నష్టపోయానని అనుకోవచ్చు. తనకు ఏదో జరుగుతుందని భయపడవచ్చు.

కాని శాశ్వతమైన లాభాన్ని అల్లాహ్ అనుగ్రహిస్తారని తెలుసుకోండి.

మూఢ విశ్వాసాలను రూపుమాపిన అత్యంత దైవభీతిపరుడు, మరియు ఎన్నో భూభాగాల విజేత - **ఉమర్ బిన్ ఖత్తాబ్** (రజి).

ఉమర్(రజి)వారి జీవితానికి సంబంధించి ఎన్నో ఆసక్తికరమైన సంఘటనలున్నాయి. వాటిని కూడా సందర్భాన్ని బట్టి ఇన్షా అల్లాహ్, అందిస్తాము.

**మూఢ నమ్మకాలకు ఇస్లామ్‌లో స్థానం లేదు. ఉమర్(రజి)వారు మూఢ నమ్మకాల విషయంలో చాలా కఠినంగా వ్యవహరించారు.**

# తిరిగి గూటికి

ప్రారంభంలో చెప్పుకున్నట్లు, దైవధర్మం అనేది ఏ ఒక్కరి సొత్తో కాదు. ప్రకృతిలాగే ఇది అందరికీ చెందుతుంది. ఈ వాస్తవాన్ని ఆలస్యంగానైనా సరే చాలా మంది తెలుసుకుంటున్నారు. ప్రస్తుతం ఇస్లాం (శాంతి) ధర్మం ప్రపంచంలో అత్యంత వేగంతో విస్తరిస్తుంది. ఈ ధర్మంపై బురద చల్లడానికి పాశ్చాత్యులు చేస్తున్న కృషి వలన, ఈ ధర్మవ్యాప్తి తగ్గడానికి బదులు దీని వేగం మరింత పెరుగుతూ వస్తుంది. ప్రస్తుతం అమెరికాలో ప్రతీ సంవత్సరం సగటున 20,000 మంది ఇస్లాం ధర్మంలో ప్రవేశిస్తున్నారు. మన దేశంలో, మన రాష్ట్రంలో కూడా ఈ దైవ ధర్మాన్ని చాలామంది తెలుసుకుని, ఈ ధర్మంలో ప్రవేశిస్తున్నారు. ఈ ధర్మాన్ని ఆచరించడం అనేది 'మత మార్పిడి' ఎంత మాత్రం కాదు. దారి తప్పిన సోదరి లేదా సోదరుడు తిరిగి తన పయనించవలసిన దారిని చేరుకోవడం లాంటిది. ఇలా తిరిగి గూటికి చేరుకున్న ఓ సోదరి గురించి గాని, ఓ సోదరుని గురించి గాని ఈ శీర్షికలో పరిచయం చేయబడుతుంది.

ఇస్లాం ధర్మంలో అడుగిడిన వీరిని కొత్త ముస్లింలు లేదా నవముస్లింలు లేదా నౌ ముస్లింలుగా అభిమానంతో తోటి ముస్లిం సోదరసమాజం పిలుస్తుంది. అయితే ఇస్లాం పట్ల అవగాహన లేని కొంతమంది 'ముస్లిం' సోదరులుగాని, విద్వాంసులుగాని ఈ నవముస్లింల పట్ల ప్రవర్తించే తీరు కొంతమేర అభ్యంతరకరంగానూ, ప్రియ ప్రవక్త ముహమ్మద్ (స) వారి సాంప్రదాయానికి వ్యతిరేకంగానూ ఉంటుంది. ఇస్లాం పట్ల అవగాహన ఉన్నవారు వీరిని ఆప్యాయంగా అక్కున చేర్చుకుంటున్నారు. దారి తప్పిన తమ సోదరుడు లేదా సోదరి తిరిగి తన గూటికి చేరుకున్నారన్న ఆనందోత్సాహం వారిలో స్పష్టంగా కనిపిస్తుంది.

ఇస్లాం ధర్మాన్ని అవగాహన చేసుకుంటే, ఏ ధర్మానికి చెందినవారైనా సరే, ఇది ఖచ్చితంగా దైవధర్మమనే విషయాన్ని అంగీకరిస్తారు. కాని ఈ ధర్మాన్ని ఆచరించడానికి మనో ధైర్యం కావాలి. దైవ భీతికలవారికి ఇది సునాయాసంగా లభిస్తుంది. కుటుంబానికో, సమాజానికో భయపడటం వల్లనో లేదా ఇతరత్రా కారణాల వల్లనో దైవధర్మానికి చాలామంది దూరంగా ఉన్నారు.

అలాగే కొత్తగా దైవధర్మంలోకి వచ్చిన వారికి చాలా సందేహాలుంటాయి. ఒక్కసారిగా అన్ని పుస్తకాలనూ వారు చదువలేరు. ధర్మావగాహనకు కూడా కొంత సమయం పడుతుంది. అనుభవజ్ఞుల వివరణలు వీరికి చాలా అవసరం. ఇంతకు ముందరి జీవితంలోని కొన్ని అభ్యంతరకరమైన అలవాట్లు నుండి దూరం కావడానికి మరికొందరికి సమయం పడుతుంది. వారు ప్రారంభంలో ఓ ప్రత్యేకావస్థకు గురై ఉంటారు. వారికి ప్రవక్తగారి సాంప్రదాయ ప్రకారం సౌమ్యంగా, సహనంతో అన్ని విషయాలను ఆకళింపు చేసుకొనేలా చేయడం, వారికి తోడుగా ఉండడం మనందరి బాధ్యత.

ఈ శీర్షిక ద్వారా వీలుని బట్టి నవ ముస్లిం సోదరులకు ఎదురయ్యే ఇబ్బందులు, వాటిని సునాయాసంగా అధిగమించడానికి ఖుర్ఆన్, హదీసుల వెలుగులో పరిష్కారాలను కూడా అందించే ప్రయత్నం జరుగుతుంది, ఇన్షా అల్లాహ్.

## నవ ముస్లిముల సమస్యలపై ప్రత్యేక వ్యాసం – 2

*క్రిందటి సంచికలో నవముస్లిములు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ ఓ నవముస్లిమ్ సోదరుడు ఆవేదన వ్యక్తం చేస్తూ వ్రాసిన లేఖను అందించాము.* ***ఆ సమస్యలకు ఖుర్'ఆన్ మరియు సున్నత్ విధానంలో పరిష్కార మార్గాన్ని ఇన్షా అల్లాహ్ ఈ సంచికలో అందిస్తామని చెప్పడం జరిగింది.*** సోదరుడు చేసిన కామెంట్ :

> **ప్రారంభంలో దావా కోసం చాలా ఆసక్తి చూపుతారు. వారి పని అయిపోగానే మరలా కనిపించరు. నవముస్లిములకు ముఖ్యమైన సహాయ సహకారాలను అందించడం మర్చిపోతారు.**

*కొంతకాలం క్రితం వరకూ పుస్తకాల ద్వారా ఇస్లామ్ గురించి తెలుసుకుని ఈ ధర్మాన్ని స్వీకరించేవారు. ఈ మధ్య కాలంలో ఇంటర్‌నెట్‌లో విషయాలను చదివి 'ఇస్లామ్'ను అర్థం చేసుకుని ఇస్లామ్ స్వీకరించేవారి సంఖ్య కూడా రోజురోజుకీ పెరుగుతుంది. జరుగుచున్న ఈ శుభపరిణామాలతో పాటు, సమాజంలో కొన్ని చెడు పరిణామాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. ఆ చెడు ఏమిటంటే అజ్ఞానుల సంఖ్య కూడా పెరగడం. "మేము ఇంతమందిని మార్చివేశాము. మీ సెంటర్ వాళ్ళు ఎంతమందిని మార్చారు?" అంటూ ఓ సగటు అజ్ఞాని మాట్లాడే మాటలు వింటూ ఉంటే ఆవేదన కలుగుతుంది. ఈ షిర్క్ నుండి వారిని ఇన్షా అల్లాహ్ తప్పించడానికి మనం ప్రయత్నించాలి.*

***మార్గం చూపేది మరియు మనస్సులు మార్చేది కేవలం అల్లాహ్ మాత్రమే!*** *అల్లాహ్ తాను కోరిన వారికి మార్గాన్ని చూపుతాడు. ఓ వ్యక్తి ఇస్లామ్‌ను స్వీకరించాడు అంటే, అల్లాహ్ ఆ వ్యక్తిని ఎన్నుకున్నాడని స్పష్టమౌతుంది. సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌చే ఎన్నుకోబడటం కంటే భాగ్యం ఏముంటుంది? తిరిగిగూటికి చేరే వారిలో నిజ దైవం విషయంలో ఆలోచనలు మొదలౌతాయి. అప్పుడే ఆ వ్యక్తి మనస్సులో సంఘర్షణ మొదలౌతుంది. ఆ సంఘర్షణ స్థాయి ఆ వ్యక్తికి ఉండే జ్ఞానస్థాయిపై ఆధారపడి ఉంటుంది.*

*జరుగుతున్న ఈ సంఘర్షణకు పరిష్కారంగా ఏదో ఒక పుస్తకం ద్వారానో లేదా ఓ వ్యక్తి చేతనో కొన్ని విషయాలను అల్లాహ్ చెప్పిస్తాడు. ఆ పుస్తకాన్ని అంతకు పూర్వం ఎంతోమంది చదివి ఉంటారు. అదే విధంగా అవతలి వ్యక్తి అవే మాటలను ఎన్నోసార్లు ఎందరికో చెప్పి ఉంటాడు.*

కాని వాటికి ఏనాడూ కనిపించని స్పందన ఇస్లామ్‌ని స్వీకరించబోయే ఈ వ్యక్తి విషయంలో కనిపిస్తుంది.

ఆ లాజిక్ ఏమిటో అల్లాహ్‌కే తెలుసు. ఖుర్‌ఆన్‌లోని ఓ ఆయత్ చదవగానే ఉమర్(రజి)వారికి కళ్ళ వెంట నీళ్ళు వచ్చాయి. కాని ఆ ఆయత్‌ని ఎంతోమంది చదివి ఉంటారు. ఇప్పుడు ఆ ఆయత్‌ని మనం చదివితే, 'ఈ ఆయత్‌లో కళ్ళ వెంట నీరు తెప్పించేటంత కొత్త విషయం ఏమిటి?' అని మనకు అనిపించవచ్చు. కాబట్టి ఎవరిపై ఏ వాక్యం పనిచేస్తుందో ఎవరికీ తెలియదు. ఒకరి మనస్సులోని ఆలోచనలు మనకు తెలియవు. మనం సాధారణంగా మాట్లాడే ధార్మిక విషయాలలో ఏఏ మాటలు వినేవారిపై ప్రభావం చూపుతాయో కూడా మనకు తెలియదు.

పిచ్చుకల వంటి చిన్న పక్షులచే, అవి వదిలిన చిన్న చిన్న మట్టి రాళ్ళతో అల్లాహ్ దాదాపు 60వేల మంది అబ్రహా సైన్యాన్ని సర్వనాశనం చేశాడు. ఇక్కడ సర్వ నాశనం చేసింది అల్లాహుతాలాయే! అది పక్షుల చేసిన అద్భుతం కాదు.

అల్లాహ్ తలచుకుంటే పురుగుచేత కూడా మానవుడు చేయలేని ఎన్నో గొప్ప పనులను చేయించగలడు. పెద్దగా జ్ఞానంలేని వ్యక్తి చేత జ్ఞానులు కూడా ఆశ్చర్యపోయేటటువంటి మాటలు చెప్పించగలడు.

కాబట్టి ఏ వ్యక్తి అయినా సరే ఇస్లామ్ స్వీకరించి తిరిగి గూటికి చేరినట్లయితే, దానికి కారణం 'దాయీ' అని పేరు చెప్పుకుని బ్రతికే కుహనా పూజారులు కాదు. అది వారి గొప్పతనమూ కాదు.

దావా చేసేవారు, వారి పని అయిపోగానే మరలా కనిపించరు. నవముస్లిములకు ముఖ్యమైన సహాయ సహకారాలను అందించడం మర్చిపోతారు అని నవ ముస్లిమ్ సోదరుడు చెప్పింది నిజమే! 'దావా' అనేది ప్రతీ ముస్లిమ్ యొక్క బాధ్యత. ఆ విషయం తెలుసుకుని ప్రతీ ముస్లిమ్ ధర్మావగాహన కలిగి ఉంటే, అప్పుడు కొత్తగా ఈ ధర్మంలో అడుగుపెట్టినవారు ఏ ముస్లిమ్ దగ్గరైనా ధార్మిక విషయాలు తెలుసుకోగలుగుతారు. అప్పుడు ప్రత్యేకంగా దాయీ అనే ఓ వ్యక్తి అవసరం లేదు. నిజానికి అది సున్నత్ ఎంతమాత్రం కాదు.

ఇస్లామీయ విధానానికి వ్యతిరేకంగా, వ్యాపారదృష్టితో 'దాయీ' వ్యవస్థను తయారుచేసుకున్నవారు, నవ ముస్లిమ్‌లను వదిలేయడంలో ఆశ్చర్యమేమీ లేదు. వారి ఖాతాలో ఆ నవముస్లిమ్ పేరును వ్రాసుకుంటారు. ఓ ఫొటోగాని, ఓ వీడియోగాని తీసుకుని వాటిని దావా కొరకు ఆర్థిక వనరులు సమకూర్చేవారికి అందించి, కొంత పైకం సంపాదిస్తారు. ఇక ఈ నవముస్లిమ్ దగ్గర నుండి కాసులు రాబట్టడానికి ఉచితంగా అందించవలసిన ఖుర్‌ఆన్‌లను అమ్ముకోవడమే కాకుండా, ఇతర సిడిలను అమ్మడానికి ప్రయత్నిస్తారు. వారి ప్రయత్నం సఫలీకృతం అయితే, నవ ముస్లిముల నుండి గాని లేదా వారుండే ప్రాంతం నుండి గాని కాసులు రాలేటంత వరకూ నవముస్లిమ్‌లతో ఉంటారు. లేకపోతే వారిని వదిలేస్తారు.

**ఏనాడైతే మీరు తిరిగి గూటికి చేరుకున్నారో, మిమ్మల్ని ఎవరు వదిలి వేసినా సరే, మీలో విశ్వాసమున్నంత కాలం అల్లాహ్ మిమ్మల్ని వదలరు అని తెలుసుకోండి.**

మీలో విశ్వాసం కలగగానే, అల్లాహ్‌తో మీకు ప్రత్యక్షంగా కమ్యూనికేషన్ మొదలైనట్లే. ఏ మధ్యవర్తి అవసరం మీకు లేదు. మీకు ఏ అవసరమొచ్చినా, ఏ సమయంలోనైనా మీరే ఆయనని డైరక్టుగా అడగగలుగుతారు.

**సర్వశక్తిమంతుడైన, సర్వాన్ని సృష్టించిన అల్లాహ్ మీతో ఉండగా కొందరు అల్పులు మీతో ఉంటే ఎంత? లేకపోతే ఎంత?**

**సోదరుడు చెప్పిన మరో సమస్య :**

> **"సత్యాన్ని స్వీకరించిన వ్యక్తి, అకస్మాత్తుగా తాను ఎన్నో కష్టాలతో యుద్ధరంగంలో నిలబడినట్లు భావిస్తాడు. అంటే ప్రారంభ దశలోనే, విశ్వాసం ఇంకా బలపడకుండానే అతను ఒంటరివాడై పోతున్న భావన. అందువలన కొందరు దుర్మార్గుల చేతిలో పడిపోవచ్చు మరియు అల్‌హమ్‌దులిల్లాహ్ వారు తిరిగి సత్యం వైపుకు రావచ్చు."**

ప్రతీ ముస్లిమ్ అల్లాహ్‌చే పరీక్షించబడతాడు. పరీక్షలు ఉంటాయి. పరీక్షలు తప్పనిసరిగా ఉండాలి. ఇవే మన గౌరవాన్ని పెంచుతాయి. మన జీవితాన్ని సంతోషమయం చేస్తాయి. 10వ తరగతి పరీక్ష పాసయిన వ్యక్తికి మీరు ఎటువంటి విలువ ఇస్తారో, అటువంటి విలువనే మెడిసిన్ పరీక్ష పాసయ్యి డాక్టరైన వ్యక్తికీ ఇస్తారా? మెడిసిన్ పాసయిన వారికి ఎక్కువ విలువ ఇస్తారు కదా! పరీక్ష పెద్దది అయ్యేకొద్దీ, లభించే ఫలితం కూడా గొప్పగానే ఉంటుంది.

ఏ సమస్య అయినా, ఏ పరీక్ష అయినా కొత్తది అయితేనే కదా మీరు ఆలోచించాలి. పరిష్కారం లేకపోతేనే కదా మీరు కంగారుపడాలి. ఒకవేళ అటువంటి సమస్య ఎంతో కాలంపాటు ఎందరికో వచ్చింది అని తెలిస్తే, వారు ఆ సమస్యను ఏ విధంగా పరిష్కరించుకున్నారో తెలుసుకుంటే, మీరు కూడా ఆ పరిష్కార మార్గాన్ని అనుసరించవచ్చు.

**నవముస్లిములకు ఉండే సమస్య ఈనాటిది కాదు.** అరేబియాలో ఇస్లామ్ తిరిగి ఆవిర్భవించిన దగ్గరనుండే ఉంది. ముహమ్మద్(స)వారు తప్ప **ఇస్లామ్ స్వీకరించిన మొట్టమొదటి ఏడుగురు నవముస్లిములే కదా!** వారిలో బానిస నుండి మొదలుకుని సమాజంలో ఉన్నత వంశానికి చెందిన వారి వరకూ ఉన్నారు. అంటే సమాజంలో ఉండే అన్ని వర్గాలవారూ వారిలో ఉన్నారు.

అల్లాహ్‌కు సమస్తమూ తెలుసు. ఈ తొలి నవముస్లిమ్‌లకు ఎన్నో పరీక్షలను తట్టుకునే శక్తినిచ్చి మనందరికీ ఓ గొప్ప సందేశాన్ని ప్రారంభంలోనే వారి ద్వారా అందించారు. వీరి గురించి తెలుసుకుంటే, **ఏ నవముస్లిమ్‌కి కూడా ఆవేదన అనేదే కలుగదు.**

ఈ సంచికలో ఇస్లామ్ స్వీకరించిన తొలి ఏడుగురిలో ఒక నవముస్లిమ్ గురించి అందిస్తున్నాము. వారి వృత్తాంతం ద్వారా సోదరుడు లేవనెత్తిన కొన్ని సమస్యలకు పరిష్కార మార్గాన్ని అందిస్తున్నాము.

ప్రపంచంలో బానిసత్వమనేది అనాదిగా ఉంది. శతాబ్దాల తరబడి సమాజంలో పాతుకుపోయిన ఈ బానినత్వ వ్యవస్థను ముహమ్మద్(స)వారు పునాదులతో సహా కదిలించారు. ఎటువంటి ఉద్యమాలు, రక్తపాతాలు లేకుండా బానిస వ్యవస్థను ఇస్లామ్ ఎంత చక్కగా రూపుమాపిందో తెలియాలంటే 'ఇస్లామ్' చరిత్రను తెలుసుకోవాలి. ప్రపంచంలో అన్ని చోట్ల ఉన్నట్లే మక్కా నగరంలో కూడా బానిసత్వం ఉండేది. బానిసలను పశువులను కొన్నట్లు మార్కెట్‌లో కొనుక్కునే వారు.

### బిలాల్ బిన్ రబహ్ (రజి)

ఉమయ్యా బిన్ ఖలఫ్ అనే ఖురైష్ నాయకుని బానిసలలో బిలాల్ ఒకరు. బిలాల్ చేయవలసిన పనులు : పగలు ఒంటెలను మక్కా ఎడారిలో మండుటెండలో మేపాలి. రాత్రుళ్ళు అతని యజమానికి ఆహారం వడ్డించడం మరియు మద్యాన్ని అందించడం చెయ్యాలి. అతని యజమాని దాదాపు ఓ మృగం వంటి వాడు. పూర్తిగా తిని, త్రాగి పడుకునేవాడు. బానిసలతో అమానుషంగా ప్రవర్తించేవాడు. బానిసలలో ఎవ్వరూ యజమానిని ఎదిరించలేరు.

బిలాల్ కుండే ధృఢ శరీరం వల్లనే అతని యజమాని అతనిని ఉండనిచ్చాడు. బిలాల్ తన యజమానికి శాయశక్తులా సేవచేసేవారు. బిలాల్ చిన్న వయస్సులో ఉండగా ఉమయ్యా ఆయనని కొన్నాడు. బిలాల్ అతని ఇంటిలో అడుగుపెట్టిన క్షణం నుండీ అతని పట్ల ఆ కుటుంబంలోని సభ్యులందరూ అమానుషంగా ప్రవర్తించేవారు. బిలాల్ భుజస్కందాలపై ఎన్నో బాధ్యతల నుంచారు. ఆయనకి విశ్రాంతి లేకుండా చేసేవారు. యజమాని క్రూరత్వాన్ని ఎదిరించగలిగే శక్తి ఆయనకి లేదు. బానిసత్వం నుండి స్వేచ్ఛ పొందడానికి అతని దగ్గర డబ్బూ లేదు.

తన యజమాని ఆదేశాల మేరకే బిలాల్ విగ్రహాలను పూజించేవారు. కాని ఆయన మనస్సుకి ఆ రాళ్ళు తనకు మేలుగాని, కీడుగాని చేయలేవని తెలుసు.

ఒక రోజు ప్రజలు కొత్త ప్రవక్తగారి గురించి మాట్లాడటం బిలాల్ విన్నారు. "అల్లాహ్ ఒక్కరినే ఆరాధించాలని పరస్పరం న్యాయంగా మరియు సమానత్వంతో వ్యవహరించాలని బోధిస్తున్నారని" విన్నారు. సృష్టికర్త దగ్గర అందరూ సమానులే అని ప్రవక్త(స)వారు బోధించారు. అల్లాహ్‌పై ఉండే విశ్వాసం మరియు ధర్మపరాయణతే ఒక వ్యక్తి యొక్క ఉన్నత స్థితిని తెలియజేస్తుంది.

మక్కావాసులు తమ కల్పితదైవాలను వదిలి, అలాహ్ ఒక్కరినే ప్రార్థించాలని మరియు తమ బానిసలతో దయతో వ్యవహరించాలని ప్రవక్త(స) కోరేవారు.

బిలాల్ చాలా రోజులు ఇస్లామ్ సందేశం గురించే ఆలోచించారు. ఇంతకుముందు ఏనాడూ ఊహించడానికి ధైర్యం చేయని విషయాల గురించి రోజంతా ఎడారిలో తిరుగుతూ ఆలోచించ సాగారు.

ఆయనకి సత్యం అర్థమైంది. ప్రవక్త(స)వారితో ముఖాముఖి కలిసి కొత్త ధర్మం గురించి ఇంకా ఎక్కువ తెలుసు కోవాలనుకున్నారు. చివరికి ప్రవక్త(స)వారికి అత్యంత సన్నిహితుడైన వ్యక్తిని కలవాలని నిర్ణయించుకున్నారు. చీకటిలో భయంతో గుండె కొట్టుకుంటుండగా బిలాల్ రహస్యంగా తన గది నుండి అబూ బకర్(రజి)వారి ఇంటివైపు వెళ్ళారు. ఆయన ఎక్కడికి వెళుతున్నారో ఎవరూ ఊహించని విధంగా వేరే మార్గంలో వెళ్ళారు. ఎందుకంటే ముహమ్మద్(స)వారి పిలుపు విని వెంటనే విశ్వసించిన వ్యక్తి అబూబకర్(రజి) వారేనని బిలాల్‌కు తెలుసు.

ఆయన అబూబకర్(రజి)వారి ఇంటికి చేరగానే, ఆయన తలుపు తట్టి లోపలికి వెళ్ళారు. ఈ కొత్త ధర్మం గురించి అబూబకర్(రజి) వారిని చాలా ప్రశ్నలు అడగడం ప్రారంభించారు. అబూబకర్(రజి)వారు నెమ్మదస్తులే కాకుండా బానిసలను చాలా దయతో చూసేవారు. అబూబకర్(రజి)వారు చాలా విషయాలు చెప్పారు.

"ముహమ్మద్(స)వారి సందేశాన్ని మీరు విశ్వసిస్తున్నారా?" బిలాల్ అడిగారు. ఆయన చెప్పిన ప్రతీ మాటను విశ్వసిస్తున్నట్లు అబూ బకర్(రజి) చెప్పారు. తాను కూడా ముస్లిమ్ కావాలని కోరుకుంటున్నట్లు బిలాల్ తన మనస్సులోని మాటను బయటపెట్టారు.

ఆ రాత్రంతా బిలాల్ నిద్రపోలేదు. ఆలోచిస్తున్నారు.

తరువాత రోజు అబూ బకర్(రజి), బిలాల్‌ను ముహమ్మద్(స)వారి దగ్గరికి తీసుకువెళ్ళారు. అక్కడ ప్రవక్త(స)వారు క్రింది ఆయత్ పఠిస్తుండగా విన్నారు.

**"ఓ మానవులారా! నిశ్చయంగా మేము మిమ్మల్ని ఒక పురుషుడు మరియు ఒక స్త్రీ నుండి పుట్టించాము మరియు మీరు ఒకరినొకరు గుర్తించుకోవడానికి మిమ్మల్ని జాతులుగా మరియు తెగలుగా చేశాము. నిశ్చయంగా, మీలో ఎక్కువ దైవభీతి గలవాడే, అల్లాహ్ దగ్గర ఎక్కువ గౌరవం గలవాడు. నిశ్చయంగా, అల్లాహ్ సర్వజ్ఞుడు, సర్వం తెలిసినవాడు."** (ఖుర్ఆన్ 49:13)

బిలాల్ శ్రద్ధగా విన్నారు. మానవుల మధ్య సమానత్వ భావన ఆయనకు బాగా నచ్చింది. ఇస్లామ్ ధర్మాన్ని అనుసరించడానికి ఆయనలో ఆతృత పెరిగింది. ఆయన వెంటనే ఇస్లామ్ స్వీకరించారు.

ఇస్లామ్ స్వీకరించిన తరువాత బిలాల్(రజి) కాబా మస్జిద్‌కు వెళ్లారు. కాబా చుట్టూ ఉన్న విగ్రహాలను చూశారు. వాటి ముఖాలలోకి తిన్నగా చూస్తూ వాటితో మాట్లాడారు. మరియు వాటిని ముట్టుకున్నారు. అవి శక్తి లేనివి. అవి కేవలం బొమ్మలు మాత్రమే.

అతిపెద్ద విగ్రహమైన **హుబల్** ముందు ఆయన నిలుచుని దానితో మాట్లాడారు. అయితే ఆ విగ్రహం నుండి ఎటువంటి సమాధానం రాదు కదా! ఆ విగ్రహాన్ని బిలాల్(రజి) చీదరించుకున్నారు. ఆయన **హుబల్‌**తో గుసగుసలాడారు: **"నీవు కేవలం రాయివి మాత్రమే. నీ ముందు నిలుచోవడం కాలాన్ని వృథా చేయడమే. నీకు శక్తి లేదు."** హుబల్ ముఖంపై ఆయన ఉమ్మివేసారు. ఈ రాళ్ళ కంటే విశ్వాన్ని సృష్టించిన వానికే శక్తి ఉందని అర్థం చేసుకున్నారాయన.

**అరబ్బులు అమితంగా ఆరాధించే హుబల్ విగ్రహంపై బిలాల్(రజి) ఉమ్మివేయడాన్ని ఒక వ్యక్తి చూడటం జరిగింది.**

తరువాతి రోజు ఉమయ్యా బిన్ ఖలఫ్ ఇస్లామ్‌కు బద్ధ విరోధి అయిన అబూ జహ్లోతో కాబా దగ్గర మాట్లాడుతుండగా అతని చెవిలో ఓ వ్యక్తి గుసగుసలాడాడు. ఆ వ్యక్తి మరెవరో కాదు, క్రిందటి రోజున హుబల్ విగ్రహంపై బిలాల్(రజి) ఉమ్మి వేయడాన్ని చూసిన వ్యక్తి.

అది విన్న ఉమయ్యా కోపంతో ఊగిపోయాడు. పెద్ద కొరడా తీసుకుని బిలాల్ గదికి వెళ్ళాడు. అక్కడ బిలాల్(రజి) నిశ్శబ్దంగా మరియు ప్రశాంత స్థితిలో కూర్చుని ఉన్నారు. కోపంతో ఆయనని అడిగాడు :

"ఇది నిజమా, నీవు మా ధర్మాన్ని వదిలేసి మంత్ర ముగ్ధుణ్ణి చేసే ఆ వ్యక్తిని విశ్వసిస్తున్నావా, ఓ నల్లజాతి స్త్రీకి పుట్టినవాడా?"

ఆత్మ విశ్వాసం తొణికిసలాడుతుండగా బిలాల్(రజి) సమాధాన మిచ్చారు : **"ఔను, నిజమైన విశ్వాసం వైపుకు అల్లాహ్ నాకు మార్గం చూపారు"**

ఉమయ్యా అటువంటి సమాధానానికి ఆశ్చర్యపోయాడు. చేతిలో పొడవైన కొరడా ఉంది. అలా నిలుచుని బిలాల్(రజి)తో బేరసారాలు ఆడటం మొదలుపెట్టాడు. అయినాసరే, బిలాల్(రజి) దేనినీ అంగీకరించ లేదు. తన ధర్మాన్ని వదిలేసి, మరలా విగ్రహాలను పూజించాలని ఆయనతో చెప్పడం జరిగింది.

బిలాల్(రజి) తన విశ్వాసానికి బదులుగా దేనినీ అంగీకరించడని తెలిశాక, చివరికి ఉమయ్యా తన ఇతర బానిసలను పిలిచాడు. వారితో బిలాల్(రజి) బట్టలను విప్పి అతని ముఖాన్ని పట్టుకుని కాబా దగ్గరకు ఈడ్చుకు రమ్మని చెప్పాడు. కాబా మస్జిద్ దగ్గర, ఆ బానిసలు బిలాల్(రజి)వారి శరీరాన్ని ఇనుప గొలుసులతో కట్టి అతడు తన ధర్మాన్ని వదిలేటందుకు కొరడాతో హింసాత్మకంగా కొట్టడం ప్రారంభించారు. ప్రతీ కొరడా దెబ్బకు అతని శరీరం నుండి రక్తం బయటకు చిమ్మి గాటు పడేది. ఇంత క్రూరంగా ఆయనను హింసించినా సరే, బిలాల్(రజి) మాత్రం ఒకే నిజ దైవమైన అల్లాహ్‌పై తన ధృఢ విశ్వాసాన్ని వదులు కోలేదు. ఆయన చెబుతూనే ఉన్నాడు : " **అహద్**(అల్లాహ్ ఒక్కడు), **అహద్** (అల్లాహ్ ఒక్కడు)".

ఎన్నో రోజులపాటు ఆయన రకరకాల శిక్షలను అనుభవించారు. కాని ఆయన విశ్వాసంలో ఏ కొంచెం బలహీనతా కనిపించ లేదు. ఎన్ని రకాలుగా అణిచివేతకు వీలవుతుందో అన్నిరకాలుగా ప్రయత్నించిన ప్రతీసారి, ఆయన గట్టిగానూ స్పష్టంగానూ చెప్పేది ఒక్కటే : "**అల్లాహ్ ఒక్కడు, అల్లాహ్ ఒక్కడు**".

ఉమయ్యాకు అర్థమైంది ఈయన విశ్వాసాన్ని వదలడని. ఇక మరో రకంగా హింసించడానికి నిర్ణయించుకున్నాడు. దాని వలన కరుణ చూపమని తనను బ్రతిమాలతాడని భావించాడు. బిలాల్(రజి) వారిని ఎడారిలోకి తీసుకెళ్ళి ఇనుప గొలుసులను శరీరానికి చుట్టి మండే ఎండలో ఇసుకనేలపై పరుండబెట్టి ఛాతీమీద బండరాయిని ఉంచమని తన బానిసలకు ఆదేశమిచ్చాడు. అయినాసరే బిలాల్(రజి) తన యజమానిని దయ చూపమని అడగలేదు, ఏడవలేదు ఆయన పలికేది కేవలం "**అల్లాహ్ ఒక్కడు, అల్లాహ్ ఒక్కడు**".

ఎన్ని రకాల బాధలకు మరియు హింసలకు గురైనాసరే, ఒక్కడైన అల్లాహ్‌ను విశ్వసించడంలో స్థిరంగా ఉన్నారు. **బిలాల్(రజి) బానిసలకే కాదు, స్వేచ్ఛగలవారికి కూడా ఓ ఉదాహరణ.** అల్లాహ్‌పై తన విశ్వాసానికి బదులుగా ఆయన దేనినీ అంగీకరించలేదు, తన జీవితాన్ని సైతం.

బిలాల్ ఇంతకు ముందరిలా ఓ బలహీనమైన బానిస కాదు. ఇప్పుడు ఆయన ఓ గొప్ప ధైర్యాన్ని కలిగిన వ్యక్తి. ఆయన ఇస్లామ్ స్వీకరించగానే ఆయన హృదయం తన విశ్వాసాన్ని దెబ్బతీసే దేనినైనా నిరోధించగలిగే శక్తితో నిండిపోయింది. అంతకు ముందెన్నడూ ఆయనకు అటువంటి అనుభూతి కలుగలేదు.

ఒకరోజు బిలాల్(రజి)ను మండే ఎండలో కాలుతున్న ఇసుకపై పడుకో బెట్టారు. ఆయన ఎదపై ఓ పెద్ద బండరాయిని ఉంచారు. ఆయనని హింసించే వారంతా ఆయన చుట్టూ చేరారు, బిలాల్(రజి) చివరికి తన ధర్మాన్ని వదిలేస్తారని వారు అందరూ ఎదురు చూస్తున్నారు. తమ కల్పిత దైవాల గురించి మంచిగా చెప్పమని, అతనికి స్వేచ్ఛనిస్తామని చెప్పారు. కాని వారు కోరినట్లు కాకుండా, "అల్లాహ్ ఒక్కడు, అల్లాహ్ ఒక్కడు" అని మాత్రమే పలికారు. అహం తృప్తి పడకుండా అతనిని వారు వదలదలచుకోలేదు. వారు తిరిగి అడిగారు, కాని బిలాల్(రజి) ఇలా చెప్పారు : **"మీరు నన్ను చెప్పమన్నది నేను చెప్పలేను. నేను 'అల్లాహ్ ఒక్కడు అల్లాహ్ ఒక్కడు' అని మాత్రమే చెప్పగలను."**

సూర్యాస్తమయం కావస్తుంది. బిలాల్(రజి) మెడకు తాడు కట్టబడింది. వారు అతనిని మక్కా వీధుల గుండా ఈడ్చుకుని పోతూ పిల్లలచేత తిట్టించి, రాళ్ళతో కొట్టించారు. అయినప్పటికీ ఆయన ధర్మంపై స్థిరంగానే ఉన్నారు.

ప్రతీరోజూ మక్కా విగ్రహారాధకులు తమ అణచివేతను పెంచుతూనే ఉన్నారు. బిలాల్(రజి) 'అల్లాహ్ ఒక్కడు, అల్లాహ్ ఒక్కడు' అంటూనే ఉన్నారు. ఈయనొక నిజమైన విశ్వాసి.

బిలాల్(రజి)వారి యొక్క సహనం మరియు ఓర్పు మక్కా మరియు పరిసర ప్రాంతాలకు తెలిసింది. పెద్దలు, పిల్లలు, నాయకులే కాదు అందరూ బిలాల్ ఇస్లామ్ స్వీకరణ గురించి, ఆ కొత్త ధర్మం గురించి ఆయన భరిస్తున్న హింస గురించే మాట్లాడుకుంటున్నారు.

త్యాగానికి మరియు ఓర్పుకి ఈయన ఓ ఉదాహరణ.

ఉమయ్యా మరలా బిలాల్(రజి)వారిని ఇసుకపై పరుండబెట్టి, ఎదపై పెద్ద రాయిపెట్టి, ఆయన శరీరంపై నిలుచుని ఏకైక ఆరాధ్యుడైన అల్లాహ్‌పై విశ్వాసం వదిలేయమన్నాడు.

(పాఠకులు ఇక్కడ ఓ విషయాన్ని గమనించాలి. అల్లాహ్‌ను విశ్వసించడం మానమని యజమాని చెప్పడం లేదు. ఎందుకంటే అరబ్బులకు అల్లాహ్‌పై విశ్వాసం ఉంది. 'కేవలం అల్లాహ్‌నే ప్రార్థించాలి. ఆయనతో పాటు విగ్రహాలనుగాని మరి వేటినీ ప్రార్థించకూడదు' అని చెప్పడాన్నే వారు వ్యతిరేకించారు)

బిలాల్(రజి) తన ధర్మాన్ని వదిలివేయనందుకు కొరడాతో కొట్టడం వలన ఆయన శరీరం మరియు ముఖం రక్తసిక్తమై పోయాయి.

ఈ విషయాలు తెలిసి అబూబకర్(రజి) ఉమయ్యాను కలిసి బిలాల్(రజి)ను తనకు అమ్మివేయమని చెప్పారు. ఉమయ్యా అతనిని వదలడానికి తిరస్కరించి కోపంగా అబూబకర్(రజి)తో అన్నారు : "నీవే అతనిని పాడుచేసింది"

అబూబకర్(రజి) సమాధానమిచ్చారు : "అతడు ఏమి చేశాడు. ఒక్కడైన అల్లాహ్‌పై విశ్వాసం కలిగి ఉండటం నేరమా?"

ఉమయ్యా అన్నాడు : "ఇతడు నా బానిస. నాకు ఇష్టమైనట్లు అతనితో వ్యవహరించే స్వేచ్ఛ నాకుంది". మరలా అడిగారు బిలాల్‌ని తనకు అమ్మమని. చివరికి 5 దీనార్ల బంగారానికి అమ్మడానికి ఒప్పుకున్నాడు.

వ్యంగ్యంగా అబూబకర్(రజి) వారితో అన్నాడు : "**నీవు ఒక దీనార్ బంగారం ఇచ్చి ఉన్నా, నేను అతనిని నీకు అమ్మి ఉండేవాడిని**".

అబూబకర్(రజి) సమాధానమిచ్చారు : "**నీవు అతని కొరకు 100 దీనార్ల బంగారం అడిగి ఉన్నా, నేను చెల్లించి ఉండేవాడిని**".

అబూబకర్(రజి) బిలాల్(రజి) దగ్గరికి వెళ్ళి, అతని ఛాతీపై ఉన్న రాయిని తీసివేశారు. బిలాల్ మరియు అబూబకర్(రజి) ప్రవక్త(స)వారి దగ్గరకి వెళ్ళారు. అబూబకర్(రజి) వెంటనే బిలాల్‌కు స్వేచ్ఛను ప్రకటించారు.

ఇక ఆ రోజు నుండి బిలాల్(రజి) ఎవరికీ బానిస కాదు. ఆయన ఇక అల్లాహ్‌ను తాను కోరినట్లు ఆరాధించ గలడు. ఇస్లామీయ బోధనలను బానిసల విషయంలో ఆచరణలో చూపిన తొలి సంఘటన ఇది. అబూ బకర్(రజి) ఆయనను తన బానిసగా తన కంట్రోల్‌లో ఉంచుకోగలరు. కాని ఒక ముస్లిమ్ ఇతర మనుష్యుల విషయంలో ఎలా ప్రవర్తించాలో రాబోయే తరాలకు తెలియజేయడాన్నే ఆయన ఇష్టపడ్డారు.

బిలాల్(రజి) పేదవాడు అయినప్పటికీ ఆయనను ప్రవక్త(స)వారు ధనవంతులు మరియు శక్తిశీలుర మధ్య సమాన హోదాను కల్పించారు. మక్కా నుండి మదీనాకు ప్రవక్త(స)వారి ఆదేశాల ప్రకారం ఈయన కూడా హిజ్రత్ చేశారు (వలస వెళ్ళారు).

మదీనాలో ఇతర సహాబాలతో కలిసి మస్‌జిద్ నిర్మాణంలో పాల్గొన్నారు. ఈ మస్‌జిద్ ముస్లిముల తొలి మస్‌జిద్. ఈ తొలి మస్‌జిద్‌ను మదీనాలో తయారుచేసుకున్నాక సలాత్ (నమాజ్) సమయాన్ని ఏ విధంగా ప్రజలకు గుర్తు చేయాలి అనే విషయంపై అనుచరులు రకరకాల పద్ధతులను సూచించారు. కాని అవన్నీ కూడా ఇతర ధర్మాల వారి ఏదో ఒక పద్ధతిని పోలి ఉన్నాయి.

అబ్దుల్లా బిన్ జైద్(రజి) ప్రవక్త(స)వారి వద్దకు వచ్చి తన కల (dream) గురించి చెప్పారు. ఒక వ్యక్తి పచ్చరంగు దుస్తులలో ఓ గంటను నావైపుకు తీసుకు వస్తున్నాడు. నేను అతనిని ఆ గంట ఇవ్వమని, దానితో సలాత్ పిలుపు (అజాన్) కొరకు ఉపయోగిస్తానని చెప్పాను. ఆ వ్యక్తి ఓ ఉత్తమమైన విధానం తెలిపాడు. ఆయన ఈ విధంగా ప్రార్థనకు పిలవడం ఉత్తమమని చెప్పాడు:

**అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్**
*(అల్లాహ్ గొప్పవాడు)*
**అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్**
**అష్‌హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహ్**
*(ఆరాధ్యుడు లేడు అల్లాహ్ తప్ప అని నేను సాక్ష్యమిస్తున్నాను)*
**అష్‌హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహ్**
**అష్‌హదు అన్న ముహమ్మదర్ రసూలుల్లాహ్**
*(ముహమ్మద్(స) అల్లాహ్ యొక్క సందేశహరుడని నేను సాక్ష్యమిస్తున్నాను)*
**అష్‌హదు అన్న ముహమ్మదర్ రసూలుల్లాహ్**
**హయ్యా అలస్ సలా(త్) హయ్యా అలస్ సలా(త్)**
*(సలాత్(ప్రార్థన) వైపుకు రండి)*
**హయ్యా అలల్ ఫలాహ్ హయ్యా అలల్ ఫలాహ్**
*(మంచి ఫలితంవైపుకు రండి)*
**అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్**
*(అల్లాహ్ గొప్పవాడు)*
**లా ఇలాహ ఇల్లల్లాహ్**
*(లేడు ఆరాధ్యుడు అల్లాహ్ తప్ప)*

ప్రవక్త(స)వారు అబ్దుల్లా(రజి)వారి కలను సంతోషంగా విని చెప్పారు: "ఇన్నా అల్లాహ్, ఇది నిజమైన కల. బిలాల్! మస్‌జిద్ పైకి ఎక్కి ముస్లిమ్‌లను సలాత్ కొరకు పిలువు".

బిలాల్(రజి) తన సుమధుర కంఠస్వరంతో సలాత్ (నమాజ్) కొరకు చరిత్రలో మొట్టమొదటి పిలుపునిచ్చారు. ముస్లిములంతా నిశ్శబ్దంగా విన్నారు. అజాన్ విన్న వెంటనే ఉమర్(రజి) చాలా వేగంగా ప్రవక్త(స)వారి దగ్గరికి వచ్చి తనకు కూడా అటువంటి కలే వచ్చిందని చెప్పారు.

శుభాన్ని పంపినందుకు ప్రవక్త(స)వారు మరియు అనుచరులు అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలియజేసుకున్నారు.

ముస్లిమ్‌లకు **తొలి ఇమామ్** ముహమ్మద్(స)వారు మరియు **తొలి ముఅజ్జిన్** బిలాల్(రజి). ముస్లిములలో ఆయనకు అంత గొప్ప హోదాను ప్రవక్త(స) కల్పించారు.

బిలాల్(రజి) బద్ర్ యుద్ధంలో పాల్గొని ఎంతో ధైర్యంతో యుద్ధం చేశారు. బానిసగా బ్రతికిన కాలంలో లేని అమోఘమైన ధైర్యం నాడు యుద్ధ రంగంలో ఆయనకు వచ్చింది. ఆ యుద్ధంలో బిలాల్(రజి) తన మాజీ యజమాని ఉమయ్యా బిన్ ఖలఫ్ గురించి వెతుకుతున్నారు.

అతడు కనిపించాడు. బిలాల్(రజి) కత్తితో వేసిన ఒకే దెబ్బతో ఉమయ్యా బిన్ ఖలఫ్ నేల కొరిగాడు. వాని ముఖం నిండా రక్తం. ఆ శవాన్ని చూస్తూ బిలాల్ అన్నారు, "అల్లాహ్ ఒక్కడు, అల్లాహ్ ఒక్కడు".

**మక్కా విజయం :** తొమ్మిది సంవత్సరాల పాటు కష్టాలు మరియు త్యాగాల అనంతరం, ఇస్లామ్ మదీనా చుట్టుప్రక్కల చాలా భాగాలకు వ్యాపించింది. ముస్లిమ్‌లతో ఎన్నో యుద్ధాల అనంతరం, ఇస్లామ్‌ని ఆపలేమని మక్కా కాఫిర్లకు అర్థమైంది. వారు ప్రవక్త(స)వారితో 10 సంవత్సరాలపాటు యుద్ధం జరగకుండా ఉండేలా ఒడంబడిక చేసుకున్నారు. కాని ఆ ఒడంబడికను వారు ఉల్లంఘించారు.

ఇక యుద్ధం అనివార్యమైంది. ప్రవక్త(స)వారు 10వేల మంది సైన్యంతో మక్కాకు బయలుదేరారు. అందులో బిలాల్(రజి) కూడా ఉన్నారు. వారిలో మక్కానుండి కట్టుబట్టలతో తమ సమస్తాన్నీ వదులుకుని మదీనా వలస వెళ్లిపోయినవారూ ఉన్నారు.

మక్కాకు వెళ్ళేటప్పుడు, బిలాల్(రజి)వారికి ఓ కలవచ్చింది. హుబల్ విగ్రహ ముఖంపై రెండవసారి ఆయన ఉమ్మి వేస్తున్నట్లు. అయితే, ఈ సారి ఇది వేరేగా ఉంటుంది. ఈసారి ప్రజలు చూస్తుండగానే బహిరంగంగా ఆయన ఆ పని చేయవచ్చు. ముస్లిములంతా మక్కాలో శాంతియుతంగా ప్రవేశించారు. మక్కావాసులకు మాత్రం కదలడానికి గాని మాట్లాడటానికి గాని ధైర్యం లేదు. ముస్లిములు తలచుకుంటే మక్కావాసులపై ప్రతీకారం తీర్చుకోగలరు.

మక్కాకు చేరుకున్న మరుక్షణం, ముహమ్మద్(స)వారు బిలాల్(రజి) వారిని 'ఉస్మాన్ బిన్ తల్హా' దగ్గరకు వెళ్ళి కాబా మస్జిద్ తాళం చెవులను తీసుకురమ్మన్నారు. బిలాల్(రజి) తాళం చెవిని తీసుకుని వచ్చి ప్రవక్త(స) వారితో పాటు కాబా మస్జిద్‌లో ప్రవేశించారు. అందులోని విగ్రహాలను ధ్వంసం చేశారు.

ప్రవక్త(స)వారి ప్రక్కనే బిలాల్(రజి) నిలుచుని ఉన్నారు. అక్కడ మక్కా వాసులంతా ఆతృతతో మరియు భయంతో సమావేశమై ఉన్నారు. ప్రవక్త(స)వారు మక్కాలో ఉన్నప్పుడు వీరంతా ఆయనకు ఎన్నో బాధలు పెట్టారు. అందుకు ప్రతీకారంగా ముహమ్మద్(స)వారు ఏదైనా చర్య తీసుకుంటారేమోననే భయంతో ఉన్నారు. వారందరికి ముహమ్మద్(స) వారి దయాగుణం మరియు మహోన్నత వ్యక్తిత్వం గురించి బాగా తెలుసు. వారి భయాన్ని పారద్రోలుతూ ముహమ్మద్(స) ఇలా చెప్పారు:

"వెళ్ళండి, మీరు స్వేచ్ఛ గావించబడ్డారు! మీరంతా ఆదమ్(అ)వారి సంతానం. హక్కులు మరియు బాధ్యతలలో సమానమే".

ఇటువంటి దయతో కూడిన పలుకులు ఖురైష్ నాయకులను ఇస్లామ్ స్వీకరించేలా చేశాయి.

బహుదైవారాధకులపై సాధించిన ఈ మక్కా విజయం రోజున, ముహమ్మద్(స)వారు బిలాల్(రజి)ను కాబా పైకి ఎక్కి అజాన్ (సలాత్ కొరకు పిలుపు) ఇవ్వమన్నారు.

మొత్తం పట్టణమంతా ఏక దైవత్వానికి చెందిన ఆ సుమధుర మాటలను విన్నది.

కొంతమంది మక్కావాసులకు అప్పటికి ఇంకనూ ఇస్లామ్‌పై ద్వేషముంది. ఒకప్పుడు బానిసగా ఉన్న ఓ నల్లజాతీయుడు అతి పవిత్రంగా భావించే 'కాబా'పై నిలుచోవడాన్ని వారు జీర్ణించు కోలేక పోయారు.

బిలాల్(రజి) ధర్మపరాయణుడు, అణుకువ మరియు ఋజు ప్రవర్తన కలిగిన వారు. ప్రవక్త(స)వారు అంటే ఆయనకు ఎంతో అభిమానం. ఇస్లామ్ విజయం కోసం ముహమ్మద్(స)వారు పాల్గొన్న యుద్ధాలలో ఆయనతో పాటు బిలాల్(రజి) ఉన్నారు.

ప్రవక్త(స)వారు తన చివరి హజ్జ్ యాత్రలో ఇస్లామీయ సందేశం సంపూర్ణం అయిందని విన్నారు. తనకంటే మరియు అన్నిటికంటే ఎక్కువగా ప్రేమించిన ముహమ్మద్(స)వారు దూరం కాబోతున్నారని అర్థమై బిలాల్(రజి) శరీరం వణికింది.

మదీనాకు తిరిగి వచ్చాక ప్రవక్త(స)వారు జబ్బుపడ్డారు. నీళ్ళు నిండిన కళ్ళతో బిలాల్(రజి) ముహమ్మద్(స)వారి ముఖంలోకి చూస్తూ నెమ్మదిగా అన్నారు : **'నేను మీ దగ్గరకు రావచ్చా'**. ప్రవక్త(స)వారు చిరునవ్వు నవ్వి బిలాల్(రజి)వారిని కౌగలించుకున్నారు.

కొన్ని రోజుల తరువాత ముహ్మద్(స)వారు ఈ లోకాన్ని వీడారు. అబూ బకర్(రజి)వారు ఖలీఫాగా ఎన్నికయ్యారు. సలాత్(నమాజ్) వేళ అయింది. ముస్లిములందరూ బిలాల్(రజి) ఇచ్చే అజాన్ కోసం ఎదురు చూస్తున్నారు. కాని బిలాల్(రజి) అజాన్ ఇవ్వలేదు. ముహమ్మద్(స)వారు జీవించి ఉన్నంత కాలమే ఆయన అజాన్ ఇచ్చారు.

బిలాల్(రజి) అల్లాహ్ మార్గంలో పోరాడటానికే ఇష్టపడ్డారు. కాని అబూబకర్(రజి)వారు బిలాల్(రజి)వారిని తనతో మదీనాలో ఉండమని ముఅజ్జిన్‌గా కొనసాగమని కోరారు. అయితే ఆయన మదీనాలో ఉండటానికైతే ఒప్పుకున్నారుగాని ముఅజ్జిన్‌గా ఉండటానికి మాత్రం ఒప్పుకోలేదు.

అబూ బకర్(రజి) మరణం తరువాత, రెండవ ఖలీఫా ఉమర్(రజి) కూడా బిలాల్(రజి)ను అదే విధంగా కోరారు. ఉమర్(రజి)వారు కూడా బిలాల్(రజి)వారికి ప్రవక్త(స)వారి కాలంలో, అబూబకర్(రజి)కాలంలో ఉండే ఉన్నత హోదానే ఆయనకు ఇచ్చారు. చివరికి బిలాల్(రజి) బలవంతం చేయడంతో అల్లాహ్ మార్గంలో పోరాడటానికి ఉమర్(రజి) అనుమతి నిచ్చారు.

బిలాల్(రజి) సిరియా వెళ్ళారు. ఆయన ఎన్నో యుద్ధాలలో పాల్గొన్నారు.

ఉమర్(రజి)వారు జెరూసలెంలో నివశిస్తున్న క్రైస్తవులతో ఓ ఒడంబడిక విషయమై వచ్చారు. సలాత్ సమయం అయింది. బిలాల్(రజి)ని ఉమర్(రజి) అజాన్ ఇవ్వమని కోరారు. "ఓ అమీరుల్ మోమినీన్! ప్రవక్త(స)వారి మరణం తరువాత, 'అజాన్' ఇక ఇవ్వకూడదని నిర్ణయించుకున్నాను. ఈ రోజు వరకూ ఆ నిర్ణయానికే కట్టుబడి ఉన్నాను. కాని నేడు మీ కోరికను కాదనను". బిలాల్(రజి) వెంటనే అల్-అఖ్సా మస్జిద్ మెట్లు ఎక్కి అజాన్ ఇచ్చారు.

బిలాల్(రజి) ఇచ్చిన అజాన్ ప్రజలంతా విన్నారు. ఎంతోకాలం పాటు ఆ కంఠ స్వరం వారు వినలేదు. బిలాల్(రజి) ముహమ్మద్(స)వారి కాలాన్ని గుర్తు చేసుకుని విలపించారు.

ప్రవక్త(స)వారి అనుచరులు కూడా ఆయనతో పాటు శోకించారు. ఉమర్(రజి), అబూ ఉబైదా(రజి) మరియు ముఆజ్ బిన్ జబల్(రజి) చిన్న పిల్లల్లా విలపించారు.

ప్రారంభంలో ముస్లిములు బలహీనంగా, పేదవారిగా ఉన్నప్పుడు వారు ఊహించలేదు, జెరూసలెం భూభాగంలో ఏదో ఒకరోజు అజాన్

ఇవ్వబడుతుందని. అటువంటి సంతోష సమయంలో వారి కళ్ళల్లో కన్నీరు.

సిరియాలో యుద్ధ పరంపర విజయవంతంగా పూర్తయింది. సిరియాలోనే స్థిరపడ్డారు. ఒక రాత్రి కలలో ప్రవక్త(స)వారు కనబడి 'ఓ బిలాల్! ఇదేమిటి ఇన్ని సంవత్సరాలుగా నన్ను చూడటానికి రాలేదు?'' అన్నారు.

ఆ కల వచ్చిన తరువాత ఆయనకు నిలకడ లేకుండా పోయింది. ఉదయం కాగానే మదీనా బయలుదేరారు. ప్రవక్త(స)వారి సమాధి దగ్గర రోదించారు. తరువాత చూస్తే ఆయనకు సమీపంలో హసన్(రజి) మరియు హుస్సేన్(రజి) నిలబడి ఉన్నారు. వారిద్దరినీ పట్టుకుని గట్టిగా కౌగలించుకుని విలపించారు. ముహమ్మద్(స)వారికి ఎంతో ప్రియమైన ఆ ఇద్దరు మనవళ్ళు బిలాల్(రజి)వారిని తరువాయి రోజు ఉదయం అజాన్ ఇవ్వమని అడిగారు. ప్రవక్త(స)వారి మనవళ్ళ మాటను తిరస్కరించలేక ఫజర్ నమాజ్ కొరకు మస్జిద్ పైకప్పు ఎక్కి తన సుమధుర కంఠధ్వనితో అజాన్ ఇచ్చారు. అంతే! మక్కా ప్రజలకు ప్రవక్త(స) వారి రోజులు గుర్తుకు వచ్చాయి. అందరూ తమ ఇళ్ళ పైకప్పులు ఎక్కి వీనుల విందైన ఆ ఆజాన్‌ని విన్నారు.

ఆ సంఘటనను ఎంతోకాలం పాటు వారు మర్చిపోలేదు.

మక్కా నుండి మదీనాకు వలస వెళ్ళిన ప్రవక్త(స)వారి అనుచరులలో పెళ్ళికాని వ్యక్తి బిలాల్(రజి) మాత్రమే. బిలాల్(రజి) వారికి వివాహం చేసుకోవాలని ఉంది. తనతో వారి కుమార్తెను వివాహం చేయడానికి ఎవరు ఇష్టపడతారు? ఆయన తన కోరికను వెలిబుచ్చడానికే సిగ్గుపడ్డారు. కాని ఆశ్చర్యపోవడం ఆయన వంతు అయింది. అతని కోరిక తెలిశాక, కేవలం ఏ ఒక్క కుటుంబమో కాదు. ముహాజిరీన్‌లు, అన్సారులు తమ కూతురునిచ్చి వివాహం చేయడానికి ముందుకొచ్చారు. అతనితో సంబంధమేర్పరచుకోవడం తమకు గర్వకారణంగా భావించారు.

ప్రతి ఒక్కరూ సిద్ధమయ్యారంటే ఎవరీ అదృష్టవంతుడు?

ఇతనేమైనా ఐశ్వర్యవంతుడా? కాదు.

ఉన్నత తెగకు చెందిన శక్తిశీలురలోని వాడా? కాదు.

గొప్ప ధృడమైన శరీరం ఉన్న సౌందర్యవంతుడా? కాదు.

కేవలం పొడుగ్గా, సన్నగా ఉండి అబూబకర్(రజి)వారి ద్వారా బానిస విమోచన కలిగిన ఓ స్వేచ్ఛా జీవి అంతే! కాని అతని హృదయం మాత్రం బంగారం.

దళితుడిని ముఖ్యమంత్రి చేస్తాము. అణగారిన వారికి పైకి తీసుకొస్తాం అంటూ ప్రకటనలు ఇచ్చేవారెందరో! కాని వారి మనస్సులో అణగారినవారిపై అభిమానం ఉండదు. కేవలం అధికార దాహం. అవి ఎప్పటికీ మాటలే. ఆచరణలో పనికి రావు.

కాని 1400 సంవత్సరాల క్రితం ఓ అత్యంత దిగువ స్థాయి వ్యక్తిని దైవ భీతి ప్రాతిపదికన ఎంత ఉత్తమ స్థాయికి ఇస్లామ్ తీసుకెళ్ళిందో చూడండి.

ఉమర్(రజి) ఖలీఫాగా ఉన్న కాలంలో బిలాల్(రజి) ఉమర్(రజి)ని కలవడానికి వచ్చారు. ఈయనే కాకుండా కొందరు ఖురైష్ నాయకులు కూడా లోపలికి ప్రవేశించడానికై అనుమతి కోసం ఎదురు చూస్తున్నారు. కాని బిలాల్(రజి)కే ముందు అనుమతి నిచ్చారు.

సిరియాలో బిలాల్(రజి) రెండవ వివాహం చేసుకోవలసి వచ్చింది. ఓ అరబ్ మహిళను వివాహం చేసుకోవడానికి అడిగారు. ఆమె కుటుంబానికి తను నీగ్రోనని, ఒకప్పుడు బానిసనని, బానిస కుమారుడని, ఏ ఐశ్వర్యం లేనివాడినని తెలియజేశారు. ఆయన కోరికను వెంటనే ఆమోదించి ఆయన కోరిన అమ్మాయినిచ్చి వివాహం జరిపారు.

బిలాల్(రజి) సోదరులలో ఒకరు కూడా ఓ అరబ్బు మహిళను చేసుకోదలిచారు. ఆ కుటుంబం నుండి వచ్చిన సమాధాన మేమిటంటే, "బిలాల్(రజి) వచ్చి నీవు నిజంగా అతని సోదరుడని ధృవీకరిస్తే, మేము నీకు మా అమ్మాయి నిచ్చి వివాహం జరుపుతాము''. బిలాల్(రజి) వారి దగ్గరకెళ్ళి చెప్పారు, ''గౌరవనీయులారా! నేను బిలాల్‌ని. రబా కుమారున్ని. ఇతడు నా సోదరుడు. ఇతడు ధర్మ పరాయణుడు. మీకు ఇతను నచ్చితే, మీ అమ్మాయినిచ్చి వివాహం చేయగలరు లేక ఇతని విన్నపాన్ని మీరు తిరస్కరించవచ్చు''. "బిలాల్! నీ సోదరుడైన వ్యక్తికి మా అమ్మాయినిచ్చి వివాహం చేయడం మాకు ఎంతో గౌరవం!''.

ఆయన ధర్మపరాయణత మరియు మచ్చలేని నిజాయితీ ఎందరో హృదయాలలో గొప్ప స్థానాన్ని పొందింది. అయినప్పటికీ ఎల్లప్పుడూ ఆయన చాలా అణుకువగా ఉండేవారు. ఎవరైనా ఆయనని పొగిడితే, తాను ఒక నీగ్రోని ఒకప్పుడు బానిసనని చెప్పుకునేవారు.

హిజ్రీ 20వ సంవత్సరంలో ఆయన మరణించారు. డమాస్కస్‌లోనే ఆయనను సమాధి గావించారు.

**బిలాల్(రజి)వారి గురించి చెప్పడానికి ఎన్నో విషయాలున్నాయి. కాని క్లుప్తంగా చెప్పిన ఈ విషయాలు కేవలం ఓ పరిష్కార మార్గంగా నేటి నవముస్లిములకు తెలియజేయడానికే!**

ఇథియోపియా (ఆఫ్రికా) నీగ్రో జాతికి చెందిన ఓ బాలుడు ఒకరికి బానిసయ్యాడు. సంతోషంగా గడపవలసిన బాల్యంలో తల్లిదండ్రుల ప్రేమానురాగాలకు దూరమై ఓ యజమాని కుటుంబం కొరకు గొడ్డులా కష్టపడ్డాడు. 'అల్లాహ్ ఒక్కడే ఆరాధనకు అర్హుడు' అనే వాస్తవం తెలుసుకుని ముస్లిమ్ అయినందుకు ఆయన ఎన్ని హింసలకు గురయ్యారో చదివారు కదా! ఈ నవముస్లిమ్‌కి వచ్చినంత కష్టాన్ని మించి ఎక్కువ కష్టం నేటి నవముస్లిములు ఎవరైనా అనుభవించారా? ప్రవక్త(స)వారు గాని, అబూబకర్(రజి)వారు గాని తనను పట్టించుకోవడం లేదనిగాని లేదా వారికి తనపై జరుగుచున్న హింస గురించి కబురు పంపడంగాని చేసారా?

మెడకు తాడు కట్టి వీధుల్లో ఈడ్చుకు పోతుంటే పిల్లలు రాళ్ళు రువ్వుతూ తిడుతూ ఉంటే మన సోదరుడు బిలాల్ మనస్సుకు ఎంతబాధ

కలిగి ఉంటుందో ఓసారి ఆలోచించండి. ఇటువంటి హింస జంతువులకు కూడా పెట్టరు. ఎన్ని హింసలకు గురైనా సరే ఆయన 'అల్లాహ్ ఒక్కడు' అనే చెప్పారు.

అల్పులమైన మనవంటి వారికే కళ్ళవెంట నీరు వస్తుంటే, మన యజమాని "అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్" తన దాసునిపై జరుగుతున్న హింసకు ఏ విధంగా ప్రతి స్పందించారో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇస్లామ్ చరిత్రలో ఆయనను "తొలి ముఅజ్జిన్"ను చేశారు. అరబ్బులు అతి పవిత్రంగా భావించే 'కాబా' మస్జిద్ పైన నిలుచుని 'అజాన్' ఇచ్చేలా చేశారు.

సుమధురమైన కంఠస్వరాన్ని ఇచ్చారు. ఆయన నలుపు కావచ్చు. ఆయన పలుకులు ఉన్నత వంశానికి చెందిన వారి పలుకుల కంటే అందమైనవి. ఆయన హృదయం అల్లాహ్‌పై ఉండే విశ్వాసంతో అత్యంత సుందరంగా మారిపోయింది. పెళ్లి చేసుకోవాలనే కోరికను వెలిబుచ్చ డానికి, తన బాహ్య రూపాన్ని చూసి పిల్లనివ్వరని అనుమానపడ్డారు. కాని ఆయన బాహ్య సౌందర్యాన్ని కాకుండా, అతని విశ్వాస సౌందర్యాన్నే ప్రజలకు అల్లాహ్ చూపించారు. ఆయనను అల్లున్ని చేసుకోవడానికి ఉన్నత వంశస్థులు పోటీపడ్డారు.

ఓర్పు, సహనం, అల్లాహ్‌పై అమోఘమైన విశ్వాసం, ప్రవక్త(స)వారిపై చెప్పలేనంత ప్రేమ. ఇవి సామాన్య విషయాలా? కొంతమంది అనుకుంటారు : "అల్లాహ్ ఎందుకు నన్ను నల్లగా పుట్టించారు. నాకు ఎందుకు అందం ఇవ్వలేదు". అల్లాహ్ ఎవరికీ అన్యాయం చెయ్యరు. అందమైన వారిలో లేని ఓ గొప్ప సుగుణం మీకు ఇచ్చి ఉంటారు.

బిలాల్(రజి)వారి గురించి తెలుసుకున్నారు కదా! మీరు బ్యూటీ పార్లర్స్‌కు వెళ్ళి మీ అందాన్ని పెంచుకోవడానికి ఇక ప్రయత్నం చేయవలసిన అవసరం లేదు. మీ ఆత్మ సౌందర్యాన్ని పెంచుకోండి! మిమ్మల్ని తమ ఇంటివారిగా చేసుకోవడానికి ఎందరో పోటీ పడతారు.

మీరు ఎంత క్రింది స్థాయిలో ఉన్నాసరే, అల్లాహ్‌పై విశ్వాసం మిమ్మల్ని అత్యున్నత స్థాయికి తీసుకు వెళుతుంది. మీ పిరికితనం పోయి ఆ స్థానంలో ధైర్యం వస్తుంది. కష్టాలను చూసి మీకు భయం కలగదు. కష్టాలే మీ విశ్వాసం ముందు ఓడిపోతాయి.

కాబట్టి నవముస్లిమ్ సోదరసోదరీమణులను మేము కోరేది ఏమిటంటే, మీరు నిస్సహాయంగా ఏకాకి అయిపోయామని ఏనాడూ విచారించకండి. మీతో అల్లాహ్ ఉన్నాడు. అల్లాహ్ పెట్టే పరీక్షలకు సంతోషంగా సిద్ధం కండి. మీరు మోయలేని భారాన్ని ఆయన మీపై మోపడు. ఆయన పెట్టే పరీక్షలో మీరు నెగ్గుకు రావడానికి తిరిగి మీకు సహాయం చేసేది కూడా ఆయనే! ఓర్పు వహించండి. సహనాన్ని అలవరచుకోండి.

మీకు ఎటువంటి సందేహాలున్నా ముందుగా మీ ఊరిలో మిమ్మల్ని ఆదరించే ఏదైనా ఓ మస్జిద్ ఇమామ్‌గారిని అడగండి. విడిగా ఉ ండవద్దు. జమియత్‌తో కలిసి ఉండండి.

**(మరొక సమస్యకు పరిష్కార మార్గం ఇన్షా అల్లాహ్ వచ్చే సంచికలో ....)**

## ఇన్నాలిల్లాహి వ ఇన్నాఇలైహి రాజిఊన్

వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యులు మరియు మా శ్రేయోభిలాషి **సులైమాన్ (తోట వెంకటరావు)** గారు జనవరి 22వ తేదీన ఈ లోకాన్ని వీడారు. ఆయన వయస్సు 61 సం॥లు. ఐదు సంవత్సరాల క్రితం ఇస్లామ్ స్వీకరించి, రెగ్యులర్‌గా మస్జిద్‌కు రావడమే కాకుండా, ప్రతీ నెల శాంతిబాట కాపీలను మస్జిద్ నుండి పోస్ట్ చేసే సమయంలో, రాత్రుళ్ళు మాతోనే మస్జిద్‌లో ఉండి తన శక్తిమేర సహకరించేవారు.

ఈయన ఇస్లామ్ స్వీకరించక పూర్వం 27 సంవత్సరాలపాటు అయ్యప్ప మాల వేసుకుని శబరిమళకు ప్రతీ సంవత్సరం వెళు తుండేవారు. సులైమాన్ గారికి ఇద్దరు కుమార్తెలు మరియు ఇద్దరు కుమారులు. ఈ ఇద్దరు కుమారులు కూడా వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యులే. పెద్ద కుమారుడు జాకిర్ (తోట శ్రీనివాసరావు) సొసైటీకు జాయింట్ సెక్రటరీ మరియు శాంతిబాట మాసపత్రిక పొడక్షన్ ఇన్‌ఛార్జ్. రెండవ కుమారుని పేరు సాబిర్. ముందుగా కుమారులు ఇస్లామ్ స్వీకరించారు. వారు స్వీకరించిన ఒక సంవత్సరం తరువాత, వెంకటరావు గారు కూడా ఇస్లామ్ స్వీకరించి సులైమాన్‌గా పేరు మార్చుకున్నారు. మా అందరితో చాలా స్నేహంగా ఉండేవారు.

ఈ కుటుంబాలే కాకుండా, వీరి బంధువులలో మరో రెండు కుటుంబాలవారు కూడా ఇస్లామ్ స్వీకరించారు. కేవలం స్వీకరించడం కాకుండా, తెలుసుకున్న ప్రతీ ధార్మిక విషయాన్ని ఆచరణలో పెట్టేవారు. చివరిగా ఆయన స్పృహలో ఉన్నప్పుడు అల్లాహ్ మీదే భారమంతా అని చెప్పారు.

నవముస్లిములను ఆదరించడంలో సామర్లకోట ముస్లిములు ఎల్లప్పుడూ ముందే ఉంటారు. వారి అభిమానం అటువంటిది. జనాజా నమాజ్‌కి అందరూ హాజరయ్యారు. కార్యక్రమం అంతా దగ్గరుండి జరిపారు.

55 సంవత్సరాలపాటు షిర్క్‌లో జీవించిన మన సోదరున్ని, అల్లాహ్ అనుగ్రహించి చివరి దశలో ముస్లిమ్‌గా మార్చి, ముస్లిమ్‌గా జీవనం సాగిస్తున్నప్పుడే మరణాన్నిచ్చారు. అల్లాహ్ అనంత కరుణా మయుడు, అపార కృపాశీలుడు. మన సోదరుడు సులైమాన్ గారికి అల్లాహ్ పరలోకంలో మంచి ప్రతిఫలాన్ని అనుగ్రహించమని వేడుకుంటున్నాము. (ఆమీన్)

**- శాంతిబాట టీమ్**

జీవిత చరిత్ర

# ముహమ్మద్

సల్లల్లాహు అలైహి వసల్లమ్ (అల్లాహ్ నుండి మీపై శుభాశీస్సులు మరియు శాంతి కలుగుగాక!)

## సకల లోకాలకు కారుణ్యం (రహమతల్లిల్ ఆలమీన్)

5

**(గత సంచిక తరువాయి ...)**

అనీస్ అబ్రహా దగ్గరకు వెళ్ళి చెప్పాడు, "ఓ రాజా! ఇతడు ఖురైషీయుల నాయకుడు మరియు మక్కా వర్తక బిడారానికి యజమాని. ఆ వర్తకమే మైదానంలో నివశించే ప్రజలకు, కొండలలోని పశువులకు పోషణ. అతను మిమ్మల్ని కలవడానికి మీ అనుమతిని కోరుతున్నారు. మరియు మీరు ఆయనకు అనుమతినిస్తారని ఆశిస్తున్నాను'. అబ్దుల్ ముత్తలిబ్ లోపలికి ప్రవేశించడానికి అబ్రహా అనుమతి నిచ్చాడు.

అబ్దుల్ ముత్తలిబ్ ధృడంగా, ఎత్తుగా, అందమైన ముఖ వర్చస్సుతో ఉండేవారు. అబ్రహా ఆయనను చూడగానే స్వాగతించి గౌరవించారు. తన మంచంపై అబ్దుల్ ముత్తలిబ్‌ను కూర్చోబెట్టుకోవడానికిగాని లేదా ఆయనను క్రింద కూర్చోమని చెప్పడానికిగాని అబ్రహా మనసొప్పలేదు. అందువలన మంచం దిగువున ఉన్న తివాచీ పైకి దిగి, క్రిందనే అబ్దుల్ ముత్తలిబ్ ప్రక్కన కూర్చున్నాడు.

"ఓ రాజా!" అన్నారు అబ్దుల్ ముత్తలిబ్, "మీరు నానుండి పెద్ద మొత్తంలో ఐశ్వర్యాన్ని తీసుకున్నారు. కాబట్టి దానిని నాకు తిరిగి ఇచ్చేయండి".

"నిజానికి నిన్ను చూసినప్పుడు నీవు నన్ను చాలా ప్రభావితం చేశావు. కాని నేను (ఆ మెచ్చుకోలును) వెనక్కి తీసేసుకుంటున్నాను" అన్నాడు అబ్రహా.

"ఎందుకని?" అడిగారు అబ్దుల్ ముత్తలిబ్.

"నేను మీ (కాబా) గృహం దగ్గరకు వచ్చాను. అది మీ మతం మరియు అది మీ పూర్వీకుల మతం మరియు మీకు శాంతి నిలయం, రక్షణ. దానిని విధ్వంసం చేయడానికి వచ్చాను. మీరు దాని గురించి మాట్లాడకుండా, మీరు నాతో (కేవలం)మీకు చెందిన 200 ఒంటెల గురించే మాట్లాడుతున్నారు".

"నేను ఈ ఒంటెలకు యజమానిని" చెప్పారు అబ్దుల్ ముత్తలిబ్. "ఈ (కాబా) గృహానికి యజమాని ఉన్నాడు. ఆయనే దానిని కాపాడుకుంటారు".

"ఆయన దానిని నా నుండి కాపాడుకోలేడు" అన్నాడు అబ్రహా.

"అయితే అది మీ వ్యవహారం" చెప్పారు అబ్దుల్ ముత్తలిబ్.

అబ్రహా ఇచ్చిన ఆదేశం మేరకు ఆయన ఒంటెలు వెంటనే ఆయనకు తిరిగి ఇచ్చి వేయబడ్డాయి.

అబ్దుల్ ముత్తలిబ్‌తో పాటు ఇతర అరబ్ తెగల నాయకులు కూడా ఉన్నారు. అబ్రహా కాబా విషయం వదిలేసి వెళ్లిపోతే ప్రతీ సంవత్సరం తమ పంటలో 3వ భాగాన్ని ఇస్తామని తిహామా తెగవారు ప్రకటించారు. కాని అబ్రహా దానిని తిరస్కరించాడు.

అబ్దుల్ ముత్తలిబ్ ఖురైషీయుల దగ్గరికి వచ్చి ఏమి జరిగిందో తెలియజేశారు. మరియు మక్కా పర్వత మార్గాలలో తలదాచు కోవడానికి వారిని ఆదేశించారు.

కాబా ద్వారానికి ఓ లోహపు రింగు ఉండేది. అబ్దుల్ ముత్తలిబ్ ఆ రింగును పట్టుకుని అబ్రహా మరియు అతని సైన్యంపై విజయాన్ని ఇవ్వమని అల్లాహ్‌ను వేడుకున్నారు.

కాబా ద్వారానికి ఉన్న ఆ రింగుకు వేలాడుతూ అబ్దుల్ ముత్తలిబ్ ఇలా అన్నారు :"**ప్రస్తుతం ఎవరికైనా తన పశువులను మరియు సంపదను రక్షించుకోవడం కంటే ఏ విషయమూ ఎక్కువ ముఖ్యమైనది కాదు. ఓ నా ప్రభూ! నీ సంపదను నీవే రక్షించుకో. (రేపు)ఉదయించే వేళకి వారి శిలువ మరియు వారి యుక్తులు నీ యుక్తులపై విజయం సాధించలేవు.**"

ఇబ్నె ఇస్‌హాక్ వారి ప్రకారం, అబ్దుల్ ముత్తలిబ్ కాబా ద్వారానికున్న లోహపు రింగును వదిలి, కొండపైకి అదిరోహణ చేశారు. మఖాతిల్ బిన్ సులైమాన్ చెప్పినదానిని బట్టి వారు 100 ఒంటెలను 'కాబా'కు దగ్గరలో కట్టి ఉంచారు. సైన్యంలోని కొందరు ఆ ఒంటెలపై వారికి హక్కులేకపోయినా సరే వాటిలో కొన్నింటిని తీసుకుంటారనే ఉద్దేశ్యంతోనే కట్టి ఉంచారు. అంటే వారికి హక్కులేని వాటిని తీసుకుంటే, అల్లాహ్ యొక్క ఆగ్రహం వారిపై పడుతుందనేది ఆ అరబ్బుల నమ్మకం.

అల్-మఘ్మాస్ ప్రదేశం నుండి మక్కాలోకి ప్రవేశించడానికి అబ్రహా నిశ్చయించుకున్నాడు. అతను తన సైన్యానికి సామాగ్రిని తిరిగి

ఎత్తుకోమని ఆదేశించాడు. అబ్రహా దగ్గరకు అతని ఏనుగు తీసుకు రాబడింది. అది తన నాలుగు కాళ్ళపై నిలుచుండగానే దానిపై సామాగ్రిని ఎక్కించారు.

వారంతా మక్కావైపు వెళ్ళడానికి సిద్ధమయ్యారు. ఏనుగు ముందుకు కవాతు చేయడానికి మావటి దానిని అంకుశంతో పొడిచాడు. కాని అది కదలకుండా నిలుచుంది. అది దాదాపు ఓ మూటలాగ నేలపై కూర్చుండి పోయింది. వారు దాని తలపై పలుగుతో కొట్టారు. కాని అది ఒక అంగుళం కూడా ముందుకు కదలడానికి తిరస్కరించింది. దానిని కదిలించడానికి తిరిగివారు ప్రయత్నించారు. కాని అది అక్కడే కదలకుండా నిలుచుంది.

వారు దాని దిశను వెనక్కి యమన్‌వైపు మరల్చారు. అది ఆ దిశలో పరుగులు తీసింది. ఏ దిశవైపుకు తిప్పినా అది వేగంగానే కదిలింది. కాని ఆలస్యం చేయకుండా దానిని మక్కా వైపుకు తిప్పితే, తిరగి అది ఆగిపోయేది. తరువాత ఆ ఏనుగు ఆ ప్రాంతంలోని ఓ పర్వతం వైపు దారి చేసుకుని పారిపోయింది.

సైన్యం కొరకు అల్లాహ్ సముద్రం వైపు నుండి చిన్న పక్షులను పంపాడు. ప్రతీ పక్షితో మూడు రాళ్ళున్నాయి. రెండు రాళ్ళు వాటి కాళ్ళలోనూ మరియు ఒకటి వాటి ముక్కులో. అవి మోసుకెళ్ళే రాళ్ళు సెనగ గింజంత లేదా చిక్కుడు గింజంత ఉన్నాయి. ఆ పక్షులు సైన్యంపై ఎగురుతున్నప్పుడు, అవి వారిపై క్రిందికి రాళ్ళను విసిరేవి. సైన్యంలో ఏ వ్యక్తికైనా ఆ రాయి తగిలితే, అతడు చనిపోయేవాడు. కాని సైన్యంలోని అందరికీ తగలలేదు. అల్లాహ్ సూరహ్ ఫీల్‌లో ఇలా చెప్పారు :

> ''ఏమీ? ఏనుగు వారి (సైన్యం)తో నీ ప్రభువు ఎలా వ్యవహరించాడో నీవు చూడలేదా? ఏమీ? ఆయన వారి కుట్రను భంగం చేయలేదా? మరియు ఆయన వారిపైకి పక్షుల గుంపులను పంపాడు. అవి (ఆ పక్షులు) వారి మీద మట్టితో చేసి కాల్చిన కంకర రాళ్ళను (సిజ్జీల్) విసురుతూ పోయాయి. ఆ విధంగా ఆయన వారిని (పశువులు) తినివేసిన పొట్టుగా మార్చివేశాడు.'' **(ఖుర్'ఆన్ 105:1-5)**

తఫ్సీర్ గ్రంథాలలో ఇంకనూ ఈ సంఘటనపై చాలా విషయా లున్నాయి. ఆ పక్షుల గుంపు గురించి, ఆ రాళ్ళ గురించి చాలా విషయాలు చర్చించారు.

ఉబైద్ బిన్ ఉమైర్ పక్షులు రాళ్ళు వదలడాన్ని వర్ణించారు. అవన్నీ సైనికుల తలలపై బారులు తీరేవరకూ వస్తూనే ఉన్నాయి. అవి చాలా పెద్దగా అరిచి తమ ముక్కులలో మరియు కాళ్ళలో ఉన్న రాళ్ళను విసిరాయి. వారి తలపై రాయి పడగానే అది అతనిలో నుండి దూసుకుపోయేది రివాల్వర్ నుండి బుల్లెట్ దూసుకుపోయినట్లు.

అబ్రహా శరీరంపై అల్లాహ్ ఓ రోగాన్ని దింపారు. అతని సైనికులు యమన్‌వైపు పరుగెట్టారు మరియు (వారి శరీర భాగాలు వారు ప్రయాణించే) ప్రతీ భూభాగంలో పడిపోయాయి. ప్రతీ వ్రేలి కొన (ఫింగర్ టిప్) పడిపోగానే దాని నుండి చీము మరియు రక్తం స్రవించేది.

వారు భయకంపితులై పారిపోతూ రోడ్డుపై కనిపించే వారిని నుఫైల్ ఎక్కడున్నాడని అడిగేవారు. ఎందుకంటే అతను వీరికి గైడ్ కాబట్టి, వారి దేశానికి దారి చూపుతాడని. కాని నుఫైల్ పర్వత శిఖరంపై ఖురేషీయులతో మరియు హిజాజ్ అరబ్బులతో ఉన్నాడు. అల్లాహ్ యొక్క ఆగ్రహం ఏనుగు ప్రజలపై విరుచుకు పడుతుందో గమనించడానికి.

నుఫైల్ చెప్పడం ప్రారంభించారు ''వారు ఎక్కడికి పారిపోతారు ఒక్కడైన నిజమైన ఆరాధ్యుడే వారిని తరిమే వాడయినప్పుడు? అల్-అష్రమ్ ఓడిపోయింది మరియు విజయం లేదు''.

ఈ సందర్భంగా నుఫైల్ చెప్పిన కవిత్వాన్ని ఇబ్నె ఇస్‌హాక్ తెలియ జేశారు. దానిలో ఓ వాక్యాన్ని పాఠకుల కొరకు ఇక్కడ అందిస్తున్నాము. **"నేను పక్షులను చూడగానే అల్లాహ్‌ను కీర్తించాను మరియు ఆ రాళ్ళు క్రిందికి మాపై విసరబడతాయేమోనని భయపడ్డాను. నుఫైల్ ఎక్కడున్నాడని అందరూ అడుగుతున్నారు, నేను ఏదో వారికి బాకీ ఉన్నట్లు".**

అతా బిన్ యసార్ మరియు ఇతరులు చెప్పినదానిని బట్టి, ఆ సైన్యంలోని కొందరు వెంటనే నాశనమై పోయారు, మిగతావారు తప్పించు కుంటుండగనే వారి శరీరాలలో నుండి ఒక అవయవం తరువాత మరో అవయవం క్రమక్రమంగా ఊడిపోయాయి. అబ్రహా శరీరం నుండి కూడా ఒక అవయవం తరువాత మరో అవయవం ఊడిపోతూ, చివరికి అతడు ఖతామ్ భూభాగంలో చనిపోయాడు.

అతని ఒక అవయవం తరువాత మరో అవయవం రాలిపోతుండగా సైన్యం 'అబ్రహా'ని 'సనా' పట్టణానికి తీసుకువెళ్ళారు. అతని ఛాతీ నుండి గుండె బయటపడిపోయే వరకూ అతను చనిపోలేదు.

సైనికులు సర్వనాశన మయ్యారు. మక్కా నుండి ఎవరైనా తప్పించుకుని తమ భూభాగానికి వెళ్ళారంటే అది కేవలం తమ గాయాల సంగతి తమ వారికి చెప్పుకోవడానికే!

**అబ్రహా సనా భూభాగానికి చేరాక, అతని ఛాతీ చీలిపోయి గుండె బయటపడటం ద్వారా అల్లాహ్ ఆగ్రహం అక్కడి ప్రజలకు చాలా స్పష్టంగా అర్థమైంది.**

అబ్రహా సైన్యంలోని ఏనుగులను నడిపే ఇద్దరు మావటివాళ్ళు మాత్రం మక్కాలోనే ఉండిపోయారు. కాని వారు గ్రుడ్డివారై పోయారు. మరియు అవిటివాళ్ళుగా మారి భిక్షాటన చేస్తున్నారు. ఇబ్నె ఇస్‌హాక్ గారు ఆయిషా(రజి)వారి ఉల్లేఖనాన్ని తెలియజేశారు. వారిద్దరూ భిక్షమెత్తుకోవడాన్ని ఆమె(రజి) చూశారు.

అరబ్ చరిత్రలో ఈ సంఘటనకు చాలా ప్రాముఖ్యత ఉంది. దానిని వందల సంఖ్యలో అరబ్బులు చూశారు. ఇది వారందరికి బాగా తెలిసిన చారిత్రక సంఘటన.

సూరహ్ ఫీల్‌లోని మొదటి ఆయత్‌ను గమనించండి : ఏమీ? ఏనుగు వారి (సైన్యంతో) నీ ప్రభువు ఎలా వ్యవహరించాడో **నీవు చూడలేదా?** ఇందులోని పదబంధం ''అలమ్ తర'' (నీవు చూడలేదా?) అని ఉంది.

ప్రవక్త(స)వారి పుట్టుకకు ముందు జరిగిన సంఘటన ఇది. ఆయన(స) స్వయంగా ఆ సంఘటనను చూడలేదు.

అయినప్పటికీ పై ఆయత్‌లో **'చూడలేదా?'** అని ప్రశ్నించడాన్ని బట్టి ఆ సంఘటన ఎంత ప్రఖ్యాతి చెందినదో అర్థమౌతుంది.

అడుక్కుంటున్న మావటి వాళ్ళిద్దరిని ఆయిషా(రజి) మరియు ఆమె సోదరి అస్మా(రజి) చూశారు. ఈ విధంగా ముహమ్మద్(స)వారు జన్మించిన తరువాత కూడా ఆ సంఘటన యొక్క ఆనవాళ్ళు ఉండేలా చేశారు అల్లాహుతాలా.

ఈ సంఘటన అరబ్ సమాజంలో ఖురైషీయుల గౌరవాన్ని పెంచింది. వారిపట్ల ప్రేమ మరియు మర్యాద కలుగజేసింది. పవిత్ర కాబా నిర్వాహకులుగా, అల్లాహ్ యొక్క మనుష్యులుగా వారికి అరబ్ సమాజంలో ఓ మంచి గుర్తింపు లభించింది.

అందువల్లనే ఖురైషీయులు ఎక్కడకు వెళ్ళినా గౌరవం మరియు రక్షణ ఉండేది. వారి వ్యాపార బిడారాలపై ఎటువంటి బందిపోటు దాడులు జరిగేవి కాదు. చుట్టుపక్కల ప్రాంతాలతో వారు యదేచ్ఛగా వ్యాపారం చేసుకోగలిగేవారు.

ఈ సంఘటన తరువాత 10 సంవత్సరాల వరకూ (కొన్ని ఉల్లేఖనాల ప్రకారం 7 సంవత్సరాల వరకూ) అల్లాహ్‌ని తప్ప అరబ్బులు ఏ విగ్రహాన్ని పూజించలేదని చాలా ఉల్లేఖనాలున్నాయి. ఇన్షా అల్లాహ్, ఆ సూరహ్ తఫ్సీర్ సమయంలో వాటిని అందించడానికి ప్రయత్నిస్తాము. అంటే 7 సంవత్సరాల వరకూ ఎవ్వరూ ఏ విగ్రహాన్ని పూజించలేదని తెలుస్తుంది. వారిలో కొందరయితే 10 సంవత్సరాల వరకూ కూడా విగ్రహాలని పూజించలేదని తెలుస్తుంది.

ఈ సంఘటన ముహర్రమ్ నెలలో జరిగింది. ఈ సంఘటన జరిగిన 50 లేదా 55 రోజులకు ముహమ్మద్(స)వారు జన్మించారు. ఈ సంఘటన సమాచారం సుదూర దేశాలకు కూడా ప్రాకింది.

అల్లాహ్ గృహం యొక్క పవిత్రత ఈ సంఘటన ద్వారా ప్రపంచ ప్రజలను ఆకర్షించింది.

---

- ఈ సంఘటన ద్వారా కాబా పవిత్రత మరియు ఇస్లామ్ తిరిగి ఆవిర్భావానికి ముందరి కాలంలో బహుదైవారాధకులైన అరబ్బులు 'కాబా' మస్‌జిద్‌కు ఎంత గౌరవం ఇచ్చారో స్పష్టంగా తెలుస్తుంది. అక్కడ నివాసం ఉన్న వారిలో ప్రముఖమైనది బహుదైవారాధనే! అయితే ఆ చీకటికాలంలో కూడా 'కాబా' అనేది 'ఇబ్రాహీమ్'(అ) ధర్మానికి అవశేషంగా అరబ్బుల మస్తిష్కాలలో ఉండిపోయింది.
- అరవై వేల మంది సైన్యంతో ఆయుధ సంపత్తితో వస్తున్న అబ్రహాతో యుద్ధం చేసి గెలవడం సాధ్యం కాని పని. కాని కాబా పవిత్రత వారిని త్యాగానికి పురికొల్పింది. అందుకే హిమ్యార్ రాజు అబ్రహా సైన్యంతో తలపడ్డాడు. కాని అతడు యుద్ధఖైదీగా చిక్కాడు. నుఫైల్ బిన్ హబీబ్ అల్-ఖతామీ మరియు ఇతర యమన్ తెగలు అబ్రహాతో తలపడ్డారు. అంత పెద్ద సైన్యాన్ని ఎదుర్కోవడం కష్టమని వారికి తెలిసినప్పటికీ వారు తాము గౌరవించే దానిని కాపాడుకోవడానికే యుద్ధం చేశారు.
- జాతి ద్రోహులను వారు క్షమించరు. ఉదాహరణకు అబూ రుగాల్ విషయాన్నే తీసుకోండి. ఎవరైనా అతని సమాధి ప్రక్కనుండే పోవలసి వస్తే, అతడు ఆ సమాధిని రాళ్ళతో కొట్టాడు. శతాబ్దాల నుండి ఇది జరుగుతూ వచ్చింది.
- అబ్దుల్ ముత్తలిబ్ ఈ సంఘటనలో వ్యవహరించిన తీరు స్పష్టంగా తెలియజేసేది ఏమిటి? ఇది అల్లాహ్‌కు మరియు ఆయన శతృవులకు మధ్య యుద్ధమేనని, తనవారిని తీసుకుని కొండ శిఖరాలకు చేరుకుని, అల్లాహ్ ఆగ్రహం శతృవులపై ఏ విధంగా ఉంటుందో చూడాలని నిర్ణయించుకున్నారు. అల్లాహ్‌పై ఆయనకి ఎంత అచంచలమైన విశ్వాసముందో ఆయన మాటలే తెలియ జేస్తున్నాయి. కాబాను అల్లాహ్‌యే రక్షిస్తారని పూర్తి విశ్వాసంతోనే వారితో ఆయన తలపడలేదు.
- ఎందరో విద్వాంసులు ఈ ఏనుగు సంఘటనను మహాప్రవక్త ఆగమనానికి సూచనగా తెలియజేశారు. అబ్రహాతో ముందుగా కొందరు యుద్ధం చేసి ఓడిపోయారు. యుద్ధఖైదీలయ్యారు. అబ్రహాని అల్లాహ్ నాశనం చేశారు. కాబట్టి ఖురైషీయులెవరూ యుద్ధఖైదీలుగా గాని, బానిసలుగా గాని చిక్కలేదు. ఆ విధంగా మహాప్రవక్త(స)వారు తమ జాతి ఖైదీలుగా ఉండగా పుట్టకుండా అల్లాహ్ ఖురైషీయుల స్థాయిని పెంచారు. కాబా మస్‌జిద్ నిర్వాహకులు మరియు అల్లాహ్ మనుష్యులుగా ఇతర అరబ్ తెగలచే గుర్తింపబడిన ఖురైష్ తెగలో ముహమ్మద్(స)వారు జన్మించేలా చేశారు. బహుదైవారాధకుల కంటే అబ్రహా (క్రైస్తవుల) ధర్మం మేలైనదే కాని 'కాబా' రక్షణ కొరకు మరియు ప్రవక్త(స)వారి కొరకు అబ్రహా సైన్యాన్ని అల్లాహ్ నాశనం చేసినట్లు ఇబ్న్ తేమియ్యా అభిప్రాయ పడ్డారు. ఇబ్న్ కసీర్‌గారు ఈ సంఘటనను అల్లాహ్ యొక్క సందేశ హరుడు ఉధ్బవించడానికి ఓ పరిచయంగా వర్ణించారు.
- అబ్రహా చనిపోయిన తీరు అసాధారణమైనది. ఆ వార్త అరేబియా అంతటా ప్రాకిపోయింది. ఈ సంఘటనను అరబ్బులు ఎంత ప్రముఖంగా భావించారంటే, ఈ సంఘటనతో వారు ఓ కేలెండర్‌నే తయారు చేసుకున్నారు. ఈ సంఘటన జరిగిన సంవత్సరాన్నే 'ఆముల్ ఫీల్' అని పేరు పెట్టారు. ఏదైనా ఓ విషయాన్ని ఏ అరబ్ అయినా ఎప్పుడు జరిగిందో చెప్పాలనుకుంటే, అతడు ఆ విషయం ఏనుగు సంవత్సరానికి ఇన్ని సంవత్సరాల ముందు లేదా ఇన్ని సంవత్సరాల తరువాత అని చెప్పేవాడు. ఆ విధంగా ఏనుగు ప్రజల ఉదంతం అంత ప్రాముఖ్యత సంతరించుకుంది.

---

ఇంతవరకూ ఏనుగు ప్రజల ఉదంతాన్ని మరియు ఆ సంఘటనపై విద్వాంసులు వెలుబుచ్చిన అభిప్రాయాలను తెలియజేశాము. సంఘటన వివరాలను సాధ్యమైనంతవరకూ విపులంగా ఇవ్వాలనే ఉద్దేశ్యంతో అందుబాటులో ఉన్న కొన్ని తఫ్సీర్ గ్రంథాలను కూడా ఈ వ్యాసం కొరకు రిఫర్ చేయడం జరిగింది.

ప్రవక్త(స)వారి జననానికి ముందు జరిగిన అతి ముఖ్యమైన సంఘటనలుగా రెండు సంఘటనలను గత సంచిక మరియు ఈ సంచికలో అందించాము.

అరబ్బులపై మరియు ముహమ్మద్(స)వారిపై ముస్లిమేతరులకే కాకుండా కొందరు ముస్లిములకు కూడా ఎన్నో అపోహలు ఉన్నాయనేది

తెలిసిన విషయమే. వాటిని దృష్టిలో ఉంచుకుని **"ముహమ్మద్(స)వారిపై ప్రపంచ వ్యాప్తంగా జరుగుచున్న దుష్ప్రచారం"** పుస్తకంలో చాలా వివరాలను ఆధారాలతో అందించాము.

**కాబట్టి ముహమ్మద్(స)వారి జీవితచరిత్ర గురించి ఈ "శాంతిబాట"లో మేము అందించే ప్రతీ విషయానికి, ఓ విశ్లేషణ కూడా జత చేయాలని సంకల్పించాము. ఈ విశ్లేషణ పాఠకులను ఆలోచింపజేసేలా ఉండాలనేది మా కోరిక. ఇంతవరకూ తెలియజేసిన రెండు సంఘటన** (1. జమ్ జమ్ 2. ఏనుగు ప్రజల ఉదంతం)**లపై మా అభిప్రాయాలను పాఠకులతో పంచుకోవాలను కుంటున్నాము.**

మనం దరూద్ చదివేటప్పుడు ఇబ్రాహీమ్(అ)వారిని గుర్తు చేసుకుంటాము. ఖుర్ఆన్‌లో అల్లాహుతాలా ఇలా తెలియజేస్తున్నారు:

**ఇబ్రాహీమ్ యూదుడూ కాడు మరియు క్రైస్తవుడూ కాడు! కాని అతను హనీఫ్ (ఏకదైవ సిద్ధాంతంపై ఉన్నవాడు), ముస్లిమ్ (అల్లాహ్‌కు విధేయుడు) మరియు అతడు ఏమాత్రం ముష్రిక్ (అల్లాహ్‌కు సాటి కల్పించేవాడు) కాడు.** (ఖుర్ఆన్ 3:67)

మనకు 'కాబా' మస్జిద్ అతి ముఖ్యమైనది. మన ప్రతి సలా(నమాజ్) 'కాబా' మస్జిద్‌కు అభిముఖంగానే చేస్తాము. ఇస్లామ్ యొక్క 5 మూల స్తంభాలలో ఒకటి 'హజ్జ్'. ఇది కూడా 'కాబా'తోనే ముడిపడి ఉంది.

ఈ 'కాబా' మస్జిద్‌ను నిర్మించింది ఇబ్రాహీమ్(అ) మరియు ఇస్మాయీల్(అ).

ఇక్కడ (1) ఇబ్రాహీమ్(అ)వారు ఆచరించిన ఏకదైవ సిద్ధాంతం, (2) ఆయన నిర్మించిన కాబా మస్జిద్ మరియు (3) ఆయన కుమారుడు ఇస్మాయీల్(అ) వారిని ముఖ్యంగా పరిగణనలోకి తీసుకోవాలి. ఎందుకంటే ఏక దైవ సిద్ధాంతానికి మరియు కాబా మస్జిద్‌కు సంబంధించి ఇబ్రాహీమ్(అ)వారి గురించి చెప్పడం మాత్రమే కాకుండా, ముహమ్మద్(స)వారు ఏ అరబ్ తెగలోనయితే జన్మించారో ఆ ఖురైష్ తెగకు పితామహుడైన ఇస్మాయీల్(అ)గురించి చెప్పడం కూడా ఇక్కడ చాలా ముఖ్యం. ఇబ్రాహీమ్(అ)వారి, హాజిరా వారి మరియు ఇస్మాయీల్(అ) వారి త్యాగాలను ఖుర్బానీ ప్రత్యేక సంచికలో వివరించాము.

ఇస్మాయీల్(అ)వారి దాహాన్ని తీర్చడానికి ఈ భూమిపైకి తొలిసారిగా జమ్‌జమ్ నీరుని అల్లాహ్ పంపారు. నీరు కూడా లేని ఎడారిలో, మానవ నివాసాలు లేని ఎడారిలో పాలు త్రాగే పసిబిడ్డతో కేవలం అల్లాహ్‌పై అచంచలమైన విశ్వాసాన్ని ఉంచి నిలబడిన ఆ గొప్ప మాతృమూర్తి యొక్క 'ఈమాన్' ఎటువంటిదో విశ్వాసులకు ఈ జమ్‌జమ్ నీరు ప్రళయం వరకూ గుర్తు చేస్తూనే ఉంటుంది.

అటువంటి జమ్‌జమ్ కొన్ని తరాలుగా కప్పివేయబడింది. ఆ బావి ఎక్కడుందో కూడా ప్రజలకు తెలియదు. అటువంటి జమ్‌జమ్ బావి తిరిగి ప్రవక్త(స)వారి జననానికి ముందు తాతగారు అబ్దుల్ ముత్తలిబ్‌చే 'అల్లాహ్' వెలికి తీయించారు. ఇస్మాయీల్(అ) పసిబిడ్డగా ఉన్నప్పుడు అల్లాహ్ కానుకగా మానవులకు అందిన 'జమ్ జమ్ నీరు' తిరిగి ఆయనకు వారసుడైన చిట్ట చివరి ప్రవక్త పసిబిడ్డగా భూమిపైకి వస్తున్న సందర్భంలో జాడ తెలియని ఈ జమ్‌జమ్ బయటపడటం చాలా గొప్ప విషయం. ఇక రెండవ సంఘటన గురించి మాట్లాడుకుందాం.

ఇబ్రాహీమ్(అ) మరియు ఇస్మాయీల్(అ) ఎటువంటి త్యాగధనులో అందరికీ తెలిసిన విషయమే. వారిద్దరూ కాబాను నిర్మించాక, అల్లాహ్ ఆజ్ఞతో ఇబ్రాహీమ్(అ) ప్రజలకు పిలుపునిచ్చారు. ఆ పిలుపును ప్రపంచం నలుమూలలా మరియు ప్రళయం వరకూ పుట్టబోయే ప్రతీ ఒక్కరికీ వినిపింపజేస్తానని అల్లాహ్ చెప్పారు. ఇది 'కాబా' మస్జిద్ యొక్క పవిత్రతను తెలియజేస్తుంది. ఇబ్రాహీమ్(అ)వారిని మంటల్లో పడదోయడానికి అతని ప్రజలు సిద్ధమవుతుండగా, దైవదూతల సహాయాన్ని కూడా నిరాకరించి, కేవలం అల్లాహ్ యొక్క సహాయాన్ని మాత్రమే కోరుకున్న అమోఘమైన విశ్వాసి - ఇబ్రాహీం(అ).

కాబా యొక్క ప్రాముఖ్యత, పవిత్రత మరియు ప్రాణాంతకమైన కష్టాలలో సైతం అల్లాహ్‌ను తప్ప వేరెవరి సహాయాన్ని కోరకపోవడాన్ని అబ్రహా ఉదంతం మరోసారి మనకు గుర్తు చేస్తుంది.

అంటే ముహమ్మద్(స)వారి జననానికి ముందు ఆ మహనీయుని వంశానికి మూలమైన ఇబ్రాహీమ్(అ)వారిని, హాజిరా వారిని, ఇస్మాయీల్(అ)వారిని గుర్తు చేసే సంఘటనలే ఇంత వరకూ చెప్పుకున్న రెండు సంఘటనలు.

### 10 సంవత్సరాల వరకూ విగ్రహాలను పూజించలేదు

అబ్రహా సైన్యం నాశనమవడం ద్వారా అల్లాహ్ యొక్క శక్తి సామర్థ్యాలను అరబ్బులు కళ్ళారా చూశారు. అల్లాహ్ తలిస్తే పెద్ద పెద్ద ఏనుగులను సైతం చిన్న పక్షుల చేత అవి వదిలే సెనగ గింజంత సైజులో ఉండే చిన్న మట్టిరాళ్ళతో నాశనం చేయగలడనే విషయాన్ని అరబ్బులు కళ్ళారా చూశారు.

**కాబా మస్జిద్ యొక్క ఒక్కొక్కరాయిని విడి విడిగా రాలిపోయేలా చేస్తానని ప్రతిజ్ఞ చేసిన అబ్రహాకి మాత్రమే కాకుండా, వాడి సైన్యానికి కూడా వారిలోని ఒక్కొక్క అవయవం వారి శరీరాల నుండి రాలిపోయింది.**

అల్లాహ్ గృహాన్ని అల్లాహ్ కాపాడుకుంటారన్న అబ్దుల్ ముత్తలిబ్ నమ్మకం నిజం అని అక్కడివారు తెలుసుకున్నారు. ఆ నమ్మకమే ఖురైషీయుల స్థాయి గౌరవాలను పెంచింది. ఈ సంఘటన ప్రభావం ప్రజలపై బాగా పడింది. అప్పుడే కాదు, ఎప్పుడైనా సరే అల్లాహ్‌పై విశ్వాసం సమాజంలో గౌరవ మర్యాదలను పెంచుతుంది. ఆ సంఘటనా సమయానికి కాబా మస్జిద్‌లో అరబ్బులు దాదాపు 360 విగ్రహాల నుంచారు.

ఈ సంఘటన తరువాత 10 సంవత్సరాల వరకూ అరబ్బులు అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించి, విగ్రహాలను పూజించ లేదు అంటే **ముష్రిక్కులు** కూడా కొన్ని సంవత్సరాలపాటు **ముస్లిముల** వలే జీవించారు. అటువంటి సమయంలో అంటే ఆ సంఘటన జరిగిన 50 రోజుల తరువాత ముహమ్మద్(స)వారు జన్మించారు.

ముష్రిక్‌లు కూడా విగ్రహాలు వదిలేసిన సమయంలోనే ఆయన జననం జరిగింది. ఆయన జన్మించిన సమయం నుండి 10 సంవత్సరాల వరకూ విగ్రహాలు పూజించబడలేదు. అంటే ఆయన చేత చిన్న తనంలో తల్లిగారుగాని, తాతగారుగాని మరెవరైనాగాని విగ్రహ పూజ చేయించ లేదనే విషయం కూడా స్పష్టంగా అర్థమౌతుంది.

సకల లోకాలకు కారుణ్యంగా పంపబడిన ముహమ్మద్(స)వారిని అటువంటి పనులకు అల్లాహ్ దూరంగా ఉంచారని ఇస్లామ్‌పై అవగాహన కలిగిన ముస్లిములకు బాగా తెలుసు. కాని అనుమానం కల్గినవారికి, ఊహ తెలియని వయస్సులో కూడా ఆయన విగ్రహారాధన చేసే అవకాశం లేదని పై సంఘటన తెలియజేస్తుందని అనుకుంటున్నాము.

ముష్రిక్‌లకు (షిర్క్ చేసేవారికి) స్వర్గం లేదు. అల్లాహ్‌యే సృష్టికర్త యని, ఆయనే కాపాడతారని విశ్వాసమున్నప్పటికీ ఆనాటి అరబ్బులు, అల్లాహ్‌తో పాటుగా విగ్రహాలను తయారుచేసుకుని పూజించడం ద్వారా ముష్రిక్‌లై పోయారు.

ఇక్కడ ఓ విషయాన్ని ప్రతీ ముస్లిమ్ తెలుసుకోవాలి.

**ఆనాటి అరబ్ ముష్రిక్‌లకు అల్లాహ్‌పై ఉన్నంత విశ్వాసం నేడు మనలో ఉందా? కష్టకాలంలో వారు అల్లాహ్‌నే వేడుకున్నారు. మరి మనం కష్టకాలంలో సహాయానికై అల్లాహ్‌నే అర్థిస్తున్నామా? లేక మరెవరినైనా అర్థిస్తున్నామా?**

ఒకవేళ నేటి ముస్లిమ్, తనకు కష్టమొచ్చినప్పుడు ఫలానా వ్యక్తి అయితే నా ఈ కష్టం నుండి దూరం చేస్తాడనిగాని, లేదా ఫలానా ఫలానా నా కష్టాన్ని దూరం చేస్తుందనిగాని భావిస్తే, అప్పుడు నేటి ముస్లిమ్ ఆనాటి అరబ్బు ముష్రిక్ కంటే చాలా తక్కువ స్థాయిలో ఉన్నట్లే కదా!

అయినప్పటికీ అరబ్ ముష్రిక్‌కు నరకం. మరి మనకు ఏది లభిస్తుంది?

కాబా మస్జిద్ పునర్‌నిర్మాణానికి అరబ్ ముష్రిక్‌లు 'హలాల్' సొమ్ము(ధర్మసమ్మతంగా సంపాదించిన సొమ్ము)నే వాడారు. 'హరామ్' సొమ్మును దానిలో కలపలేదు. హరామ్ సొమ్ము వారి దగ్గర చాలా ఉన్నప్పటికీ, హలాల్ సొమ్ము సరిపోక, ఓ గోడ యొక్క కొంత భాగాన్ని పూర్తి చేయకుండా అలాగే వదిలేసారు.

**మరి నేటి ముస్లిమ్‌లు మస్జిద్ నిర్మాణంలో ఆనాటి అరబ్ ముష్రిక్‌లు తీసుకున్న జాగ్రత్తలు తీసుకుంటున్నారా?** మస్జిద్‌ల కొరకు డబ్బు సేకరించేవారు, 'హరామ్' సొమ్మును నిర్మాణం కొరకు ఉపయోగిస్తే, **ఆ పాపం ఎవరిది?** ఈ విషయంలో ఆనాటి అరబ్బు ముష్రిక్‌లు నేటిముస్లిములలోని చాలామందిని సిగ్గుతో తలవంచుకునేలా చేశారు.

**అరబ్బులను దుర్మార్గులుగా, అనాగరికులుగా భావించే ఎంతో మందికి కనువిప్పు కలగాలని, అరబ్బులలో ఏవో కొన్ని చెడు అలవాట్లు ఉన్నప్పటికీ, వారిలో ఉండే ఎన్నో మంచి లక్షణాలకు సరిపోయేవారు ఆనాడు గాని, ఈనాడు గాని ప్రపంచంలో లేరు అని చెప్పడం అతిశయోక్తి కాదు.**

తియ్యటి ద్రాక్షపళ్ళ గుత్తులను చూడగానే ఓ నక్కకు నోరూరిందట. ఆ ద్రాక్షపళ్ళను అందుకోవాలని ఎగిరింది. ఎంత ఎగిరినా అవి దానికి అందలేదట. అయితే తన ఓటమిని అంగీకరించలేక, 'ద్రాక్ష పళ్ళు పుల్లగా ఉంటాయి'అని అనేసి వెళ్ళిపోయిందట. అందుకని అందని ద్రాక్ష పుల్లన అనే సామెతను తెలుగులో ఎక్కువగా ఉపయోగిస్తారు.

అరబ్బులను విమర్శించేవారి విషయంలో ఈ సామెత సరిపోతుంది. అరబ్బులను లొంగ దీసుకోవాలని ఎందరో సామ్రాజ్యాధినేతలు ప్రయత్నించారు. కాని వారి కున్న ఆత్మాభిమానం వారిని ఎవరి ముందూ తలవంచ నీయలేదు. వీలైతే చంపుతారు లేదంటే ఛస్తారుగాని, ఎవరికీ తల ఒగ్గరు. ఎన్నాళ్లైనా ప్రాణం పోయేవరకూ యుద్ధం చేస్తారు.

వారి ధైర్యం, ఆత్మాభిమానాల ముందు నిలవలేని రాజులు, వారిని దుర్మార్గులుగానూ, అనాగరికులుగానూ వర్ణించి తమ ఓటమిని సమర్థించు కున్నారు. నక్క ద్రాక్షపళ్ళు అందక వాటిని పుల్లవి అని చెప్పి జారుకున్నట్లు, అరబ్బులను జయించలేనివారు వారిని అనాగరికులుగా చరిత్రలో చిత్రీకరించారు.

ఈ వ్యాసం చదివిన వారికి కష్టమొచ్చినా, సుఖమొచ్చినా ఎల్లప్పుడూ అల్లాహ్‌యే గుర్తు రావాలని కోరుకుంటున్నాము. (ఆమీన్)

**(మరికొంత భాగం ఇన్షా అల్లాహ్ వచ్చే సంచికలో...)**

"మరియు వారిని సముద్రపు అల మేఘంగా క్రమ్ము కున్నప్పుడు, వారు పరిపూర్ణ భక్తితో అల్లాహ్‌నే వేడుకుంటారు. కాని ఆయన వారిని రక్షించి ఒడ్డుకు చేర్చిన తరువాత వారిలో కొందరు (విశ్వాస-అవిశ్వాసాల) మధ్య ఊగిపోతారు. మరియు మా సూచనలను కేవలం విశ్వాస ఘాతకులు, కృతఘ్నులైన వారు మాత్రమే తిరస్కరిస్తారు." **(ఖుర్'ఆన్ 31:32)**

"వారు నావలోకి ఎక్కినప్పుడు తమ భక్తిని కేవలం అల్లాహ్‌కు మాత్రమే ప్రత్యేకించుకుని, ఆయననే ప్రార్థిస్తారు, కాని ఆయన వారిని రక్షించి నేలమీదకు తీసుకురాగానే ఆయనకు సాటి కల్పించ సాగుతారు" **(ఖుర్'ఆన్ 29:65)**

**ఇస్లామ్ గురించి ఎవరికైనా పరిచయం చేయాలనుకుంటున్నారా?**

**ఇస్లామ్‌పై మరియు ముస్లిములపై అపోహలను తొలగించాలనుకుంటున్నారా?**

**శాంతిబాట మాసపత్రికను చదివించండి**

**చందాదారులను చేర్పించండి.**

**ఆర్థికంగా మీకు వీలైతే ఒకటి కంటే ఎక్కువ కాపీలను తీసుకుని మీ స్నేహితులకు అందజేయండి.**

# ఖుర్ఆన్‌ని అర్థం చేసుకుంటూ చదువుదాం - 14

| دنیا లోకం, ... World, ... | | | | | |
|---|---|---|---|---|---|
| **Arabic** | **pl** | **ఉచ్ఛారణ** | **తెలుగు** | **English** | **Urdu** |
| بَيْت | بُيُوت (బుయూతున్) | = (బైతున్) | ఇల్లు | house | گھر |
| دَار | دِيَار (దియార్) | = (దార్) | ఇల్లు | abode | گھر |
| دُنْيا | | = (దున్యా) | ప్రపంచం | world | دنیا |
| سَبِيل | سُبُل (సుబుల్) | = (సబీల్) | మార్గం | way | راستہ |
| صِرَاط | | = (సిరాతున్) | మార్గం | path | راستہ |
| عَالَم | عَالَمِين (ఆలమీన్) | = (ఆలమ్) | లోకం | world | ساری مخلوقات |
| فِتْنَة | | = (ఫిత్‌నతున్) | ఉపద్రవం, కల్లోలం | trial; persecution | آزمائش، مصیبت؛ فساد |
| قَرْيَة | قُرَى (ఖురా) | = (ఖుర్‌యతున్) | పట్టణం | town | بستی |
| مَال | أَمْوَال (అమ్‌వాల్) | = (మాల్) | ఐశ్వర్యం | wealth | مال |
| مَتَاع | | = (మతాఉ'న్) | వస్తు సామాగ్రి, ప్రయోజనం | provision; enjoyment | سامان، فائدہ، نفع |
| مَسْجِد | مَسَاجِد (మసాజిద్) | = (మస్‌జిద్) | మస్‌జిద్ | mosque | مسجد |
| مَكَان | (مَكَانَة) మకానహ్ | = (మకాన్) | నివాసం | place; abode | جگہ، مقام |

| لوگ ప్రజలు, ... People, ...) | | | | | |
|---|---|---|---|---|---|
| **Arabic** | **pl** | **ఉచ్ఛారణ** | **తెలుగు** | **English** | **Urdu** |
| أُمَّة | أُمَم (ఉమమ్) | = (ఉమ్మతున్) | సంఘం | community | جماعت؛ مُدَّت |
| قَوْم | | = (ఖౌమున్) | ప్రజలు | people | گروہ؛ جماعت |
| إِنْسَان | | = (ఇన్‌సాన్) | మనిషి | man | انسان |
| نَاس | | = (నాసున్) | మనుష్యులు, ప్రజలు | men, people | لوگ |
| ذَكَر | ذُكُور (జుకూర్) | = (జకరున్) | పురుషుడు | male | مَرد، نر |
| أُنْثَى | إِنَاث (ఇనాస్) | = (ఉన్‌సా) | స్త్రీ | female | عورت، مَادہ |
| عَبْد | عِبَاد (ఇబాద్) | = (అబ్ద్) | బానిస | slave | بندہ، غلام |
| عَدُوّ | أَعْدَاء (అ'అ్‌దా) | = (అ'దువ్వున్) | శత్రువు | enemy | دشمن |
| كُفَّار (pl) | | = (కుఫ్ఫారున్) | అవిశ్వాసులు | disbelievers | کُفار |
| مُجْرِم | | = (ముజ్‌రిమ్) | దోషి | criminal | گنہگار، قصوردار |
| مَلَأ | | = (మలఉ'న్) | నాయకులు, అధికారులు | Chiefs, leaders | بڑے لوگوں کی جماعت |
| وَلِيّ | أَوْلِيَاء (ఔలియా) | = (వలియ్యున్) | స్నేహితున్ని రక్షించడం సంరక్షకుడు | protecting friend; guardian | بچانے والا دوست مددگار |

**ఖుర్'ఆన్‌లో మొత్తం పదాల సంఖ్య = సుమారు 77,800.**

***ఈ 10 నెలలలో నేర్చుకున్న ఖుర్'ఆన్ పదాల శాతం : 59***

ఈ నెల నేర్చుకున్న పదాలు 1950 (అంటే ఈ 24 పదాలు ఖుర్'ఆన్‌లో 1950 చోట్ల చూడవచ్చు)

***source: www.emuslim.com***

*pl* బహువచనం

*ఏ ధర్మాన్ని కించపరిచే ఉద్దేశ్యం మాకు లేదు. అన్ని ధర్మాలను గౌరవిస్తున్నాం*

# టెర్రరిజం

- క్రైస్తవ టెర్రరిజం ?
- సిక్ఖు టెర్రరిజం ?
- యూదు టెర్రరిజం ?
- కమ్యూనిస్ట్ టెర్రరిజం ?
- హిందూ టెర్రరిజం ?
- ఇస్లామిక్ టెర్రరిజం ?

*తీవ్రవాదానికి, మత ధర్మానికి ఏ విధమైన సంబంధం లేదు.* ✓

**టెర్రరిజం అనేది ముస్లిములకే స్వంతమన్నట్లు, మీడియా ఎందుకు ముస్లిములనే టార్గెట్‌గా పెట్టుకుంది?**

తీవ్రవాదాన్ని 'ముస్లిము'లుగా మేము ఖండిస్తున్నాం. మానవులకు అపకారాన్ని తలపెట్టే ఏ పనినైనా మేం వ్యతిరేకిస్తాం. మానవులందరూ ఒకే జంట యొక్క వారసులని, ఖుర్'ఆన్ ద్వారా తెలుసుకుని ప్రపంచ ప్రజలందరినీ వారు హిందువులైనా, క్రైస్తవులైన లేక మరే ధర్మానికి చెందిన వారైనా సరే, వారిని మా సోదరులుగానే భావిస్తున్నాం. మా సోదరులపై జరిగే ఎటువంటి హింసనైనా నిర్ద్వంధంగా ఖండిస్తున్నాం. కాని మీడియా వారి రెండు నాలుకల ధోరణిని వివరించాలనేది ఈ శీర్షిక యొక్క ప్రధానోద్దేశం కాబట్టి ఈ శీర్షికలో మీడియా భాషనే వాడుతున్నాం. మా భాష మాత్రం కాదు. వేరే ధర్మం వారి ఎవరికైనా బాధ కలిగితే, మీడియా వారి వలన ముస్లిములకు కూడా అంతే బాధ కలిగిందని అర్థం చేసుకుని, కొంత మంది ప్రోద్భలంతో మీ తోటి ముస్లిం సోదరులపై అనాగరికంగా వ్రాస్తున్న మీడియా వ్రాతలను ఖండించమని కోరుతున్నాం.

14

సెప్టెంబర్ 11, 2001 అమెరికా ట్విన్ టవర్స్‌పై దాడి

దాడికి కారణం బిన్‌లాడెన్ కాదు!?
FBI దగ్గర సాక్ష్యం లేదు

## కారకులెవరు? - 3

**(గత సంచిక తరువాయి)**

అమెరికాలో ట్విన్ టవర్స్ కూల్చివేతకు కారణం 'బిన్ లాడెన్' అని వారి దగ్గర సాక్ష్యముందని అమెరికా ప్రభుత్వం నమ్మించి, ప్రపంచచెవిలో ఓ పెద్ద పువ్వు పెట్టింది. అమెరికన్ FBI వారి పోస్టర్ చూశాక, తమ చెవులలో అమెరికా ఎంత పెద్ద పువ్వు పెట్టిందో, ప్రపంచంలో ఇంటర్‌నెట్ నుపయోగించు కునేవారికి బాగా తెలిసొచ్చింది. సామాన్య ప్రజానీకానికి తెలియాలంటే, వాస్తవాలు న్యూస్ పేపర్లలో, టివి లలో రావాలి. కాని అమెరికా బాస్‌కు వ్యతిరేకంగా మాట్లాడటానికి ప్రయత్నిస్తే మన మీడియాకు పక్షవాతం వస్తుందేమో మరి!

అమెరికా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏదైనా చెబితే దానిని conspiracy theories అని కొట్టి పారేస్తారు. వారు చేసినవి ఆరోపణలని కొట్టి పారేసినా, ట్విన్ టవర్స్ కూలిపోవడానికి వారు చెప్పిన కారణాలలో  ఇప్పటి వరకూ చాలా నిజమయ్యాయి. భవిష్యత్తులో మరెన్నో విషయాలు వెలుగు చూడవచ్చు, ఇన్షా అల్లాహ్. ఆలస్యమైనా సత్యం వెలుగులోకి వస్తుంది. 1962 సం॥లో 'ఆపరేషన్ నార్త్‌ఉడ్స్' పేరుతో క్యూబాను ఆక్రమించడానికి ఇటువంటిదే ఒక పన్నాగాన్ని పన్ని అమెరికా ప్రభుత్వం ప్రజలను నమ్మించింది. అమెరికా ప్రభుత్వపు పాత పన్నాగాలను మర్చి పోయినవారు లేదా  తెలియనివారు 2001లో జరిగిన ట్విన్ టవర్స్ కూల్చివేత సంఘటన టెర్రరిస్ట్‌ల వలనే అని ప్రభుత్వం చెప్పగానే నమ్మారు.  ప్రజలకు అనుమానం కలుగలేదు. ప్రజలను నమ్మించడం ఎంత తేలికో!

అమెరికా ప్రభుత్వ కుటిల నీతి నుండి మనదేశంలో కొందరు పాఠాలు బాగానే నేర్చుకున్నారు. మాలెగావ్‌లో బాంబ్ దాడులు చేసినవారే మక్కా మస్‌జిద్‌లో బాంబులు పేల్చారు. నష్టం జరిగింది ముస్లిములకే అయినప్పటికీ ఆ బాంబ్ దాడులు చేసింది కూడా ముస్లిములేనని నీచమైన ఆరోపణలు కూడా చేశారు. 'ముస్లిమ్' మరియు 'ఇస్లామ్' పదాలకు బురద అంటించడానికి ఎల్లప్పుడూ ఎవరెడీగా ఉండే మీడియా అటువంటి ఆరోపణలకు మంచి ప్రచారం కలిగిస్తుంది.

> మన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి గారు ఈ మధ్యనే హైదరాబాద్‌లో ఇలా ప్రకటించారు : ***"మక్కా మస్‌జిద్ పేలుళ్లు హిందూ ఉగ్రవాదుల పనే".*** *హిందూ ఉగ్రవాదులను, మతోన్మాద శక్తులనూ దూరంగా ఉంచేందుకు అంతా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.* ***మక్కా పేలుళ్ల కేసులో తొలుత అమాయకులైన ముస్లిమ్ యువకులను నిందితులుగా భావించి జైళ్ళకు పంపాల్సి వచ్చిందన్నారు.*** *పేలుళ్ళతో వారికి సంబంధం లేదని విచారణలో తేలిందన్నారు. ముస్లిమ్ యువకులకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటిస్తామన్నారు.''* **(సాక్షి దినపత్రిక, ఫిబ్రవరి 3, 2011 పేజీ. 12)**

సాధారణంగా ముఖ్యమంత్రి ఏది చెప్పినా, ప్రతిపక్షాలు దానిని ఖండించి ప్రజలకు ముఖ్యమంత్రిని చెడ్డగా చూపడానికి వారికి అంది వచ్చిన ఏ ఒక్క అవకాశాన్ని కూడా వదులుకోరు. అటువంటిది ఆయన 'హిందువులు' అనగానే, ప్రతిపక్ష పార్టీ నాయకులు కూడా హిందువులే

**ఖుర్'ఆన్ గ్రంథ అవతరణ మొదలైన తరువాత 1380 సం॥ల వరకూ 'ఇస్లామిక్' తీవ్రవాదం అనే పదం ఎక్కడా ఉపయోగించ బడలేదు. గత 20 సంవత్సరాలుగా ఈ పదాన్ని ఉపయోగిస్తున్నారు. 'ఇస్లాం'కి తీవ్రవాదానికి అసలు సంబంధమే లేదని వివేకం గలవారికి సులభంగా అర్థమౌతుంది.**

కాబట్టి ఖండించాలి. రాష్ట్రంలోని హిందువులు కూడా ఖండించాలి.

కాని కేవలం ఒక పార్టీ వారు, ఆ పార్టీకి అనుబంధంగా ఉండే సంస్థ వారే స్పందించారు. కారణమేమిటి? ఇదంతా చూస్తే ముఖ్యమంత్రి ఉపయోగించిన 'హిందువులు' అనే పదం కేవలం ఆ ఒక్క పార్టీని, వారి అనుబంధ సంస్థలనే ఉద్దేశించి మాట్లాడారా? అని అనిపిస్తుంది. ముఖ్యమంత్రిగారి మాటలను వారు ఎలా ఖండించారో చూడండి:

*కిషన్ రెడ్డి, బిజెపీ నాయకుడు*

'సీఎం మక్కా మసీదు పేలుళ్లకు హిందూ ఉగ్రవాదులు బాధ్యులని పేర్కొనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. **తీవ్రవాదాన్ని మతంతో ముడిపెట్టడం సీఎం స్థాయి వ్యక్తికి తగదని** 'న్యూస్‌లైన్'తో అన్నారు. **ఉగ్రవాదానికి మతం, ప్రాంతం, దేశం లేవన్న విషయాన్ని ఆయన గ్రహించాలన్నారు.** ''సీఎం స్థాయి వ్యక్తి ప్రజల్లో ఐకమత్యం పెంచడంతో పాటు, శాంతిభద్రతలను కాపాడాలి. ప్రజలను విభజించే దిశగా ఒక వర్గంపై మరో వర్గం ప్రజల్లో విద్వేషం కలిగేలా, ప్రతీకారం పెరిగే విధంగా మాట్లాడడం సరికాదు'' అని సలహా ఇచ్చారు. **ఇటువంటి వ్యాఖ్యలు, ప్రకటనలు ప్రజలను ఐక్యం చేయడానికి దోహదపడతాయా ..? అన్న విషయాన్ని సీఎం ఆలోచించాలన్నారు."** మిడిమిడి జ్ఞానంతో సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి బాధ్యతారహిత వ్యాఖ్యలు చేస్తున్నారని ధ్వజమెత్తారు.

**(సాక్షి దినపత్రిక, ఫిబ్రవరి 3, 2011 పేజీ. 12)**

అంటే కిషన్‌రెడ్డిగారి అభిప్రాయం ప్రకారం స్థాయి తక్కువవారే అటువంటి మాటలు మాట్లాడుతారు. మాలెగావ్ బ్లాస్ట్ విషయంలో సాధ్వి ప్రగ్యా సింగ్ అరెస్ట్ కాకపూర్వం, 'ఇస్లామ్'ని ఉగ్రవాదంతో ముడిపెట్టి మాట్లాడిన అన్ని సంస్థల వారు, అన్ని జాతీయ పార్టీ నాయకులకు ఈయన అభిప్రాయం ప్రకారం స్థాయి లేనట్లే. వారంతా దిగజారి మాట్లాడినట్లే. కాబట్టి అప్పటివారిది (ఇస్లామ్‌ని విమర్శించిన వారిది) మిడిమిడి జ్ఞానమే.

మరో వర్గం ప్రజల్లో విద్వేషం కలిగేలా, ప్రతీకారం పెరిగే విధంగా మాట్లాడటం సరికాదు అంటున్న ఈయన, తన పార్టీకి అనుబంధ సంస్థ నాయకులను హైదరాబాద్‌లో ఒక మతవర్గం వారిపై రెచ్చగొట్టే ప్రసంగాలు చేయకుండా భవిష్యత్తులో ఆపగలిగితే, కిషన్ రెడ్డిగారు కూడా శాంతి భద్రతలను గౌరవిస్తున్నారని ప్రజలు తెలుసుకుంటారు.

ఎక్కడ ఏ దాడి జరిగినా, అది ముస్లిముల పనే అని దేశప్రజలని, ప్రభుత్వ యంత్రాంగాన్ని నమ్మించిన వ్యక్తులెవరో, నాయకులెవరో ప్రజలు ఇంకా మర్చిపోలేదు. మత దురభిమానంతో ఒకనాడు ఎదుటివారిపై విసిరిన ఆయుధం తిరిగి తమ వైపే వస్తుందని ఊహించలేకపోయారు.

**పాలకుని స్థాయిలో ఉన్నవారే చెప్పాలి. ముస్లిములపై అన్యాయంగా కేసులు పెట్టమని రాష్ట్రాన్ని పాలించే వ్యక్తి ఒప్పుకున్నారు. అమాయకులపై అన్యాయంగా కేసులు పెడితే శాంతి ఎక్కడ నుండి వస్తుంది.**

ఉగ్రవాదానికి మతం, ప్రాంతం, దేశం లేవన్న విషయాన్ని ముఖ్యమంత్రి గ్రహించాలంటున్నారు. మరి ఈ మాటలు అంటున్న వ్యక్తి గ్రహించారా? కిషన్‌రెడ్డి గారు గ్రహించి ఉంటే ఇక ముందు న్యూస్ పేపర్లలోగాని, మీడియాలో గాని 'ఇస్లామిక్ తీవ్రవాదం' అనే పదాలు వచ్చినప్పుడు వెంటనే ఖండిస్తారు. లేకపోతే ఆయన చిత్తశుద్ధిని ప్రజలు శంకిస్తారు. ఏ మతంపై దుష్ప్రచారం జరిగినా ఖండించినప్పుడు మాత్రమే ఇటువంటి ప్రకటనలు రావు.

**హిందువులు వెళ్ళొద్దనే దాడి చేయించా**

**- అజ్మీర్ పేలుడుపై అసీమానంద** (సాక్షి దినపత్రిక, 11 జనవరి 2011)

అజ్మీర్ దర్గాకు హిందువులను వెళ్లకుండా చేసేందుకే అక్కడ దాడికి పాల్పడినట్లు స్వామీ అసీమానంద వెల్లడించాడు. నిత్యం పెద్ద సంఖ్యలో దర్గాకు వచ్చే హిందువులు, బాంబు దాడి జరిగితే ఇక్కడకు రావడం మానేస్తారనే అంచనాతోనే ఈ పనిచేశామని నేరాంగీకార ప్రకటనలో తెలిపాడు. దాడికి పాల్పడిన వారిలో మెజారిటీ వర్గానికి చెందిన వారితో పాటు మైనారిటీ వర్గం వారూ ఉన్నట్లు చెప్పాడు. పేలుళ్ల జరిగిన రెండు రోజులకు సునీల్ జోషీ (హత్యకు గురైన ఆరెస్సెస్ మాజీ ప్రచారక్), రాజు, మెహుల్ అనే మరో ఇద్దరితో కలిసి **గుజరాత్‌లోని తన ఆశ్రమానికి వచ్చినట్లు** తెలిపాడు. బాంబు అమర్చేందుకు **ఇంద్రేష్ కుమార్ (ఆరెస్సెస్ సీనియర్ నేత)** ఇద్దరు ముస్లిం యువకులను పంపారని సునీల్ జోషీ తనకు చెప్పినట్లు వెల్లడించాడు. అజ్మీర్ పేలుళ్లతో పాటు **హైదరాబాద్, మలేగావ్, సంఝౌతా ఎక్స్‌ప్రెస్ పేలుళ్ల వెనుక కొందరు ఆరెస్సెస్ కార్యకర్తలతో పాటు ఇంద్రేష్ హస్తముందన్నాడు.** ''ఇంద్రేష్ నన్ను 2005లో కలిశాడు. దాడికి ప్రతిదాడి చేయక తప్పదన్న నా వాదన విన్న ఇంద్రేష్, 'అది నీ పనికాదు. ఆ బాధ్యతను మరో వ్యక్తికి (సునీల్) అప్పగించాం' అని చెప్పారు'' అని బయటపెట్టాడు.

పైన చెప్పబడిన సునీల్ హత్య గావించబడ్డాడు. అతని వ్యక్తులే అతన్ని చంపి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. బహుశా అతని ద్వారా విషయం తెలిసిపోతుందని చంపివేశారేమో!

42 పేజీల నేరాంగీకార రిపోర్ట్‌ను తెహల్కా ప్రచురించింది. మాలెగావ్‌లో 80శాతం మంది ముస్లిములున్నారు. అజ్మీర్ దర్గా బ్లాస్ట్ అక్టోబర్ 11, 2007 రమదాన్ నెలలో దాదాపు 5000 మంది ఉన్నప్పుడు జరిగింది. మక్కా మస్‌జిద్‌ను బాంబ్ బ్లాస్ట్‌కు ఎన్నుకోవడానికి గల కారణం అప్పటి హైదరాబాద్ నిజామ్ దేశవిభజనలో పాకిస్తాన్‌వైపు ఉన్నాడట. సంఝౌతా ఎక్స్‌ప్రెస్‌ని ఎక్కువగా పాకిస్తానీలే ఉపయోగిస్తున్నారని దానిపై దాడి చేయించాడట.

ఇంటి తీవ్రవాద ఆలోచనలున్న స్వామీ అసీమానంద బోటనీలో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ పూర్తిచేశాడు. 1977లో ఆరెస్సెస్‌వారి **ఆదివాసి కళ్యాణ్ ఆశ్రమంలో** చేరారు. 1981 వరకూ పశ్చిమ బెంగాల్‌లో ఉన్నారు. 1988 నుండి 1993 వరకూ అండమాన్ నికోబార్ ద్వీపాలలోఉన్న **వనవాసి కళ్యాణ్ ఆశ్రమంలో** ఉన్నారు. **1995 నుండి గుజరాత్ ఆశ్రమంలో** ఉన్నారు. గత సంవత్సరం నవంబర్ నెలలో సిబిఐ వారు ఇతనిని అరెస్ట్ చేశారు. సీనియర్ ఆరెస్సెస్ లీడర్ - ఇంద్రేష్ కుమార్, ఆరెస్సెస్ ప్రచారక్ సునీల్ జోషి,

సాధ్వి ప్రగ్యా సింగ్, సందీప్ దాంగే, రామ్‌జీ కల్సంగ్రా మొదలైన వారితో ఈయన చాలా సార్లు సమావేశమయ్యారు, వారితో పాటు హిందుత్వ నాయకులు కూడ ఉన్నారని చెప్పాడు.

**అసీమానంద** నేరాన్ని అంగీకరించాక **ఆరెస్సెస్ ఛీఫ్ మోహన్ భగవత్** గారి స్పందన (ద హిందూ, 11 జనవరి 2011)
రాడికల్ ఆలోచనలు ఉన్నవారిని తమ సంస్థ నుండి వదిలి వెళ్ళమని చెప్పాము.

ఈ బ్లాస్ట్ జరిగి మూడు సంవత్సరాలు అయింది. ఇది చేయించింది తమ సంస్థ వారేనని కనీస సమాచారం కూడా ఈయన దగ్గర లేదా? స్వామీ అసీమానంద 1977 నుండి ఆరెస్సెస్ ఆశ్రమాల్లో పనిచేస్తున్నాడు. అంటే దాదాపు 30 సంవత్సరాల నుండి ఆశ్రమాల్లో ఉండి, ఆరెస్సెస్ ప్రచారక్‌లతోనూ హిందుత్వ నాయకులతోనూ సంఘ వ్యతిరేక కార్యక్రమాల కొరకు సమావేశమౌతున్నా కూడా ఈ సంస్థ అధిపతికి ఆ విషయాలు తెలియ లేదు అంటే, ఇంకా ఇటువంటి వారు ఎంతమంది ఆశ్రమాల్లో ఉన్నారో?

**అసీమానంద 30 సంవత్సరాలు ఆశ్రమంలో ఉండి శాంతంగా ప్రవర్తించడానికి బదులు, బాంబ్ బ్లాస్ట్‌లకు సిద్ధమయ్యాడంటే, ఆయన ఎటువంటి శిక్షణను పొందాడు? ఇతరులకు ఎటువంటి శిక్షణ నిచ్చాడు?**

మరి ఆరెస్సెస్ నాయకులు ఇటువంటి వారిని తమ సంస్థలో ఎప్పుడు గుర్తిస్తారు? ఎప్పుడు వారిని బయటికి పంపిస్తారు? తమ ఆశ్రమాలు ఇటువంటి తీవ్రవాదులకు నిలయం అవుతున్నాయి. **ముస్లిమ్ మదరసాలపై విషం వెళ్ళగక్కేవారు ఈ ఆశ్రమాల విషయంలో ఏమి మాట్లాడుతారో?**

**అన్యాయంగా కేసులు**

మహారాష్ట్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిగారు ఆరిఫ్ నసీమ్ ఖాన్ 'బ్లాస్ట్ కేసులో నిందితుల కుటుంబాల వారు తమ వాళ్ళు అమాయకులని ఎప్పటినుండో నిరసన తెలియజేస్తున్నారని, వాళ్ళు అమాయకులైతే వదిలేస్తామని' చెప్పారు.

కమాల్ జహా భర్త షబ్బీర్ మసివుల్లాహ్ (42)ని ఆగష్టు 3, 2006లో మాలెగావ్ బ్లాస్ట్‌కు ముందే అరెస్ట్ చేశారు. ఆమె చెబుతున్నారు, 'గడిచిన 5 సంవత్సరాలలో నలుగురు పిల్లలను పోషించుకోవడానికి ఎన్నో అవస్థలు పడ్డాను'. షబ్బీర్ కుటుంబీకులు ఆసరానందించారు. తన భర్తపై తప్పుడు కేసును బనాయించారని, హెూమ్ మినిస్టర్ చిదంబరం గారితో సహ ఎంతోమందిని కలిసినా ఏమీ జరగలేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. 'మాకు తెలుసు వారంతా అమాయకులని అది ఇప్పుడు నిజమైంది' అని ఆమె చెప్పారు. ఇఖ్బాల్ మఖ్జూమీ, యునానీ డాక్టరైన తన కుమారుడు ఫరూఖ్‌ని ముంబై ట్రైన్ బ్లాస్ట్ విషయంలో నేరాన్ని ఆరోపించి అరెస్ట్ చేశారని చెప్పారు. తరువాత ఆ ఆరోపణను మాలెగావ్ బ్లాస్ట్‌కు మార్చారు. తప్పుడు కేసులతో 5 సంవత్సరాలుగా జైలులో ఉన్నాడు. (ద హిందూ, 23.01.11)

**నేరం చేసేది కొన్ని సంస్థలకు చెందినవారు. కాని ప్రాణాలు కోల్పోయేది అమాయకులు. తప్పుడు కేసులతో జైళ్ళలో మగ్గిపోతూ, తమ కుటుంబ సభ్యులకు కన్నీరు మిగిల్చి, బలై పోయేది దాడికి సంబంధంలేని అమాయకులే!**

ఈ మధ్య తెలిసింది మక్కామసీదు బాంబ్ బ్లాస్టులుగాని, మాలెగావ్ బ్లాస్టులుగాని, సంఝౌతా ఎక్స్‌ప్రెస్ బ్లాస్టులుగాని ముస్లిములు చేయలేదని. ఎంతో మంది అమాయక ముస్లిములను తీవ్రంగా హింసించి జైళ్ళలో వేశారు. సమాజంలో అవమానం. కెరీర్ నాశనమై పోయింది. ప్రస్తుత గవర్నమెంట్ ఉన్న ఈ కాలంలోనే ఈ విధంగా బాంబు దాడులు జరిగితే, పోటా చట్టం అమలులో పెట్టిన గవర్నమెంట్ కాలంలో జరిగిన బాంబు దాడులను ఖచ్చితంగా అనుమానించాలి.

నేడు ఓ కాంగ్రెస్ ముఖ్యమంత్రి ముస్లిములపై తప్పుడు కేసులు పెట్టి హింసించారని బహిరంగంగా ప్రకటించారు. పైన తెలిపిన బ్లాస్ట్‌లకు కారకులైన వారికి ఆనాటి పోటా గవర్నమెంట్ చాలా అనుకూలం కాబట్టి, ఎంతమంది అమాయక ముస్లిములను హింసించారో అల్లాహ్‌కే తెలియాలి.

**జాతిపిత మహాత్మాగాంధీని దూషించినట్లు కాదా?**

సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నారని శారదా పీఠం అధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి అన్నారు. హిందూ మతవాదుల వలనే ఉగ్రవాదం పెరిగిపోతుందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించడం తగదని తీవ్రంగా ఖండించారు. **రామకృష్ణ పరమహంస, వివేకానందుడు, శంకరాచార్యులు వంటివారు ఉగ్రవాదులా అని ప్రశ్నించారు.** హిందూత్వంపై అవగాహన లేక సీఎం మాట్లాడుతున్నారని అన్నారు. (సాక్షి, 5.2.2011)

కొన్ని నెలల క్రితం బిజేపీ రాష్ట్ర నాయకుడొకరు సాక్షి దినపత్రికలో పెద్ద వ్యాసాన్ని ఒకటి వ్రాశారు. దానిలో ఆరెస్సెస్‌ను స్థాపించిన వ్యక్తి యొక్క గొప్ప ఆశయాన్ని తెలియజేస్తూ ఆయనను కొనియాడారు. అటువంటి సంస్థపై చేసే ఆరోపణలను నాయకుడు విమర్శించారు.

పైన వివరించిన రెండు స్పందనలలోనూ వారు వెలిబుచ్చిన అభిప్రాయాలు సూటిగా లేవు.

సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి వివేకానందుడు, రామకృష్ణపరమహంస, శంకరాచార్యుల వారిని ఉగ్రవాదులని అనలేదు. వారి కాలంలోకి ఎందుకు వెళ్ళడం? అదే విధంగా ఏ సంస్థను స్థాపించినా, స్థాపించే వ్యక్తి మంచి సంకల్పంతోనే స్థాపిస్తారు. అందుకని తరువాతి కాలంలో ఆ సంస్థలో చేరిన సభ్యులు ఏమి చేసినా కూడా సంస్థ స్థాపించిన వ్యక్తి ముఖం చూసి ఏమీ అనకూడదని అంటారా? ఇలా మాట్లాడటం వివేకమనిపించుకుంటుందా?

స్వాతంత్ర్య సమరం కోసం 125 సంవత్సరాల క్రితం కాంగ్రెస్ పార్టీని స్థాపించారు. కాని ఈ రోజున ఆ పార్టీ అవినీతి పార్టీ అంటున్నారు. అంటే స్వాతంత్ర్య సమరయోధులంతా అవినీతి పరులనా? లేక జాతిపిత గాంధీజీ గారిని అవినీతిపరుడని మీరు అంటున్నట్లు భావించాలా?

వర్తమాన దాడులపై ప్రశ్నలు వేస్తే, గతం గురించి మాట్లాడి సమర్థించుకోవడం సరికాదు.

'ఇస్లామిక్ ఉగ్రవాదం' అని పలికినవారికి మతిభ్రమించినట్లు కాదా?

మన ప్రత్యర్థిగా భావించినవాడి ఇంటిపై ఎవరైనా కుర్రాడు రాయి విసరడం చూసి సంతోషిస్తే, అదే రాయి మన ఇంటిపై కూడా ఆ కుర్రాడు వేయవచ్చు. ఆ కుర్రాడికి అది తప్పు అని బోధించాలి. 'ఇస్లామిక్ తీవ్రవాదం' అని దుష్ప్రచారం జరిగినప్పుడు అగ్నికి ఆజ్యం పోసినట్లు వ్యవహరించినవారు మరియు దానిని ఖండించనివారు, ఈ రోజు 'హిందూ తీవ్రవాదం' అని అటువంటి ప్రచారమే జరుగుతున్నప్పుడు వారు ఎంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారో ఓ సారి గుర్తు చేసుకోవాలి.

డా. నాగిరెడ్డి శ్రీనివాసరావు

*తీవ్రవాదానికి, మత ధర్మానికి ఏ విధమైన సంబంధం లేదు.*

# చూసే కళ్ళ బట్టి ఉంటుంది .....

పాశ్చాత్య మహిళ

తన కెరీర్‌నే
త్యాగం చేసిన
త్యాగశీలి

ముస్లిమ్ మహిళ

అణిచివేతకు గురైన
అబల
ఇంటి ఖైదీ

ఓ పాశ్చాత్య మహిళ ఉద్యోగం
మానివేసి ఇంట్లో తన పిల్లల బాగోగులు
చూసుకుంటే ..

ఓ ముస్లిమ్ మహిళ ఉద్యోగం
చేయకుండా ఇంట్లో తన పిల్లల
బాగోగులు చూసుకుంటే ..

---

దైవానికి
అంకితమైన స్త్రీ

స్వేచ్ఛలేని
అణగదొక్కబడిన
స్త్రీ

ఓ క్రైస్తవ నన్
తల నుండి కాళ్ళ వరకూ
దుస్తులు ధరిస్తే ..

అల్లాహ్ ఆదేశం ప్రకారం ఓ ముస్లిమ్
మహిళ తల నుండి కాళ్ళ వరకూ
(బురఖా) ధరిస్తే ..

---

పాశ్చాత్య మహిళ

లోపలికి
ప్రవేశించడానికి
అనుమతి ఉంది

ముస్లిమ్ మహిళ

లోపలికి
ప్రవేశించడానికి ముస్లిమ్
అమ్మాయిలకు
అనుమతి లేదు

పాశ్చాత్య దేశాలలో
పిచ్చుక గూళ్ళవంటి హెయిర్‌స్టైల్స్‌తో
(అంటే చింపిరి జుట్టుతో),
చింపేసుకున్న బట్టలతో, చాలీచాలని
బట్టలతో యూనివర్శిటీలకు గాని,
స్కూళ్ళకుగాని వెళితే ..

హిజాబ్ ధరించి
ఓ ముస్లిమ్ అమ్మాయి
యూనివర్శిటీలకు గాని,
స్కూళ్ళకుగాని వెళితే ..

**స్త్రీకి ఇస్లామ్ స్వేచ్ఛ నిచ్చింది.
కాని ఆమె స్వేచ్ఛను దూరం చేయడానికి
ప్రయత్నించేది మానవ హక్కుల గురించి మాట్లాడే
మానవత్వం లేని మహానుభావులు.**

# పోస్టల్ సమస్యలు

అల్లాహ్ దయవలన పోస్టల్ రిజిస్ట్రేషన్ లభించింది. ఇక పోస్టల్ ఖర్చులు తగ్గుతాయి. గతంలో చాలా ఏరియాల్లో పుస్తకాలు అందడం లేదని, కొందరయితే పోస్ట్ చేసిన తరువాత తమకు చాలా ఆలస్యంగా అందుతున్నాయని ఫిర్యాదులు చేశారు. ఈ సమస్య పరిష్కారం కొరకు ప్రతీ ఊరిలోని మా చందాదారులలోని కొందరిని రిక్వెస్ట్ చేశాము. వారిలో కొందరు స్వచ్ఛందంగా కేవలం అల్లాహ్ కొరకు తమ ఊరిలోని ఇతర చందాదారులకు శాంతిబాట పత్రికను పంపిణీ చేయడానికి తమ అంగీకారాన్ని తెలియజేశారు. కొందరికి 20, మరికొందరికి 30 మరియు ఒక సోదరునికయితే 130 పుస్తకాలను కొరియర్ మరియు పార్శిల్ సర్వీసుల ద్వారా పంపిస్తూ ఉన్నాము. ఆ సోదరులకు అల్లాహ్ శ్రేయోశుభాలను అనుగ్రహించుగాక! (ఆమీన్)

పోస్టల్ రిజిస్ట్రేషన్ వచ్చింది కనుక అందరికీ పోస్ట్‌లో విడివిడిగా పంపినా కూడా ఆర్థికంగా మాకు కొంత భారం తగ్గుతుంది. కాని అందరికీ కాపీలు అందుతాయో? లేదో? అనే అనుమానంతో మాకు సహకరించే సోదరులకు మాత్రం కొరియర్ ద్వారా పంపించాలను కుంటున్నాము. కొరియర్ సర్వీస్‌లేని పల్లెటూర్లకు **'ముహమ్మద్(స)వారిపై ప్రపంచవ్యాప్తంగా జరుగుచున్న దుష్ప్రచారం'** పుస్తకం బుక్ పోస్ట్‌లో పంపాము. పంపిన వాటిలో దాదాపు 90శాతం పుస్తకాలు చందాదారులకు చేరలేదు. మాకు తెలిసిన కారణాలు : 1. పోస్ట్‌మాన్ల నిర్లక్ష్యం 2. ఇస్లామ్‌కు సంబంధించిన పుస్తకాలను పోస్టాఫీసుల్లో కొన్ని చోట్ల ప్రక్కన పారవేస్తున్నారని సమాచారం అందింది. 3. ఆ అడ్రస్ ఉండే ఏరియాలో ఇతరులెవరికీ ఉత్తరాలు అందజేయవలసిన అవసరం లేకపోతే, ఈ ఒక్కరి కోసం అక్కడికి వెళ్ళకుండా ఎడ్రస్‌లో ఎవరూ లేరని వెనక్కి పంపించేస్తున్నారు. 4. పోస్ట్‌మాన్ వచ్చే సమయానికి ఇంట్లో ఎవరూ లేకపోయినా లేదా ఇంట్లో వేయడానికి ఎటువంటి సందు లేకపోతే వాటిని మరోసారి తీసుకెళ్ళి ఇవ్వకుండా వెనక్కి పంపించేయడం గాని, ఎక్కడో పారవేయడంగాని చేస్తున్నారు. ఈ కారణాలే కాకుండా, ఒకొక్కసారి కొందరి ఇండ్లలో ఎవరైనా శాంతిబాట అందుకుని, ఎక్కడైనా పెట్టి మర్చిపోతే అప్పుడు కూడా రావడం లేదని ఫిర్యాదు చేస్తున్నారు. మస్జిద్ మరియు షాపు ఎడ్రస్‌లకు వెళ్ళే పుస్తకాలు అక్కడికి వచ్చినవారు ఎవరైనా ఆసక్తితో చదువుదామని చెప్పకుండా తీసుకుని వెళ్ళే అవకాశం కూడా ఉంది.

మా ఆఫీస్‌కు ఏదైనా కాపీ వెనక్కి తిరిగి వస్తే గాని మాకు తెలియదు. దానిపై ఫోన్ నంబర్ ఉంటే వెంటనే వారికి ఫోన్ చేసి చెబుతున్నాము. వెనక్కి తిరిగి వచ్చిన కాపీని మరలా పంపించడానికి వీలు లేకుండా అది బాగా నలిగిపోయి వస్తుంది.

'మేమే పంపకుండా పంపామని అబద్ధమాడుతున్నట్లు' కొందరు సోదరులు పరోక్షంగా అసహనం వ్యక్తం చేస్తున్నారు. 'మేము పంపించాము, అందకపోతే మా బాధ్యత కాదు' అని ఎవరికీ ఏనాడూ మేము చెప్పలేదు. వారికి తిరిగి పోస్ట్ చేయడం జరిగింది. ప్రతీ ఒక్కరికీ శాంతిబాట అందేలా చేయాలన్నదే మా ధ్యేయం. ఇది వ్యాపార పత్రిక కాదు కాబట్టి లాభనష్టాల పట్టింపు మాకు లేదు. అందరికీ తిరిగి పంపగలిగే ఆర్థిక వనరులు కూడా మాకు లేవు. అల్లాహ్ మాకు శక్తినిచ్చినంతమేర మా ప్రయత్నం మేము చేస్తున్నాం.

కొరియర్‌లో పంపించినవారికి ఫోన్ ద్వారా తెలియజేస్తున్నాము. కాని కొందరు ఫోన్‌లో దొరకరు. కొందరికి ఎస్.ఎమ్.ఎస్. పంపించినా గమనించకుండా, ఎప్పుడో అడుగుతారు. అప్పటికే కొరియర్ వారు వెనక్కి పంపించేస్తారు. ఆ విధంగా వెనక్కి పంపినవి మాకు ఏ రెండు నెలలకో, 3 నెలలకో వస్తాయి. కాబట్టి ఈ విధంగా అత్యధిక టెన్షన్ పోస్ట్ విషయంలోనే మీకు కలుగుతుంది. ఉద్యోగస్తులు లేకుండా స్వచ్ఛందంగా కొద్దిమంది చేసే ఈ కార్యక్రమంలో పోస్టింగ్ చేయడం మాకు ఓ పెద్ద సమస్య అయిపోయింది. ఈ విషయంలో విలువైన మా సమయం చాలా వృధా అవుతుంది.

ఎవరికైతే శాంతిబాట అందలేదో వారు మా ఆఫీస్‌కు లెటర్ ద్వారా ఫిర్యాదును పంపండి. దానిని చూపించి సామర్లకోట పోస్టాఫీసులో ఫిర్యాదు చేస్తాము. మీ ఊరిలో ఇతర చందాదారులకు పంచడానికి మీకు సమ్మతమైతే తెలియజేయండి. ఆర్.టి.సి. వారి ANL కొరియర్ ద్వారా మీకు ఇన్షా అల్లాహ్ పంపిస్తాము.

ఇప్పటికీ ప్రతీ నెల 10వేల నుండి 15వేల రూపాయల వరకూ అదనంగా మేము ఖర్చుపెట్టాల్సి వస్తుంది. చందాదారులని పెంచుకొని ఆర్థిక భారం తగ్గించు కోవాలని అనుకుంటున్నాము. కాని ఊర్లు తిరిగి చందాదారులను చేర్పించడానికి మా దగ్గర మేన్‌పవర్ లేదు. అల్లాహ్ దయవలన మా చందాదారులే ఇతరులను జాయిన్ చేసి మాకు అల్లాహ్ పేరుతో సహకరిస్తున్నారు.

**పత్రిక ఆలస్యం వెనుక చాలా కారణాలున్నాయి. మా పాత చందాదారులకు చాలా వరకూ తెలుసు. ఇదివరకే పత్రికాముఖంగా పలుసార్లు చెప్పాము. సమయానికి అందించడం మా బాధ్యతే అయినప్పటికీ, 'శాంతిబాట' న్యూస్ మీద ఆధారపడినది కాదు కనుక, జరుగుతున్న ఆలస్యాన్ని మరికొంతకాలం భరించమని మా పాఠకులను కోరుతున్నాము. ప్రామాణిక ఇస్లామీయ విషయాలనే అందించాలని నిర్విరామంగా కృషి చేస్తున్నా సరే, ప్రతీనెలా ఏదో ఒక ఆటంకం మాకు ఎదురౌతూ ఉంది. ఇన్షా అల్లాహ్ మరో 6 నెలలలో ఈ ఆలస్యాన్ని దాదాపు తగ్గించే విధంగా ప్రయత్నాలు ప్రారంభించాము. ఇంతవరకూ 2వ సంవత్సరానికి గానూ చందా పంపని వారి ఫోన్ నంబర్ మా దగ్గరుంటే, ఫోన్ ద్వారా వారికి తెలియజేస్తాము. వారు ఇష్టపడితే ఈ సంచిక ఇన్షా అల్లాహ్ పంపించబడుతుంది. మిగిలినవారికి మా ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఆపివేస్తున్నాము. - శాంతిబాట టీమ్**




**ప్రతీ స్త్రీ లేదా పురుషునికి తొలి బడి అమ్మ ఒడి. గొప్ప గొప్ప జ్ఞానులు, మేధావుల వెనుక తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉంటుంది. తొలి గురువులు తల్లిదండ్రులే. ఆ తరువాతనే, పాఠశాలలో చేరిన దగ్గరనుండి, మిగిలిన గురువులు పరిచయమౌతారు. వీరందరినీ మీరు గౌరవించాలి. అయితే వీరందరికీ జ్ఞానాన్ని ఇచ్చిన సృష్టికర్త విశ్వమంతటికీ గురువు - ఆయనే 'అల్లాహ్'. ఏ గురువు చెప్పినా అర్థం కాకపోయినా లేక మరేదైనా చెప్పుకోలేని సమస్య మీకొస్తే డైరెక్టుగా అల్లాహ్‌నే అడగండి. ఆయన వింటాడు. మీకు జవాబు కూడా వస్తుంది. ఆరాధ్యుడిని అర్థం చేసుకుంటే మీరే టాప్ రేంకర్స్.**

## హఖ్ఖ్ [సత్యం] TRUTH

విశ్వం(universe)ని మరియు అందులోని సమస్తాన్నీ సృష్టించి,వాటన్నింటినీ ఓ పద్ధతి ప్రకారం నడిపించేది 'అల్లాహ్'యేనని మీకు తెలుసు.

ఆయన గుణాలను తెలిపే పేర్లు 99 ఉన్నాయి. వాటిని వరుసగా ఈ పత్రిక కవర్ పేజీ లోపలివైపు అందిస్తూనే ఉన్నాము.

ఆ పేర్లలోని ఓ పేరు అల్-హఖ్ఖ్ అల్ అంటే The. హఖ్ఖ్ అంటే Truth (సత్యం). అల్లాహ్ తెలిపేది సత్యం.

**"అల్లాహ్ ఆకాశాలను మరియు భూమిని సత్యం ఆధారంగా సృష్టించాడు ....."** (ఖుర్ఆన్ 29:44)

మనం ఎల్లప్పుడూ నిజమే మాట్లాడాలి. మన ప్రియ ప్రవక్త ముహమ్మద్(స)వారిని సాధిఖ్, అమీన్ అని పిలిచేవారు. ఆయన ఎల్లప్పుడూ సత్యాన్నే పలికారు. ఆయనే మనకు ఆదర్శం. ఆయన పేరు విన్నప్పుడు 'సల్లల్లాహు అలైహి వసల్లం' అని అనాలి. దాని అర్థం ఆయనపై అల్లాహ్ శ్రేయోశుభాలను అనుగ్రహించు గాక! ముహమ్మద్(స)వారిని శత్రువులు సైతం సత్యం, నిజాయితీ విషయాలలో ఆయనను ఎంతో గౌరవించేవారు. నిజమే మాట్లాడటం మరియు నిజాయితీగా బ్రతకడం ఎంత విలువని మనకిస్తాయో మీకర్థమై ఉంటుంది.

వేసవికాలం (సమ్మర్)లో మిట్టమధ్యాహ్నం తారు రోడ్డుపై దూరంగా నీరు ఉన్నట్లు మనకు కనిపిస్తుంది. కాని దగ్గరకు వెళితే అక్కడ నీరు ఉండదు. ఎండ వలన మనకు ఆ విధంగా కనిపిస్తుంది. దానినే ఎండమావి అంటారు. అది ఒక భ్రమ. నిజం కాదు.

ఇదే విధంగా మన కళ్ళకు కనిపించేవన్నీ నిజాలు కాదు. అంతే కాకుండా మన కళ్ళకు కనిపించని నిజాలు కూడా ఎన్నో ఉన్నాయి. ఎండమావి నిజం కాదని దగ్గరకు వెళ్ళి చూశాకనే మనకు తెలిసింది కదా! అదే విధంగా ప్రతీ విషయాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తేగాని లేక అధ్యయనం (study) చేస్తేగాని అది నిజమో లేక అబద్ధమో మనకు తెలియదు.

మనకు న్యూస్ పేపర్లలో మరియు టివి లలో కనిపించే ఎన్నో విషయాలలో నిజం ఉండదు. మన పాఠ్య పుస్తకాల(text books)లో కూడా ఎన్నో అబద్ధాలు ఉన్నాయి. ఇటువంటి వాటిని ఎన్నింటినో ఈ పత్రిక ప్రారంభం నుండి ఈ శీర్షికలో అందించాము. ఉదా: ప్రపంచపు తొలి సైంటిస్ట్ ఇబ్న్ అల్-హైతమ్. ఈ నిజం ప్రపంచానికి తెలియదు. ఈయనే ఆప్టిక్స్(optics)కు పితామహుడు. కాని మీ పాఠ్యపుస్తకాలలో న్యూటన్ అని చదువు కున్నారు. కన్ను(eye) ఏదైనా దృశ్యాన్ని ఎలా చూడగలుగుతుందో స్పష్టంగా వివరించిన ముస్లిమ్ శాస్త్రవేత్త - ఇబ్న్ అల్-హైతమ్.

ఆధునిక సైన్స్‌కి పునాదులు వేసిన గొప్ప శాస్త్రవేత్తలు ముస్లిములే! ఈ నిజం అందరికీ తెలియదు.

అంటే మనం నిజం మరియు అబద్ధాల మధ్య జీవిస్తున్నాము.

**నిజం తెలుసుకుందాం! నిజమే మాట్లాడుదాం!**

నిజమైన దైవం ఎవరో తెలుసుకుని, ఆయన ఆదేశించిన నిజమైన విధానాన్నే మనమంతా ఆచరించాలి.

మన విశ్వంలో కోట్ల సంఖ్యలో గెలాక్సీలు ఉన్నాయి. **మీరు చూశారా?**

ప్రతీ గెలాక్సీలో కోట్ల సంఖ్యలో నక్షత్రాలున్నాయి. **నిజమా?**

కోట్ల సంఖ్యలో నక్షత్రాలున్నాయని తెలియకపోవచ్చేమోగాని, నక్షత్రాలు ఉన్నాయని అందరికీ తెలుసు. ఎందుకంటే రాత్రుళ్ళు వాటిని ఆకాశంలో స్పష్టంగా చూస్తారు కనుక. అవి దూరంగా ఉన్నాయి కనుక మనకు అవి చాలా చిన్నగా కనిపిస్తాయి. మనకు దగ్గరగా ఉండే నక్షత్రం 'సూర్యుడు'. ఈ సూర్యున్ని ప్రతీరోజూ మనం చూస్తూనే ఉంటాము.

నక్షత్రాలు, సూర్యుడు మరియు మనం నివశిస్తున్న ఈ భూమి నిజమని మనకు స్పష్టంగా తెలుసు. చలికాలం వస్తేఎండలో నిలబడాలని అనిపిస్తుంది. సూర్యుని నుండి ఇంకా వేడికావాలని కోరుకుంటాము. మరి వేసవి కాలం వస్తే సూర్యుడు తొందరగా అస్తమిస్తే బావుణ్ణు అని అనుకుంటాము. చల్లదనాన్ని కోరుకుంటాము. వేసవికాలంలో సూర్యుని వేడిని భరించలేం. **ఆ వేడి బాగా ఎక్కువైపోతే ఏమౌతుంది?** భూమిపై ఉండే చెట్లు మాడిపోతాయి. ప్రాణులన్నీ చనిపోతాయి. జీవమనేదే ఉండదు.

మన నివశిస్తున్న ఈ భూమి తిరుగుతూ ఉండటం వల్లనే రాత్రి, పగలు ఏర్పడుతున్నాయి కదా! మరి భూమి తిరగకపోతే కొన్ని దేశాలకు రాత్రి ఉండదు. మరికొన్ని దేశాలకు పగలు ఉండదు.

అంటే మనమంతా క్షేమంగా ఉండాలంటే, భూమి ఎల్లప్పుడూ తిరుగుతూ ఉండాలి. సూర్యుని నుండి కొంత వేడి మాత్రమే వస్తూ ఉండాలి. భూమి వేగంగా తిరిగితే కొన్నిగంటలకే రాత్రి వచ్చేస్తుంది. అదే విధంగా కొన్ని గంటలకే పగలు వచ్చేస్తుంది. **భూమి ఏ వేగంతో తిరగాలో భూమికి ఎలా తెలుసు? మనకు ఎంత వేడి కావాలో సూర్యునికి ఎలా తెలుసు?**

వాటికి తెలియదు. మనకూ తెలియదు. ఈ వ్యవస్థను సృష్టించిన అల్లాహ్‌కే తెలుసు. ఆయనే వాటిని కంట్రోల్‌లో ఉంచారు. మనకోసం వాటిని కంట్రోల్ చేస్తున్న 'అల్లాహ్'కు మనమెంత కృతజ్ఞత చూపాలి?

మనం చలికి వణుకుతుంటే, ఎవరైనా ఓ స్వెట్టర్‌ని ఇస్తే, వారికి కృతజ్ఞత తెలియజేస్తాం. కాని ప్రతీక్షణం మనం జీవించడానికి కారణమైన '**అల్లాహ్**'కి మాత్రం కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నామా? అని ఓ సారి ప్రతీ ఒక్కరూ ఆలోచించాలి.

మనం బ్లేడుతో పెన్సిల్ చెక్కేటప్పుడు, పొరపాటున వ్రేలుకి గాయమై రక్తం కారితే, కాస్సేపటికే రక్తం అక్కడ గడ్డకట్టి రక్తస్రావం ఆగిపోతుంది. గాయం ఉన్న ప్రదేశంలో త్రాంబిన్ అనే ప్రోటీన్ ఉత్పత్తి అవుతుంది. ఈ త్రాంబిన్ ఎంత మోతాదులో ఉత్పత్తి అవ్వాలి అనేది ముఖ్యం. అవసరమైన దానికంటే ఎక్కువగాని తక్కువగాని ఉత్పత్తి కాకూడదు. రక్తాన్ని గడ్డకట్టేలా చేయడానికి మన మెదడు ఈ ఆదేశాలన్నింటిని ఇస్తుంది. ఈ పని మనం చెప్పకపోయినా ఆటోమెటిక్‌గా మెదడు చేసేస్తుంది.

తల్లి తన గర్భంలో బిడ్డను 9 నెలలు మోసి ప్రసవిస్తుంది. ఆ పుట్టిన బిడ్డకు కావలిసిన పోషక పదార్థాలు తల్లి పాలలో ఉంటాయి. బిడ్డకు ఏయే పోషకపదార్థాలు కావాలో ఆ తల్లికి తెలియదు కదా! ఒకవేళ తెలిసినా తన పాలలో వాటిని ఆమె ఏర్పాటు చేసుకోలేదు. ఒకవేళ బిడ్డ ముందుగానే అంటే 9 నెలలు పూర్తి కాకుండానే 7 నెలలకే ప్రసవించబడితే, ఆ బిడ్డకు ఎక్కువ మోతాదులో పోషక పదార్థాలు కావాలి. దానికి తగ్గట్టుగానే ఆ తల్లి పాలలో ఎక్కువ మోతాదులో పోషక పదార్థాలు తయారౌతాయి. ఈ విషయం ఆ తల్లికి తెలియదు.

మన శరీరంలో మనకు తెలియకుండా ఎన్నో పనులు జరుగు తున్నాయి. మనం నిద్రలో ఉన్నాసరే, అవయవాలు కాస్సేపు కూడా రెస్ట్ (విశ్రాంతి) తీసుకోవు. మనకు తెలియకుండా మనలోని ఈ ప్రక్రియలు అన్నింటినీ జరిపించేది ఎవరు?

మరెవరో కాదు, మనందరినీ సృష్టించిన అల్లాహ్‌యే!

కాబట్టి మనం మన తల్లి కడుపులో ఉన్న దగ్గరనుండి, ఈ భూమి మీదకు వచ్చాక, తిరిగి మన మరణం సంభవించే వరకూ మనల్ని ప్రతీ సెకను జీవించేలా చేసేది కేవలం అల్లాహ్‌యే!

మరి ఓ పెన్‌గాని, ఓ పెన్సిల్‌గాని ఇస్తే 'థాంక్స్'అని చెప్పే మనం, ప్రతీ సెకను మనల్ని కాపాడే 'అల్లాహ్'కు **థాంక్స్ చెబుతున్నామా?**

అతి చిన్నవాటికే థాంక్స్ చెప్పే మనం ప్రతీ సెకను అల్లాహ్‌కు థాంక్స్ చెబుతూనే ఉండాలి. ఆయనను ఆరాధిస్తూనే ఉండాలి. అది ఎలా? ఇన్షా అల్లాహ్ వచ్చేసంచికలో చెప్పుకుందాం!

## దువా

**اللَّهُمَّ اغْفِرْلِي وارْحَمْنِي وَاهْدِنِي وَارْزُقْنِي**

(అల్లాహుమ్మగ్‌ఫిర్లీ వర్‌హమ్‌నీ వహ్‌దినీ వర్‌జుఖ్నీ)

**ఓ అల్లాహ్! నన్ను క్షమించు మరియు నాపై కరుణ చూపు మరియు నాకు మార్గాన్ని చూపు మరియు నాకు ఉపాధినివ్వు**




ఓ పల్లెటూరిలో ఒక యువకుడు ప్రతీదానిపై అల్లాహ్ కంట్రోల్ ఉంటుందనే విషయాన్ని తిరస్కరించాడు. తాను అన్నం తిన కూడదని అనుకుంటే అల్లాహ్ తనను తినేలా చేయలేడని ప్రకటించాడు. ఆ విషయాన్ని నిరూపించడానికి, ఒక రోజంతా ఆకలితోనే ఉండి, అల్లాహ్ తనను తినేలా చేయగలడేమో చూస్తానని నిర్ణయించు కున్నాడు. అతని మూర్ఖత్వాన్ని తగ్గించడానికి అతని తల్లి చాలా ప్రయత్నించింది. అయినప్పటికి ఫలితం లేదు. తల్లి ప్రయత్నాలకు చిరాకుపడి, ఆ సాయంత్రం ఓ చెట్టు ఎక్కి విడిగా ఉండాలనుకున్నాడు. ఒకవేళ కొడుకు నిర్ణయం మార్చుకుని తినవచ్చు అని భావించి దయతో ఆహారాన్ని ఆ చెట్టు క్రింద ఉంచి వెళ్ళిపోయింది.

రాత్రివేళ కొంతమంది దొంగలు ఆ చెట్టు ప్రక్క నుండి వెళుతున్నారు. చెట్టు క్రింద రుచికరమైన ఆహారం ఉన్న ప్లేట్ వారి దృష్టిలో పడింది. వారు ఒకరి ముఖాలు ఒకరు ఆశ్చర్యంతో చూసుకుని, ఎవరైనా తమ మీద ట్రిక్ ప్లే చేసి ఉండవచ్చునుకున్నారు. ఎవరైనా మంచి ఆహారం ద్వారా తమకు విషం తినిపించాలని ప్రయత్నిస్తున్నారేమో!

దగ్గరలో ఎవరైనా ఉన్నారేమోనని చుట్టూ చూశారు. చెట్టుపై ఉన్న యువకున్ని గమనించారు. అతనిని దొంగలు క్రిందికి దింపి, అందులో విషం ఉందో లేదో చూడటానికి అతనికి తినమని చెప్పారు.

కాని అతడు తినడానికి తిరస్కరించాడు. అతడు ఇంకనూ అల్లాహ్‌కు వ్యతిరేకంగా చేసిన సవాల్‌పైనే ఉన్నాడు. దొంగలకు అనుమానం కలిగి ఆ యువకున్ని తినమని కొట్టడం ప్రారంభించారు. అతడు తన సవాల్‌ను వదిలేసి తినడం ప్రారంభించాడు. ఆ ఆహారంలో విషం లేదని చూశాక, ఆ యువకున్ని వదిలేసి వెళ్ళిపోయారు. చివరికి, ఆ యువకుడు అంగీకరించాడు, **"ఔను, అల్లాహ్‌కి ప్రతీ దానిపై కంట్రోల్ ఉంది"**.

**"మరియు ఆయన తన దాసులపై సంపూర్ణ అధికారం (ప్రాబల్యం) గలవాడు...."** (ఖుర్ఆన్ 6:18)

**"ఆయన తన దాసులపై సంపూర్ణ అధికారం కలిగి ఉన్నాడు. ..."** (ఖుర్ఆన్ 6:61)

**"... ఏమీ? చాలామంది విభిన్న ప్రభువులు మేలా? లేక, తన సృష్టిపై సంపూర్ణాధికారం గల ఒక్కడైన అల్లాహ్ మేలా?"** (ఖుర్ఆన్ 12:39)

**పై జోక్ కల్పితం కాదని, ఓ వాస్తవ సంఘటన అని వివరిస్తూ మాకు ఓ సోదరుడు పంపించారు. నిజం అల్లాహ్‌కే తెలుసు. జోక్ నిజమైనా కాకపోయినా భావం మీకు బాగా అర్థమై ఉంటుందని భావిస్తున్నాము.**

# ధర్మ సందేశ ప్రచారం

## ఖుర్'ఆన్ మరియు సున్నత్ తెలుగులో

దావా (దావత్ - అల్లాహ్ మార్గంవైపు పిలవడాన్ని) జీవనోపాధిగా చేసుకో కూడదని, వ్యాపారంగా చేసుకో కూడదని, 'దాయీ'గా పిలుపించుకోవడం కంటే 'ముస్లిమ్'గా పిలుపించుకోవడం ఉత్తమమని, దావా అనేది ప్రతి ముస్లిమ్ యొక్క బాధ్యత అని, ఆ బాధ్యతను ప్రవక్త(స)వారు సూచించిన సౌమ్యమైన విధానంలో, మంచి కారెక్టర్‌తో చేయవలసి ఉంది అని ఈ శీర్షికలో అందించిన తొలి 6 వ్యాసాలలో తెలియజేశాము. అవి మా వ్యక్తిగత అభిప్రాయాలు ఎంతమాత్రం కావు. **ప్రతీ విషయానికి ఖుర్'ఆన్ మరియు హదీస్‌లను ఆధారంగా చూపాము.** మనకు ఖాళీ లేదని, డబ్బిచ్చి ఎవరిచేతో మన సలాత్(నమాజ్)ను చేయించుకుంటే, అది మన ఆరాధన ఏవిధంగా కాదో, అదేవిధంగా ఎవరికో డబ్బు ఇచ్చి మన తరపున అల్లాహ్ మార్గంవైపు పిలవమని చెప్పడం కూడా, మనం పిలిచినట్లు కాదని సోదరులు అర్థం చేసుకున్నారు. తులనాత్మక అధ్యయనాలు మరియు ఇతర గ్రంథాలతో దావా చేయడం వంటి ఇస్లామ్ వ్యతిరేక కార్యక్రమాల గురించి కూడా స్పష్టంగా తెలియజేయబడింది.

**8** **కాఫిర్ ☑** ముష్రిక్ ☐

## ముష్రిక్

### అంటే ఎవరు?

*అల్లాహ్ మార్గం వైపు పిలిచే ప్రతీ ముస్లిమ్ ముందుగా కొన్ని అరబీ పదాలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలి. లేకపోతే ఎదుటివారి మనస్సు గాయపడే అవకాశముంది. అంతేకాకుండా, ఎవరెవరితో అల్లాహ్ ఏ విధంగా ప్రవర్తించమన్నారో ముందుగా తెలుసుకుంటే మన బాధ్యతను సక్రమమైన పద్ధతిలో నిర్వర్తించ గలుగుతాము. అందుకే కొన్ని ముఖ్య పదాలను ఒక దాని తరువాత ఒకటిగా ఈ శీర్షికలో ఇన్శాఅల్లాహ్ అందిస్తాము.*

ముహమ్మద్(స)వారు అరేబియాలో ఇస్లామ్ గురించి బోధించక పూర్వం, అక్కడి అరబ్బులు అల్లాహ్‌ని ఆరాధిస్తూనే, కొన్ని విగ్రహాలను కూడా ఆరాధించేవారు. అంటే ఆరాధనలో అల్లాహ్‌తోపాటు విగ్రహాలను కూడా భాగస్వాములుగా చేశారు. అంటే వీరు షిర్క్ చేశారు. కాబట్టి వీరిని 'ముష్రిక్'లు అన్నారు. ఒక్కరి కంటే ఎక్కువమందిని ఆరాధిస్తే వారిని బహుదైవారాధకులు అంటారు. కాబట్టి ముష్రిక్‌లు - బహు దైవారాధకులు.

**"మరియు వారిలో చాలామంది అల్లాహ్‌ని విశ్వసించి కూడా, ఆయనకు సాటి కల్పించేవారున్నారు"** (ఖుర్'ఆన్ 12:106)

అంటే అల్లాహ్‌ను విశ్వసించినంత మాత్రాన సరిపోదు. కేవలం ఆయననే ఆరాధించాలి. కాని అలా చేయకుండా షిర్క్‌కి పాల్పడితే ఏమవుతుందో క్రింది ఆయత్‌లో చెప్పబడింది.

**"నిశ్చయంగా, అల్లాహ్ తనకు సాటి కల్పించడాన్ని (షిర్క్) ఏ మాత్రం క్షమించడు. కాని ఆయన దానిని విడిచి (ఇతర ఏ పాపాన్నైనా) తాను కోరిన వానిని క్షమిస్తాడు! అల్లాహ్‌తో భాగస్వాములను కల్పించేవాడు, వాస్తవానికి దుర్మార్గంలో బహుదూరం వెళ్ళిపోయినట్లే!"** (ఖుర్'ఆన్ 4:116)

అంటే అల్లాహ్ ఇష్టపడితే ఏ పాపాన్నైనా క్షమించవచ్చుగాని, షిర్క్ చేసేవారిని మాత్రం క్షమించనని చెబుతున్నారు. దాని ఫలితం నరకమే!

ఖుర్'ఆన్ అవతరణకు పూర్వం, అరబ్బుల దగ్గర ఏ గ్రంథమూ లేదు. వారు షిర్క్ చేసేవారు. అల్లాహ్ నుండి గ్రంథాన్ని అప్పటికే ఎవరైనా అందుకుని ఉంటే, అటువంటి వారిని గ్రంథప్రజలు అన్నారు. మరి గ్రంథ ప్రజలు (యూదులు మరియు నస్రానీలు) సంగతేమిటి?

**"వారు అల్లాహ్‌ను వదలి తమ మతాచారులను మరియు సన్యాసులను మరియు మర్యమ్ కుమారుడైన మసీహ్‌ను తమ ప్రభువులుగా చేసుకున్నారు. వాస్తవానికి వారు ఒకే ఒక్క దైవాన్ని మాత్రమే ఆరాధించాలని ఆజ్ఞాపించబడ్డారు. ఆయన (అల్లాహ్) తప్ప మరొక ఆరాధ్యదైవం లేడు. ఆయన వారు సాటికల్పించే వాటికి అతీతుడు."** (ఖుర్'ఆన్ 9:31)

వీరు కూడా ఒక్క దైవాన్ని మాత్రమే ఆరాధించాలని ఆదేశించబడ్డారు. కాని వారు కూడా 'షిర్క్' చేశారు.

**ఇలా అను: "ఓ గ్రంథ ప్రజలారా! మాకూ మరియు మీకూ మధ్య ఉమ్మడిగా ఉన్న ధర్మ విషయం వైపునకు రండి, అది ఏమిటంటే: మనం అల్లాహ్ తప్ప మరెవ్వరినీ ఆరాధించకూడదు, ఆయనకు భాగస్వాములను ఎవ్వరినీ నిలబెట్టకూడదు మరియు అల్లాహ్ తప్ప, మన వారిలో నుండి ఎవ్వరినీ ప్రభువులుగా చేసుకోరాదు. వారు (సమ్మతించక) తిరిగి పోతే : "మేము నిశ్చయంగా అల్లాహ్‌కు విధేయు(ముస్లిం)లము. దీనికి మీరు సాక్షులుగా ఉండండి" అని పలుకు."** (ఖుర్'ఆన్ 3:64)

**"ఇబ్రాహీమ్ యూదుడూ కాడు మరియు క్రైస్తవుడూ కాడు! కాని అతను హనీఫ్ (ఏకదైవ సిద్ధాంతంపై ఉన్నవాడు), ముస్లిమ్ (అల్లాహ్‌కు**

**విధేయుడు) మరియు అతడు ఏమాత్రం ముష్రిక్ (అల్లాహ్‌కు సాటి కల్పించేవాడు) కాడు."** (ఖుర్‌ఆన్ 3:67)

అంటే అంతకు పూర్వం గ్రంథం కలవారు 'షిర్క్' చేశారు. గ్రంథం లేని అరబ్బులు కూడా షిర్క్ చేశారు.

గ్రంథంలేని ఆ అరబ్బులకు ముహమ్మద్(స)వారు ఖుర్‌ఆన్ సందేశాన్ని అందించారు. క్రింది ఖుర్‌ఆన్ ఆయత్‌లో ప్రవక్త(స)వారికి అల్లాహ్ ఆదేశిస్తున్నారు :

**"(ఓ ప్రవక్తా!) ఇంకా ఇలా అను: "నిశ్చయంగా, నేను కూడా మీలాంటి ఒక మానవుడనే! నాపై దివ్యజ్ఞానం (వహీ) అవతరింప జేయబడింది. నిశ్చయంగా, మీ ఆరాధ్య దేవుడు ఆ ఏకైక దైవం (అల్లాహ్) మాత్రమే! కావున తన ప్రభువును కలుసుకోవాలని ఆశించేవాడు సత్కార్యాలు చేయాలి మరియు ఆరాధనలో తన ప్రభువుతో పాటు మరెవ్వరినీ భాగస్వాము (షరీక్)లుగా కల్పించు కోరాదు"** (ఖుర్‌ఆన్ 18:110)

ముహమ్మద్(స) వారిచ్చిన ఇస్లామ్ సందేశాన్ని ప్రారంభంలో చాలా కొద్దిమందే స్వీకరించారు.

దాదాపు 23 సంవత్సరాల వ్యవధిలో ఖుర్‌ఆన్ అవతరణ పూర్తయ్యే సరికి, అరేబియాలోని దాదాపు అందరూ ఇస్లామ్ స్వీకరించారు.

ఇంతవరకూ గ్రంథంలేని అరబ్బు విగ్రహారాధకులు మరియు గ్రంథం కలిగిన యూదులు, నస్రానీలు షిర్క్ చేయడం గురించి చెప్పుకున్నాం. **మరి ముస్లిములు కూడా షిర్క్ చేస్తారా?**

'ముస్లిమ్' అంటే అల్లాహ్‌కు విధేయుడు. అంటే అల్లాహ్ ఏమి ఆదేశిస్తే అది చేస్తాడు. అల్లాహ్ యజమాని. ముస్లిమ్ ఆయనకు దాసుడు.

అల్లాహ్ ఆదేశించింది చేయాలి. బాగానే ఉంది. అల్లాహ్ ఏమి ఆదేశించారు?

ఆయన ఆదేశాలన్నీ ఖుర్‌ఆన్‌లో ఉన్నాయి. అవి అర్థం చేసుకోవడంలో మనకు సందేహం లేకుండా తన ప్రవక్త ముహమ్మద్(స)వారి ఆచరణల ద్వారా ఆ ఆదేశాలను ఎలా పాటించాలో మనకు అల్లాహ్ స్పష్టం చేసేసారు.

అంటే నిజమైన ముస్లిమ్ ఖుర్‌ఆన్ ప్రకారంగా జీవించాలి.

**మరి అలా జరుగుతుందా?**

ఎక్కడో జరిగే విషయాలను చెప్పుకునే కంటే, ఇది తెలుగు పత్రిక కాబట్టి మన రాష్ట్రంలోని ముస్లిమ్‌ల పరిస్థితి గురించి చెప్పుకుందాం. ఇక్కడి ముస్లిముల సాంప్రదాయంలో ఇతర సాంప్రదాయాలు కలిసిపోయాయి.

మన రాష్ట్రంలోని ముస్లిమ్‌లలో ఎంతమందికి 'ఖుర్‌ఆన్' గురించి తెలుసు? ఖుర్‌ఆన్ గురించి తెలిసినా, ఎంతమంది తమ జీవితంలో ఒక్కసారైనా ఖుర్‌ఆన్‌ను చూసి ఉంటారు లేదా తెరచి ఉంటారు.

ఖుర్‌ఆన్ గ్రంథాన్ని మరియు అరబీ భాషలో ఉండే మరో పుస్తకాన్ని ఎవరైనా ప్రక్కప్రక్కన పెడితే, వాటిలో ఏది ఖుర్‌ఆన్ గ్రంథమో ఎంతమంది ముస్లిములు గుర్తించ గలుగుతారు?

చాలామంది కూతురుకి పెళ్ళి చేసాక, అత్తవారింటికి పంపేటప్పుడు ఖుర్‌ఆన్‌ను కూడా కానుకగా ఇస్తారు. ఆ గ్రంథంతో పాటు రకరకాల పిండివంటలు, టి.వి., ఫ్రిజ్, గ్యాస్ స్టవ్ మొదలైనవి వారి స్తోమతను బట్టి ఇస్తారు.

ఇచ్చిన పిండివంటలను అందరూ తింటారు. టి.వి.ని ఆన్ చేస్తారు. ఫ్రిజ్‌ను మరియు గ్యాస్ స్టవ్‌ను ఉపయోగిస్తారు. మరి ఖుర్‌ఆన్ సంగతేమిటి? దానిని మాత్రం ఉపయోగించరు. ఖుర్‌ఆన్‌ను అటకెక్కిస్తారు. అందుకోసమేనా అల్లాహ్ ఖుర్‌ఆన్ పంపారు?

పెళ్ళి సంబంధాలు మాట్లాడుకునేటప్పుడు, 'మా అమ్మాయి ఖుర్‌ఆన్ పూర్తి చేసింది' అని చెబుతారు. అంటే ఖుర్‌ఆన్ గ్రంథాన్ని అరబీలో ఆమె చదవగలదు. ఇరువైపుల వారికి ఆ మాత్రం చాలు.

"మీ అమ్మాయికి వంట తెలుసా?" అని అడిగితే "వంటల ఎలా చేయాలో తెలిపే పుస్తకాన్ని ఒకసారి చదివేసిందండి" అని చెబితే అబ్బాయి తరపువారు 'మాకు అది చాలు' అని సంబరపడిపోతారా?

"వంటలు ఎలా చేయాలో చదివితే ఎలా సరిపోతుంది? అది చేయగలగాలి కదా!" అని విమర్శిస్తారు. ఖుర్‌ఆన్ గ్రంథం చదివితే సరిపోదు, దానిలోని అల్లాహ్ ఆదేశాల ప్రకారం మనం ఆచరించాలని మాత్రం కోడలికి చెప్పరు.

ధార్మిక విషయాలు నేర్చుకోమని చెబితే నేటి స్త్రీలు, 'బయటకి వెళ్ళి నేర్చుకోవడం చాలా కష్టం. ఇంటి పనులతో ఖాళీ ఉండదు' అంటారు. బట్టల దుకాణానికి వెళితే వారికి సమయమే సమయం. టి.వి. చూడటానికి అయితే కావలిసినంత సమయం ఉంటుంది. సినిమాలకు, సెలవలు వస్తే ఊర్లు తిరగడానికి సమయం వస్తుంది. కాని కొద్ది రోజుల పాటు ధార్మిక విషయాలు నేర్చుకోవాలంటే మాత్రం వీరికి సమయం చిక్కదు.

ఈ రాష్ట్రంలోని ప్రతీ ముస్లిమ్ మహిళకు, పురుషునికి తెలుగు బాగా తెలుసు. వారిలో కొందరు తెలుగు చదవలేకపోయినా, సులభంగా అర్థం చేసుకో గలుగుతారు. జీవితంలో ఒక్కసారైనా పూర్తిగా ఖుర్‌ఆన్ గ్రంథంలో ఏమి చెప్పబడిందో తమకు అర్థమయ్యే భాషలో తెలుసుకున్నవారు 100 మంది ముస్లిములలో కనీసం ఒక్కరైనా ఉన్నారా?

మరి వీరందరూ మన జనాభా లెక్కలలో 'ముస్లిములు'గానే నమోదు అయ్యారు.

ఇటువంటి నేపథ్యంలో, **ముస్లిములు షిర్క్ చేస్తారా?** అని అడిగితే ఏమి చెప్పగలం? ముస్లిములు అంటే అల్లాహ్‌కు విధేయత చూపేవారు అని తెలియని వారికి, ఖుర్‌ఆన్ ప్రకారంగా జీవించాలని తెలియని వారికి **'షిర్క్' అంటే మాత్రం ఏమి తెలుస్తుంది?**

సలాత్(నమాజ్) చేయడం తెలిసిన ప్రతీ ముస్లిమ్, ప్రతీ రకాత్‌లో 'సూరహ్ అల్-ఫాతిహా' (అల్‌హమ్దు లిల్లాహి సూరహ్) చదువుతాడు. అందులో ప్రతీ ముస్లిమ్ ఏమి పలుకుతున్నాడు? **'ఇయ్యాకన అబుదు వ ఇయ్యాక నస్తయీన్'**. అంటే **'నిన్నే ఆరాధిస్తున్నాము మరియు సహాయానికై నిన్నే అర్థిస్తున్నాము'**.

అల్లాహ్‌నే ఆరాధిస్తున్నామని, సహాయంకొరకు ఆయననే వేడు కుంటున్నామని చెబుతూ, ఆ పనులు మనం చేయకపోతే మోసం చేస్తున్నట్లే కదా! ఇక్కడ మోసపోయేది అల్లాహ్ కాదు. తామే స్వయంగా మోసపోతున్నారు.

మనకు సహాయం అవసరమైనప్పుడు 'అల్లాహ్' కాకుండా, మరెవరో గుర్తుకు వస్తే, అల్లాహ్‌కు సాటికల్పిస్తున్నట్లే కదా! అటువంటి వారు చేసేది 'షిర్క్'.

అరేబియాలో తిరిగి ఇస్లామ్ ఆవిర్భవించక పూర్వం, కష్ట సమయాలలో విగ్రహాలను పూజించే అరబ్బులు సైతం 'అల్లాహ్'నే గుర్తు చేసుకున్నారు. ఆ కష్టాన్ని దాటేవరకూ విగ్రహాలను వదిలేసేవారు. ఈ సంచికలో 23వ పేజీ చూడండి.

**మరియు వారిని సముద్రపు అల, మేఘంగా క్రమ్ముకున్నప్పుడు వారు పరిపూర్ణ భక్తితో అల్లాహ్‌నే వేడుకుంటారు. కాని ఆయన వారిని రక్షించి ఒడ్డుకు చేర్చిన తరువాత వారిలో కొందరు (విశ్వాస-అవిశ్వాసాల) మధ్య ఆగిపోతారు. మరియు మా సూచనలను, కేవలం విశ్వాస ఘాతకులు, కృతఘ్నులైన వారు మాత్రమే తిరస్కరిస్తారు** (ఖుర్‌ఆన్ 31:32)

**వారు నావలోకి ఎక్కినప్పుడు తమ భక్తిని కేవలం అల్లాహ్‌కు మాత్రమే ప్రత్యేకించుకుని, ఆయననే ప్రార్థిస్తారు, కాని ఆయన వారిని రక్షించి నేలమీదకు తీసుకురాగానే ఆయనకు సాటి కల్పించసాగుతారు** (ఖుర్‌ఆన్ 29:65)

ఇక్రిమ(రజి) మక్కా విజయం సమయంలో మక్కా విడిచి పారిపోతాడు. అతడు ఒక నావలో ఎక్కి పోతూ ఉండగా అది ప్రమాదంలో చిక్కుకుంటుంది. దానిలో ఉన్నవారు పరస్పరం ఇలా చెప్పుకుంటారు : "అల్లాహ్‌ను వేడుకోండి ఆయన తప్ప మమ్మల్ని మరెవ్వరూ కాపాడలేరు." అప్పుడు అతడు ఆలోచిస్తాడు "సముద్రంలో అల్లాహ్ తప్ప మరొకరు కాపాడలేకుంటే నేలపై కూడా ఇతరులెవ్వరూ కాపాడలేరు. ఒకవేళ తాను ఇక్కడనుండి బ్రతికి బయటపడితే దైవప్రవక్త(స) సన్నిధిలోకి పోయి ఇస్లామ్ స్వీకరిస్తాను" అని అనుకుంటాడు. అదే విధంగా జరుగుతుంది. అతడు (రజి) ఇస్లామ్ స్వీకరించి ఇస్లామ్ ప్రచారంలో చాలా పాటుపడ్డాడు. (తఫ్సీర్ ఇబ్నె కసీర్)

మనం జీవించడానికి ఉపాధి కల్పించేవాడు - అల్లాహ్ **(అర్రజ్జాఖ్)**. కాని ఉద్యోగానికి ఇంటర్వ్యూకి వెళ్ళేటప్పుడు ఉపాధి దొరికేలా చేయమని అల్లాహ్‌కే మొక్కు కుంటున్నారా? అల్లాహ్‌నే వేడుకుంటున్నారా?

**"(ఓ ముహమ్మద్!) ఇలా అను : "ఏమీ? ఆకాశాలు మరియు భూమి సృష్టికి మూలాధారుడు అయిన అల్లాహ్‌ను కాదని నేను మరెవరినైనా ఆరాధ్యునిగా చేసుకోవాలా? మరియు ఆయనే అందరికి ఆహారమిస్తున్నాడు. మరియు ఆయనకెవ్వడూ ఆహార మివ్వడు" ఇలా అను: "నిశ్చయంగా, అందరికంటే ముందు నేను ఆయన (అల్లాహ్)కు విధేయుడను (ముస్లిమును) కావాలని మరియు ఆయన (అల్లాహ్)కు సాటికల్పించే వారిలో చేరకూడదనీ ఆదేశించబడ్డాను!"** (ఖుర్‌ఆన్ 6:14)

మానవుడే కాకుండా సమస్త జీవాలు ఆహారాన్ని పొందగలుగు తున్నాయంటే దానికి కారణం అల్లాహ్. కాని 'ఫలానా వ్యక్తి దయవలన ఈ రోజు నా ఆకలి తీరింది' అని అనుకుంటే, అది 'షిర్క్' అవుతుంది.

**కేవలం విగ్రహాలను పూజించేవారే 'షిర్క్' చేస్తున్నారనే అపోహలో చాలామంది ముస్లిములున్నారు. అత్యధిక శాతం ముస్లిములు మన దేశంలో ఏదో ఒక రూపంలో 'షిర్క్' చేస్తున్నారు.**

## ఖుర్‌ఆన్ జ్ఞానమున్నవారు కూడా షిర్క్ చేస్తారా?

మన దేశంలోని ఏ పౌరుడికైనా 'అవినీతి' అనే పదం గురించి కొత్తగా మనం పరిచయం చేయనవసరం లేదు. అవినీతిపరులలో చదువుకోనివారు మాత్రమే కాకుండా, ఐ.పి.యస్., ఐ.ఏ.ఎస్., ఇంజినీరింగ్ మొదలైన వాటికి చెందిన విద్యావేత్తలు కూడా ఉన్నారు.

అదే విధంగా ఖుర్‌ఆన్ జ్ఞానం ఉన్నవారిలో మరియు జ్ఞానం లేనివారిలో కూడా షిర్క్ చేసేవారు ఉన్నారు.

అల్లాహ్ యొక్క గుణాలను తెలిపే 99 పేర్లు ఖుర్‌ఆన్‌లో ఉన్నాయి. ఆ పేర్లను వరుసగా 'శాంతిబాట' పత్రికలో అందిస్తున్నాము. వాటిని అర్థం చేసుకుంటే చేస్తున్న షిర్క్ గురించి చాలా వరకూ అర్థమౌతుంది.

నేడు పుట్టగొడుగుల్లా చాలామంది దాయీలు తయారౌతున్నారు. వీరు చెబుతుంటారు, 'నేను ఫలానా చోట ప్రసంగించాను. లక్షలాది మంది జనం వచ్చారు. నా ప్రసంగం విని చాలామంది స్పాట్‌లోనే ఇస్లామ్ స్వీకరించారు'. వారు అక్కడే ఇస్లామ్ స్వీకరించడం నిజమేనని కాస్సేపు అనుకుందాం! ఈ దాయీ మాటలను బట్టి వారిని మార్చివేసింది తన ప్రసంగమని అతను నమ్ముతున్నాడు.

ఒకరికి మార్గం చూపేది 'అల్లాహ్'యేనని ఖుర్‌ఆన్ జ్ఞానం ఉన్న ప్రతీ ఒక్కరికీ తెలుసు. సకల లోకాలకు కారుణ్యంగా పంపబడిన తన ప్రియ ప్రవక్త ముహమ్మద్(స)వారికే ఆ శక్తి నివ్వలేదు. ఆ శక్తి కేవలం అల్లాహ్‌కే ఉంది. కాని నేటి దాయీ తనను అల్లాహ్‌తో సమానంగా పోల్చు కుంటున్నాడా?

సోదరసోదరీమణులారా! మీరు మాత్రం దాయీలు కాకండి. **ముస్లిములు కండి.** ముస్లిముగా జీవిస్తేనే, అల్లాహ్ యొక్క సందేశం అందించడం మన బాధ్యత అని తెలుస్తుంది. ముస్లిమ్ పేరు మనకు అల్లాహ్ పెట్టారు. ఎవరడిగినా ముస్లిమ్ అనే చెబుదాం. ఆ పదానికే పూర్తి గౌరవం ఉంది. నమాజీ, హాజీ, రోజ్‌దార్, వెజిటేరియన్, నాన్ వెజిటేరియన్ ఇలా పిలుపించుకోవడంలో మనకు పూర్తి గౌరవం లేదు.

అల్లాహ్ ఓ వ్యక్తికి మార్గం చూపాలనుకుంటే, ఎలాగైనా చూపిస్తాడు. మాకు ఒకరు చెప్పారు, తనకు ఓ కల వచ్చిందని. అప్పటి నుండి 'ఇస్లామ్' గురించి అధ్యయనం చేయాలనిపించిందని, ఆ విధంగా ఇస్లామ్ స్వీకరించినట్లు చెప్పారు.

అల్లాహ్ తలచుకుంటే ఏమీ తెలియని వెర్రివానిచేత మాట్లాడించి కూడా మార్గం చూపించగలడు. ఆయన సర్వశక్తిమంతుడు ప్రతీదీ చేయగలడు. అల్లాహ్‌తో పోల్చుకుని ఫిరౌన్ సర్వనాశనమయ్యాడు.

## నమాజ్ స్వీకరించబడదా?

కొందరు అంటారు, 'నీ నమాజ్ స్వీకరించబడదు', 'వాడు స్వర్గానికి పోతాడు', 'వీడు నరకానికి పోతాడు'.

వాటిని నిర్ణయించేది ఎవరు? 'అల్లాహ్'యా? లేక వారా?

పై విధంగా మాట్లాడినవారు ఘోరమైన షిర్క్ చేసినట్లు కాదా? మరణించేవాడు చివరి క్షణంలో ఎలా మరణిస్తాడో ఎవరికి తెలుసు? ముస్లిముగా జీవితాంతం బ్రతికి, మరణం దగ్గరైనప్పుడు అతడు షిర్క్ చేయవచ్చు లేదా జీవితాంతం షిర్క్‌కు పాల్పడి, చివరి దశలో ఇస్లామ్ స్వీకరించి ముస్లిముగా మరణించవచ్చు. ఎవరు నిజమైన ముస్లిమ్, ఎవరిలో ఈమాన్(విశ్వాసం) ఉందో, పరలోకంలో ఎవరి గతి ఎలా ఉంటుందో కేవలం అల్లాహ్‌కి మాత్రమే తెలుసు.

## ఎవరి దువా అల్లాహ్ స్వీకరిస్తాడు?

ధర్మ పరాయణుడైన ఓ ముస్లిమ్ దగ్గరికి వెళ్ళి, తమ కోసం దువా చేయమని కోరతారు. అటువంటి వారు దువా చేస్తే అల్లాహ్ స్వీకరిస్తారనే నమ్మకం వారిది. క్రింది హదీస్‌ను చదవండి :

أَخْبَرَنَا قُتَيْبَةُ : حَدَّثَنَا مُحَمَّدُ بْنُ عُبَيْدٍ عَنْ يَزِيدَ بْنِ كَيْسَانَ، عَنْ أَبِي حَازِمٍ، عَنْ أَبِي هُرَيْرَةَ قَالَ : زَارَ رَسُولُ اللهِ ﷺ قَبْرَ أُمِّهِ فَبَكَى وَأَبْكَى مَنْ حَوْلَهُ وَقَالَ : ((اسْتَأْذَنْتُ رَبِّي عَزَّ وَجَلَّ فِي أَنْ أَسْتَغْفِرَ لَهَا فَلَمْ يُؤْذَنْ لِي، وَاسْتَأْذَنْتُ فِي أَنْ أَزُورَ قَبْرَهَا فَأَذِنَ لِي فَزُورُوا الْقُبُورَ فَإِنَّهَا تُذَكِّرُكُمُ الْمَوْتَ))

అబూహురైరా (రజి) ఉల్లేఖనం : "అల్లాహ్ యొక్క సందేశహరులు(స) తన తల్లిగారి సమాధి దగ్గరికెళ్ళి విలపించారు (ఆ రోదనకి) ఆయన చుట్టూ ఉన్న వారు కూడా విలపించారు. ఆయన(స) అన్నారు : 'నేను నా ప్రభువును ఆమె క్షమాపణ కొరకు అనుమతి నడిగాను మరియు ఆయన నాకు అనుమతి నివ్వలేదు. మరియు ఆమె సమాధిని దర్శించడానికి అనుమతి నడిగాను, ఆయన నాకు అనుమతి నిచ్చారు. కనుక సమాధులను దర్శించండి మీకు చావును గుర్తు చేసేందుకు. **(నసాయీ, నెం. 2036 (సహీహ్), 21వ పుస్తకం, అధ్యా. 101, సంపుటి 3)**

ముహమ్మద్(స)వారు దువా చేస్తే అల్లాహ్ అంగీకరిస్తారు. కాని ఆయన(స)కు తన తల్లిగారి గురించి పాప క్షమాపణ కొరకు దువా చేసుకోవడానికి అల్లాహ్ అనుమతి నివ్వలేదు. ఎందుకంటే ప్రవక్త(స)వారి మాతృమూర్తి ముష్రిక్. సకల లోకాలకు కారుణ్యంగా ఈ భూమిపైకి పంపబడిన ఆ మహనీయుడు కన్నతల్లి కోసం దువా చేయలేకపోయారంటే, షిర్క్ చేసేవారు ఆలోచించు కోవాలి.

షిర్క్ చేస్తూ 'అల్లాహ్'ను అవమానించేవారు ఇహలోకంలోగాని, పరలోకంలోగాని శుభాలను ఎలా పొందగలరు?

షిర్క్‌ను అల్లాహ్ క్షమించనని చెప్పారు. కాబట్టి అన్నిరకాల షిర్క్‌కు దూరంగా ఉండండి.

ప్రవక్త(స)వారు జీవించి ఉండగా, ఆయన(స) తన అనుచరులలో కొందరికి స్వర్గ శుభవార్త ఇచ్చారు. వారికి స్వర్గం గ్యారంటీ. కాని ఆ అనుచరులు ఎంతో దైవభీతితో, ఎంతో అణుకువతో బ్రతికారు. అహంకారాన్ని దరిదాపులకు రానివ్వకుండా ధర్మపరాయణులుగా జీవించారు. వీరికి జ్ఞానం ఉంది.

"నిశ్చయంగా, అల్లాహ్ యొక్క దాసులలో **జ్ఞానం గలవారు మాత్రమే ఆయనకు భయపడతారు**. నిశ్చయంగా అల్లాహ్ సర్వశక్తిమంతుడు, క్షమాశీలుడు" (ఖుర్ఆన్ 35:28)

అల్లాహ్ అంటే భయంలేనివాడికి జ్ఞానం లేనట్లే. ఎండమావిలో నీరు లేనట్లు. ధార్మిక విషయాలను నేర్చుకుని జ్ఞానం సంపాదించు కున్నవాడు దైవభీతి లేకుండా డబ్బు కోసం పనిచేస్తే అతనికి జ్ఞానం లేనట్లే!

ఖుర్ఆన్‌ను అర్థంతో సహా చదువుతూ ఉండండి. షిర్క్‌కు దూరంగా ఉండండి. 'అల్లాహ్' పేరును అనువాదంలో తొలగించిన ఖుర్ఆన్ అనువాద గ్రంథాలను కాకుండా, 'అల్లాహ్' అనే పేరును 'అల్లాహ్' అని ఉంచిన అనువాద గ్రంథాలనే అర్థం చేసుకోవడానికి ఉపయోగించండి.

మన సమాజం షిర్క్ రహిత ముస్లిమ్ సమాజం కావాలని అల్లాహ్‌ను వేడుకుంటున్నాము (ఆమీన్).

'అల్లాహ్' తన పేరును అల్లాహ్ అని స్పష్టంగా ఖుర్ఆన్ ద్వారా తెలియజేశాక కూడా, ఆయన పేరుకు బదులుగా తమకు ఇష్టమైన ఏదో ఒక పేరు పెట్టి, ఆ పేరు కూడా అల్లాహ్‌కు సమానమే అని చెప్పడం, షిర్క్ అవుతుందో? కాదో? ఈ వ్యాసం చదివినవారు ఆలోచించండి.

కొందరు బయట తాము ముస్లిములమని చెప్పుకుంటారు. గ్రంథం పేరు ఖుర్ఆన్ అని వ్రాస్తారు. కాని అల్లాహ్ పేరు వ్రాయడానికిగాని, చెప్పడానికిగాని ఎందుకు సంశయిస్తున్నారు? అది సంశయమా? లేక మోసపూరిత పన్నాగమా?

ప్రతీ ప్రవక్త కూడా, అల్లాహ్‌ని 'అల్లాహ్'అనే సంభోదించారు. మూసా(అ) హెబ్రూ భాషలో 'అల్లాహ్' అని చెప్పారు. ఈసా(అ) తన మాతృభాష అయిన అరమాయిక్ భాషలో 'అల్లాహ్' అనే చెప్పారు. ఆ భాషలో ఆరాధ్యునికి పేరు 'అల్లాహ్' మాత్రమే ఉంది. శాంతిబాట సంచికలు 5 మరియు 6 చూడండి. మా వెబ్‌సైట్ www.saanthibaata.net లో **'సకల లోకాలను సృష్టించిన ఆ సృష్టికర్త పేరు ఏమిటి?'** పుస్తకం చదవండి.

ఆయనే, మిమ్మల్ని ఒకే వ్యక్తి నుండి సృష్టించాడు మరియు అతని నుండియే జీవిత సౌఖ్యం పొందటానికి అతని భార్యను పుట్టించాడు. అతను ఆమెను కలుసుకున్నప్పుడు, ఆమె ఒక తేలికైన భారాన్ని ధరించి దానిని మోస్తూ తిరుగుతూ ఉంటుంది. పిదప ఆమె గర్భ భారం అధికమైనప్పుడు, వారు ఉభయులూ కలిసి వారి ప్రభువైన అల్లాహ్‌ను ఇలా వేడుకుంటారు : "నీవు మాకు మంచి బిడ్డను ప్రసాదిస్తే మేము తప్పక నీకు కృతజ్ఞతలు తెలిపే వారమవుతాము!"

ఆయన వారికి ఒక మంచి బిడ్డను ప్రసాదించిన పిదప వారు, ఆయన ప్రసాదించిన దాని విషయంలో ఆయనకు సాటి (భాగస్వాములను) కల్పించ సాగుతారు. కాని వారు కల్పించే భాగస్వాముల కంటే అల్లాహ్ మహోన్నతుడు.

ఏమీ? దేనినీ కూడా సృష్టించలేని మరియు (స్వయంగా) తామే సృష్టించబడిన వారిని, వారు ఆయనకు సాటి (భాగస్వాములు)గా కల్పిస్తారా?

మరియు వారు, వారికి ఎలాంటి సహాయం చేయలేరు. మరియు తమకు తాము కూడా సహాయం చేసుకోలేరు.

మరియు మీరు వారిని సన్మార్గానికి పిలిచినా, వారు మిమ్మల్ని అనుసరించలేరు. మీరు వారిని పిలిచినా, లేక మౌనం వహించినా మీకు సమానమే!

నిశ్చయంగా, మీరు అల్లాహ్‌ను విడిచి ఎవరినైతే పిలుస్తున్నారో, వారు కూడా మీలాంటి దాసులే! మీరు వారిని పిలవండి, మీరు సత్యవంతులే అయితే మీ పిలుపుకు వారు సమాధానమివ్వాలి.

ఏమీ? వారికి కాళ్ళున్నాయా, వాటితో నడవటానికి? లేదా వారికి చేతులున్నాయా, వాటితో పట్టుకోవటానికి? లేదా వారికి కళ్ళున్నాయా, వాటితో చూడటానికి? లేదా వారికి చెవులున్నాయా, వాటితో వినటానికి? వారితో అను : "మీరు సాటి కల్పించిన (భాగస్వాములను) పిలవండి. తరువాత మీరంతా కలిసి నాకు వ్యతిరేకంగా కుట్రలు (వ్యూహాలు) పన్నండి, నాకు గడువు కూడా ఇవ్వకండి.

"నిశ్చయంగా, ఈ గ్రంథాన్ని అవతరింపజేసిన అల్లాహ్‌యే నా సంరక్షకుడు, ఆయనే సద్వర్తనులను మిత్రులుగా చేసుకుంటాడు.

"మరియు ఆయనను విడిచి మీరు వేడుకునే వారు మీకు ఏ విధమైన సహాయం చేయలేరు. మరియు వారు తమకు తాము కూడా సహాయం చేసుకోలేరు.

"మరియు మీరు వారిని సన్మార్గానికి పిలిచినా వారు వినలేరు. మరియు వారు నీ వైపుకు చూస్తున్నట్లు నీవు భావిస్తావు, కాని వారు చూడలేరు".

(ఖుర్ఆన్ 7:189-198)

మరియు అల్లాహ్ ఆయతులు, నీపై అవతరింపజేయబడిన తరువాత, వారు వాటి నుండి నిన్ను ఏమాత్రం తొలగింప నివ్వరాదు. మరియు (ప్రజలను) నీ ప్రభువు వైపునకు ఆహ్వానించు. మరియు నీవు బహుదైవారాధకులలో చేరిపోకు. (28:87)

**మరియు నీ ప్రభువు కోరితే, భూమిలో ఉన్న వారందరూ విశ్వసించేవారు. ఏమీ? నీవు మానవులందరినీ విశ్వాసులయ్యే వరకు, వారిని బలవంతం చేస్తూ ఉంటావా? మరియు ఏ వ్యక్తి అయినా సరే అల్లాహ్ అనుమతి లేనిదే విశ్వసించ జాలడు. జ్ఞానాన్ని ఉపయోగించని వారిపై ఆయన మాలిన్యాన్ని రుద్దుతాడు.** (ఖుర్ఆన్ 10:99-100)

# పాఠకుల అభిప్రాయాలు

**ఖుత్బా ప్రసంగాలు ...**

ప్రారంభం నుండి మాసపత్రికలోని విషయాలను జుమ్మా నమాజ్ ప్రసంగాలలో చెబుతున్నామని ఎందరో సోదరులు తెలియజేశారు. కొన్ని చోట్ల ఈద్ నమాజ్ ప్రసంగాలకు కూడా శాంతిబాట ఉపయోగ పడుతుందని సమాచారం అందింది. అల్‌హమ్‌దులిల్లాహ్! ఈ పత్రిక కొరకు ఎంతో పరిశోధన జరుగుతూ ఉంది. మేము ఇచ్చే హదీస్ అనువాదాలను మరలా మీరొకసారి సులభంగా చెక్ చేసుకునే విధంగా, హదీస్ నంబర్, అధ్యాయం నంబర్ మొ॥న ప్రామాణిక వివరాలను కూడా స్పష్టంగా అందిస్తున్నాము. ఈద్ సందర్భంగా గాని లేదా శుక్రవారం మస్జిద్‌లో ఇచ్చే ప్రసంగాలు, ముస్లిములకు ధార్మిక శిక్షణకై ఉపయోగ పడేలా ఉండాలి. ఆయా ప్రాంతాలలో జరుగుతున్న ఇస్లామ్ వ్యతిరేక కార్యకలాపాల నుండి ముస్లిములను తప్పించడానికి కూడా ఈ ప్రసంగాలు దోహదపడాలి.

**ముహమ్మద్(స)వారి జీవిత చరిత్ర**

ఈ శీర్షికను ముహమ్మద్(స)వారి జననంతో ప్రారంభించకుండా, విశ్లేషణలతో కూడిన అరబ్బు సామాజిక విషయాలను అందిస్తున్న విధానం బావుందని కొందరు సోదరులు అభిప్రాయపడితే, ప్రవక్త(స)వారి జననంతోనే ప్రారంభిస్తే బావుండేదని మరో సోదరుడు అభిప్రాయ పడ్డారు. ఈ వివరాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. ఎప్పుడూ వెలుగులో ఉన్నవాడికి వెలుగు విలువ తెలియదు. చీకటిలో ఎప్పుడూ జీవించే వాడికే దాని విలువ అర్ధమౌతుంది.

'ఇస్లామ్' చూపిన ప్రభావం తెలుసుకోవాలంటే, అల్లాహ్ తన చిట్ట చివరి ప్రవక్తను అరబ్ జాతిలోనుండే ఎందుకు లేపారో తెలుసుకోవాలి. ప్రళయం వరకూ ఆచరణలో ఉండే చిట్టచివరి సంపూర్ణ దివ్యగ్రంథం ఖుర్ఆన్‌ను అరబీ భాషలోనే అవతరింపజేశారో తెలుసుకోవాలి. ఈ వివరాలు తెలుసు కోవడం చాలా అవసరం. అందమైన ఇల్లు మనం చూస్తాము. కాని ఆ అందమైన ఇంటిని స్థిరంగా నిలబెట్టిన పునాదులు మనకు కనిపించవు.

ఆనాడు ఇస్లామ్ తిరిగి ఆవిర్భావానికి ముందు రోజులలో, అంటే అజ్ఞాన కాలంలో కొందరు కూతురు పుడితే పాతిపెట్టేవారు. ఈనాడు భారత దేశంలో స్కానింగ్‌లో ఆడపిల్ల అని తెలిస్తే అబార్షన్ చేయిస్తున్నారు. ఈ మధ్యనే వైజాగ్‌లో ఓ కుటుంబం (ముస్లిములు కాదు) తమ పసిబిడ్డని సజీవంగా పాతిపెట్టారు. ఈ రెండు పనులు ఒకేలా కనిపిస్తున్నా, అజ్ఞానకాలంలో ఆనాడు ఓ అరబ్బు చేసిన దానికి మరియు ఈ రోజున ఓ భారతీయుడు చేసినదానికి మధ్య కారణాలు ఒకటి కాదు.

స్వేచ్ఛగా బ్రతకడానికి ఇష్టపడే ఆనాటి అరబ్బు వ్యక్తి, ఒకరి ఆధీనంలో తలవంచడు. చంపుతాడు లేదా చస్తాడుగాని ఎవరికీ బానిసగా ఉండడు. తన ఆత్మగౌరవానికి దెబ్బ తగిలితే భరించలేడు. కాని వారి ఆచారం ప్రకారం అల్లుడు ముందు 'కత్తి' దూయలేరు. అల్లుడితో యుద్ధం చేయలేరు. అది వారికి ఎంతో అవమానంగా ఉండేది. అందుకని కూతురు పుడితే అవమానంగా భావించేవారు. ఇది నిజంగా నెగిటివ్ విషయమే అయినా సరే, ఇందులో మెచ్చుకోవలసిన విషయాలు రెండు ఉన్నాయి. 1. ఆత్మ గౌరవం కోసం తలదించకపోవడం. అందుకే ఏ సామ్రాజ్యాధినేత కూడా అరబ్బులపైకి రాలేదు. 2. అల్లుడు ముందు కత్తి తీయకూడదనే ఆచారాన్ని ఉల్లంఘించక పోవడం. అంటే ఓ నియమాన్ని ఏర్పరచు కున్నారంటే, దానిని ఎట్టి పరిస్థితులలోనూ ఉల్లంఘించరు. ప్రపంచంలో ఏ జాతికీ లేని భాషాభిమానం వారికి ఉంది.

ఆనాటి అరబ్బుల యొక్క కొన్ని విషయాలను సరిగ్గా అర్థం చేసుకోక పోవడం వలన, వారి యొక్క ఎన్నో సుగుణాలు మరుగున పడిపోయాయి. అవి చాలా ముఖ్యమైనవి.

ఈనాడు మస్జిద్‌లు కట్టడానికి చందా వసూలుచేస్తున్నారు. కాని ఆ చందా 'హలాల్' సంపాదన గలవారి దగ్గరి నుండే కాకుండా 'హరామ్' మార్గంలో సంపాదించేవారి నుండి కూడా సేకరించబడుతుంది. కాని ఆనాడు, అరబ్బు ముష్రిక్‌లు కాబా మస్జిద్ యొక్క ఒక గోడను పూర్తిగా కట్టలేకపోయారు. కొద్దిగా వదిలేసారు. కారణం వారి దగ్గరున్న హలాల్ డబ్బు సరిపోలేదు. అంటే వారి దగ్గర డబ్బు లేక కాదు. హలాల్ మార్గంలో సంపాదించిన డబ్బు సరిపోక ఆ గోడను పూర్తిగావించలేదు. మరి ఆనాటి అరబ్బు ముష్రిక్‌లు తీసుకున్న జాగ్రత్తలు, నేటి ముస్లిములు ఎందుకు తీసుకో లేకపోతున్నారు? అజ్ఞానకాలంలోనే వారు అలా ప్రవర్తిస్తే, జ్ఞానాన్ని పొందిన తరువాత మన ప్రవర్తన ఎలా ఉండాలి?

ఇటువంటి ఎన్నో విషయాలలో మనకు ఒక అవగాహన రావాలంటే, కొన్ని వివరాలు చెప్పడం తప్పనిసరి.

**సహజీవనం**

ఈ విషయంపై వెంటనే స్పందన వచ్చింది. వారి అనుభవాలను మాకు చెప్పారు. కాని ఆ విషయాలు ఇక్కడ అందించలేము. సమాజం యుక్త వయస్సుకు వచ్చిన పిల్లలను కాపాడుకోవడానికి ఇప్పటికైనా జాగ్రత్తలు తీసుకోకపోతే చాలా నష్టపోవలసి వస్తుంది.

**'కాఫిర్' అంటే ఎవరు?**

ఈ వ్యాసంపై కూడా మంచి స్పందన వచ్చింది. ఇన్షా అల్లాహ్ ఇటువంటి ముఖ్యమైన పదాలన్నింటిని అందరికీ సులభంగా అర్థమయ్యే విధంగా అందించాలని ప్రయత్నిస్తున్నాము. ఈ నెల 'ముష్రిక్' అంటే ఎవరో ఖుర్ఆన్ మరియు సున్నత్ ప్రకారం వివరించడం జరిగింది. వచ్చే నెల మరో పదాన్ని ఇన్షా అల్లాహ్ అందిస్తాము.

**మీ అభిప్రాయాలను, విమర్శలను కార్డుపై వ్రాసి 'వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ' ఎడ్రస్‌కు గాని లేదా velugubaata@gmail.com కు పంపండి.**

**Printed by** Md. Athaharullah, **Published by** Md. Athaharullah **Owned by** Velugubaata Educational Society (Regd.No. 569/2008), Samalkot and **Printed at** '*Akash Industries*', G-14, Industrial Estate, Samalkot - 533440 and **Published at** 2-8-31, Kota Bazar, Samalkot - 533440,
**Editor:** Md. Athaharullah , Phone : 9347046090, Email: velugubaata@gmail.com, RNI Regd. No. APTEL/2009/29650

حَـدَّثَـنَـا عَبْـدُ اللهِ بـنُ مُـنِيـرٍ: سَمعَ وَهْبَ بن جَرِيرٍ و عَبْدَ الـمَـلـك بـنَ اِبْرَاهِيمَ قالا: حدَّثَنا شُعْبَةُ عَنْ عُبَيْدِ اللهِ ابنِ أبـي بَـكْـرِ بـنِ أنَـسٍ، عـن أنسٍ رَضِيَ اللهُ عَنْهُ قالَ: سُئِلَ النَّبِيُّ ﷺ عَـنِ الـكَـبـائِـرِ قالَ: ((الإِشْرَاكُ باللهِ، و عُقُوقُ الـوَالـدَيْـنِ، و قَتْـلُ الـنَّـفْسِ و شَهادَةُ الزُّورِ)) تابَعَهُ غُنْدَرٌ وأبُو عامِرٍ وبَهْزٌ و عَبْدُ الصَّمَدِ عَنْ شُعْبَةَ.

అనస్ (రజి) ఉల్లేఖనం.

మహా పాపాల గురించి ప్రవక్త(స)వారు అడగబడ్డారు.

ఆయన(స) చెప్పారు, "అవి:

- అల్లాహ్‌కు సాటి కల్పించడం
- తల్లిదండ్రుల పట్ల అవిధేయత చూపడం
- మనిషిని చంపడం (హత్య చేయడం)
- తప్పుడు సాక్ష్యం ఇవ్వడం

(సహీహ్ బుఖారీ, 2653, పుస్తకం 52 (కితాబుష్షహాదాత్), అధ్యా. 10, సంపుటి 3)

SAANTHIBAATA MONTHLY September, 2010
Registered with Registrar of News Papers for India
Postal Concessional Registration No. AP/KD/140/2011-2013

Samalkot-533440 (East Godavari Dist.)
RNI Reg. No. APTEL/2009/29650

ఓ మానవులారా! నిశ్చయంగా మేము
మిమ్మల్ని ఒక పురుషుడు మరియు ఒక స్త్రీ
నుండి పుట్టించాము మరియు మీరు ఒకరి
నొకరు గుర్తించుకోవడానికి మిమ్మల్ని
జాతులుగా మరియు తెగలుగా చేశాము.
నిశ్చయంగా, మీలో ఎక్కువ దైవభీతి
గలవాడే, అల్లాహ్ దగ్గర ఎక్కువ గౌరవం
గలవాడు. నిశ్చయంగా, అల్లాహ్
సర్వజ్ఞుడు, సర్వం తెలిసినవాడు"
[ఖుర్'ఆన్ 49:13]

visit
www. saanthibaata.net
Authentic Islamic website
in
TELUGU